

అమ్మ
రూ|| 350/-
పేజీలు: 400
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



రగులుతున్న అమెరికా
సిరియాలో మళ్లీ అంతర్యుద్ధం
సరైన సమయంలో భారత్ పర్యటన
సెప్టెంబర్‌లో క్వాడ్, ఎస్‌సిఒ – మోదీ గడసాము
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 229 | శనివారం | 19-07-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


### రెండు రాష్ట్రాలు సమానమైతే

# రాయలసీమ ఎత్తిపోతలను రద్దు చేయాలి



- పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలకు అడ్డుపడొద్దు
- ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- మా వినతిని వినకపోతే పోరాడి సాధించుకుంటాం
- ఆ ఉద్యమానికి నేనే నేతృత్వం వహిస్తా
- ఉమ్మడి రాష్ట్రంలో కంటే కెసిఆర్ హయాంలోనే పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులకు ఎక్కువ ద్రోహం
- రెండేళ్ళలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను పూర్తిచేస్తాం
- ప్రజాపాలన ప్రగతిబాట సభలో ముఖ్యమంత్రి
- నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన



**2034 వరకు పాలమూరు బిడ్డే సిఎం**

‘‘కెసీఆర్ నీ గుండెలపై రాసి పెట్టుకో..2034 వరకు ఈ పాలమూరు బిడ్డ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉంటాడు.. పాలమూరు గడ్డ నుంచే ప్రభుత్వాన్ని నడిపిస్తాడు. అక్కడ సూర్యుడు ఇక్కడ మొలిచినా పాలమూరును అభివృద్ధి చేసితీరుతాం’’అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలోని 3,52,635 స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల కోసం రూ. 344 కోట్లతో చెక్కులను ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు.

**హైదరాబాద్ :** మీరు రెండు రాష్ట్రాలను సమానంగా, తెలుగువాళ్ళను అభివృద్ధి చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన నిజమే అయితే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజక్టును తక్షణమే రద్దు చేయాలని, పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజక్టులకు అడ్డం పడొద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తిని, వినకపోతే పోరాడి సాధించుకునే శక్తి ఉందని, దాని తానే నేతృత్వం వహిస్తానని చెప్పారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు ఉమ్మడి రాష్ట్రంలో కంటే కెసిఆర్ హయాంలో ఎక్కువ ద్రోహం చేశారని విమర్శించారు. రెండేళ్ళలో తమ ప్రభుత్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేస్తుందని, అందుకు సంబంధించిన భూ సేకరణకు డిసెంబర్ 9లోగా నిధులను విడుదల చేస్తుందని ప్రకటించారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎంపి డాక్టర్ మల్లు రవి, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు,

తరువాయి 2లో

### ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

# ఆరుగురు మావోయిస్టులు హతం



**కొనసాగుతున్న కాల్పులు**

ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరోసారి ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. శుక్రవారం నారాయణ్‌పూర్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టులకు నడుమ చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ఆ రాష్ట్రపోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య మధ్యాహ్నం నుండి పలుమార్లు కాల్పులు జరిగాయని, చీకటి పడే సమయం వరకు ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నప్రాంతం నుండి ఆరు మృతదేహాలు స్వాదీనం చేసుకున్నారు. ఏకే 47, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలు, నిత్యవసర సరుకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా ఆపరేష్ ఇంకా కొనసాగుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# మహానగరం జలమయం





ప్రజాపక్షం/హైదరాబాద్

- గ్రేటర్ హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలుప్రాంతాల్లో జంక్షన్లు జామ్
- రోడ్లపై విరిగిపడిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- బోయిన్‌పల్లిలో అత్యధికంగా 9.3 సెం.మీ. వర్షం
- రాష్ట్రంలో మరో నాలుగురోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

గ్రేటర్ హైదరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి చాలా ప్రాంతాల్లో వరద నీరు ముంచేత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు చెరువులను తలపించాయి. నగరంలోని అనేక ప్రాంతాల్లో జంక్షన్‌లు జామ్ అయ్యాయి. జనం ట్రాఫిక్ జామ్‌తో నరకయాతన అనుభవించారు. జిహెచ్‌ఎంసి, హైడ్రా, డిఆర్‌ఎఫ్ బృందాలు ఎప్పటికప్పుడు వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాయి. రోడ్లపై విరిగిపడిన చెట్లను క్రమక్రమంగా తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. గాలి దుమారంతో

తరువాయి 2లో

**అప్రమత్తంగా ఉండాలి : సిఎం ఆదేశం**

హైదరాబాద్‌లో భారీ వర్షం నేపథ్యంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జిహెచ్‌ఎంసి, హెచ్ ఎండిఎ, వాటర్ వర్క్స్, విద్యుత్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా బృందాలు, ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వర్షంతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించారు.

# జడ్జిమెంట్ ఇచ్చేందుకు కాదు..



- బనకచర్ల సమస్య పరిష్కారం కోసమే తెలుగు రాష్ట్రాల సిఎంలను పిలిచాం
- బిఆర్ఎస్‌ది ద్వంద్వ వైఖరి
- త్వరలోనే వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం
- కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిచింది జడ్జిమెంట్ ఇవ్వడానికి కాదని, బనకచర్ల ప్రాజెక్టు సమస్య పరిష్కారం కోసం పిలిచామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే చేసుకుంది అంటున్నారని, చేసుకోకపోతే ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులను కూర్చోపెట్టాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక పాలసీ, అధికారంలో లేనప్పుడు మరొక్క పాలసీ అవలంబిస్తోందని మండిపడ్డారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక పాత్రలు పోషించారంటూ ఎద్దేవా చేశారు. కేంద్రానికి

తరువాయి 2లో



### కనీస ఉమ్మడి కార్యక్రమంతో

# ప్రతిపక్ష ఐక్యత

- సిపిఐ ముసాయిదా రాజకీయ తీర్మానం విడుదల
- ఆర్ఎస్ఎస్–బిజెపికి వ్యతిరేకంగా సైద్ధాంతిక స్పష్టత
- దాని ఆధారంగానే సూత్రబద్ధ సహకారం, లౌకిక ప్రజాస్వామ్య శక్తుల సమీకరణ
- రాజ్యాంగం, ప్రజాస్వామ్య సంస్థల రక్షణే ప్రధాన రాజకీయ కర్తవ్యం
- సెప్టెంబర్‌లో 21–25 తేదీలలో చండీగఢ్‌లో సిపిఐ 25వ మహాసభ ముసాయిదా తీర్మానంపై చర్చ

**న్యూఢిల్లీ :** కనీస ఉమ్మడి కార్యక్రమం ద్వారా ప్రతిపక్ష ఐక్యతను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు చేయాలని సిపిఐ ముసాయిదా రాజకీయ తీర్మానం పేర్కొంది. మతపరమైన విభజనను బిజెపి తీవ్రతరం చేసిందని, సంస్థాగత స్వయంప్రతిపత్తిని కబళించిందని, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరించిందని అది పేర్కొంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్య సంస్థల రక్షణను పార్టీ ప్రధాన రాజకీయ కర్తవ్యంగా చూస్తుందని స్పష్టం చేసింది. ఢిల్లీలోని అజయ్‌భవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో సెప్టెంబర్‌లో చండీగఢ్‌లో జరగనున్న సిపిఐ 25వ జాతీయ మహాసభలో ప్రవేశపెట్టనున్న రాజకీయ తీర్మానం ముసాయిదాను సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విడుదల చేశారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లబ్ సేన్‌గుప్తా, డాక్టర్ బి.సి.కాంగో, సయ్యద్ అజీజ్‌పాషా, అన్నీ రాజా, గిరీశ్‌శర్మ పాల్గొన్నారు. రాజకీయ తీర్మానంలో ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి. “ ఆర్‌ఎస్‌ఎస్— బిజెపి రాజ్, వారి వినాశకరమైన విధానాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక స్పష్టత, సూత్రబద్ధమైన సహకారం ఆధారంగా ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను సమర్థవంతంగా సమీకరించడానికి కట్టుబడి ఉన్నట్లు’’ సిపిఐ పేర్కొంది. ‘బిజెపి పరిపాలనలో ఆర్థిక వ్యవస్థ మరింత అసమానంగా,

తరువాయి 12లో

### వినియోగంలోకి

# జలవిద్యుత్ ప్రాజెక్టులు

- పవర్ ప్రాజెక్ట్ యూనిట్లు ఆలస్యం కాకుండా చూసుకోవాలి : డిప్యూటీ సిఎం భట్టి
- నాగార్జున సాగర్ జెన్‌కో పవర్ హౌస్ పరిశీలన
- లోక్‌సభ ఎన్నికల్లో గుండుసున్నా వచ్చినా బిఆర్ఎస్ నేతల తీరు మారలేదని విమర్శ



ప్రజాపక్షం/నందికొండ

రాష్ట్రంలోని అన్ని హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్రాజెక్టులలోని అన్ని యూనిట్లు వినియోగంలోకి తీసుకురావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.శుక్రవారం అయన నాగార్జునసాగర్ జెన్‌కో పవర్ హౌస్ లో రాష్ట్రంలోని హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ముందుగా అధికారులు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఆయా పవర్ ప్రాజెక్టుల వారీగా ప్రస్తుత పరిస్థితిని వివరించారు. నిర్దేశించిన సమయం ప్రకారం వాటిని పూర్తి చేయాలన్నారు .పవర్ ప్రాజెక్టు యూనిట్లు ఆలస్యం కాకుండా చూసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం ఉండవద్దని,అన్ని ప్రాజెక్టుల పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని,ఇందుకొక క్యాలెండర్ ను రూపొందించాలని,ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో దాని ప్రకారం ప్రతి వారం సమీక్షించాలని, ముందు నుండే సమీక్షలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి సంవత్సరం పవర్ కు డిమాండ్ పెరుగుతున్నదని, సంవత్సర కాలంలోనే 2000 మెగావాట్ల పవర్ డిమాండ్ పెరిగిందని, పెరుగుతున్న పవర్ డిమాండ్‌ను దృష్టిలో

తరువాయి 2లో

### లోకేష్‌ను కలువలేదు..

# కలిస్తే తప్పేంటి?



- సిఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- ఆయన మంత్రుల ఫోన్లే ట్యాప్ చేయిస్తున్నారు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాపక్షం/ ఖమ్మం

ఆంధ్రప్రదేశ్ మంతి నారా లోకేశ్‌ను కలిసిస్తే తప్పేమిటని, యువ నాయకుడైన లోకేష్‌కు, తనకు సత్సంబంధాలున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. అర్థరాత్రి తాను లోకేష్‌ను కలిసినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుడుగా ప్రచారం చేస్తున్నారని, తాను ఏం చేసినా బాజాప్తగా చేస్తానన్నారు. సిఎం సీటుకు ఎవరు ఎసరు పెడతారనే భయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన క్యాబినెట్‌లోని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ల ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నాడని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్

తరువాయి 12లో

# ఈ ఏడాదైనా పూర్తయ్యేనా?

- కాజీపేటలో సాగుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు
- నేడు పనులను పరిశీలించనున్న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్





ప్రజాపక్షం/హనుమకొండ

కాజీపేటలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు రెండేండ్లుగా సాగుతూనే ఉన్నాయి. ఈ పనులను ఈ ఏడాది ఆగస్ట్ నాటికి పూర్తి చేయాలని కేంద్రం టార్గెట్ పెట్టుకోగా ఇప్పటివరకు 73 శాతం పనులు పూర్తికాగా... మిగతా పనులను సైతం త్వరలోనే పూర్తి చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాగా తొలుత కాజీపేట కేంద్రంగా పీరియాడికల్ ఓవర్ హాలింగ్ వర్క్ షాప్ (పీఓహెచ్) ఏర్పాటు చేయనున్నట్లు 2010లో కేంద్రం ప్రకటించగా ఆ తరువాత 2016లో పీఓ హెచ్‌ను వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్ గ్రేడ్ చేశారు. ఈ పనులకు 2023 జులై 8న ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దీంతో

తరువాయి 12లో

### ‘పంచాయతీరాజ్ చట్టం-2018 ఆర్డినెన్స్ ముసాయిదా’పై

# గవర్నర్ న్యాయ సలహా!

**ఇతర రాష్ట్రాలలో అమలు తీరుపై ఆరా?**

ప్రజాపక్షం/హైదరాబాద్



‘తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం 2018’ సవరణ ఆర్డినెన్స్ ముసాయిదా ఆమోదం విషయంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ న్యాయసలహా కోరినట్టు సమాచారం. స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే విషయమై ‘పంచాయతీరాజ్ చట్టం 2018 ’ను సవరిస్తూ మంత్రివర్గం తీర్మానం చేస్తూ ఆర్డినెన్స్ ముసాయిదాను గవర్నర్‌కు పంపించారు. ఆర్డినెన్స్ ప్రకారం రాష్ట్రంలో రిజర్వేషన్ల సంఖ్య 67 శాతానికి పెరుగుతుంది. (బిసిలకు 42, ఎస్‌సిలకు 18,ఎస్‌టిలకు 10శాతం) . అయితే సుప్రీం కోర్ట్ నిర్దేశించిన 50 శాతం పరిమితి దాటుతున్న నేపథ్యంలో ఆర్డినెన్స్ ఆమోదం విషయంలో న్యాయ సలహా తీసుకుంటున్నట్టు తెలిసింది. అయితే గత సుప్రీం తీర్పు ప్రకారం గవర్నర్లు

తరువాయి 2లో



### ప్రమాదవశాత్తు గోడకూలి ఇద్దరు కూలీలు మృతి

ప్రజాపక్షం / చెన్నూరు

ప్రమాదవశాత్తు గోడ కూలి ఇద్దరు మృతిచెందిన ఘటన మంచిర్యాల జిల్లా, కోటపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రెడ్డి మధునయ్య, శేగం తిరుపతి అనే ఇద్దరు కూలీలు శుక్రవారం పాత ఇళ్లు కూల్చే పనికి వెళ్లారు. పనకంటి శ్రీనివాస్‌కు చెందిన ఇంటిని కూల్చివేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి ఇద్దరు కూలీలపై పడింది. వెంటనే వారిని 108 అంబులెన్సులో

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## చర్చిపై దాడి తప్పే
### అంగీకరించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

**వాషింగ్టన్:** గాజాలో క్యాథలిక్ చర్చిపై దాడి చేయడం తమ తప్పిదమేనని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అంగీకరించారు. ఇద్దరి ప్రాణాలు హరించి, మరికొందరిని తీవ్రంగా గాయపరచిన ఘటనపై అమెరికా డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నెతన్యాహుకు ఆయన ఫోన్ చేసి, ఇదే విషయాన్ని ప్రస్తావించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ ఈ సంభాషణ వివరాలను విడుదల చేశారు. గాజాలోని ఏకైక చర్చిపై దాడి జరగడాన్ని అమెరికా తీవ్రంగా ఖండించగా, ఇజ్రాయెల్ ప్రధాని పొరపాటు జరిగినట్లు ట్రంప్‌కు తెలిపారు. అనంతరం ఇజ్రాయెల్ అధికారికంగా ఒక ప్రకటన చేసింది. గాజాలో చర్చిపై దాడి పట్ల విచారం వ్యక్తం చేసింది. ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటించింది. దాడిపై విచారణ ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం పేర్కొంది. ఇలా వుంటే, జనావాసాలు, ప్రార్థనా మందిరాలు, విద్యాలయాలపై ఇజ్రాయెల్ దాడులు ఇదే మొదటి సారి కాదు. ఈసారి ఏకంగా క్యాథలిక్ చర్చిపైనే దాడి జరపడంతో అమెరికా తీవ్రంగా స్పందించింది.

# రగులుతున్న అమెరికా






అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. 'పబ్లిక్ సిటిజెన్' ఆధ్వర్యంలో చేపట్టిన ప్రదర్శనలు, ర్యాలీలకు ఆ సంస్థ సహాధ్యక్షురాలు లీసా గిల్బర్ట్ నాయకత్వం వహించారు. అమెరికాలో మానవ హక్కుల ఉద్యమకర్త మార్టిన్ లూథర్ కింగ్‌కు ముఖ్య అనుచరుడిగా, ఆయన పంథాలోనే నడిచిన జాన్ లూయిస్ అందించిన స్ఫూర్తితోనే ఆందోళనలు ఉధృతం చేస్తామని లీసా ప్రకటించారు. అక్రమ వలసల పేరుతో వేధింపులు, ఆరోగ్య బీమాలో మార్పులు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులకు ఉద్వాసన వంటి చర్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దేశ వ్యాప్త నిరసనలు ప్రారంభం కావడం అమెరికాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతున్నది.

## సరైన సమయంలో భారత్ పర్యటన
### నేపాల్ ప్రధాని ఓలి



**ఖట్మండు:** సరైన సమయంలో భారత్‌లో పర్యటిస్తానని, ఈ విషయంపై ఇరు దేశాల అధికారులు కసరత్తు చేస్తున్నారని నేపాల్ ప్రధాని కెపి శర్మ ఓలి అన్నారు. నేపాలీ యూట్యూబ్ చానెల్ 'దిశానిర్దేశ్' టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ భారత్ పర్యటనకు వెళ్లే అవకాశాలు లేకపోలేదని అన్నారు. ఇరు వైపుల నుంచి సంబంధిత అంశాలపై స్పష్టత వచ్చిన తరాఇ్వత పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. అయితే, ఎప్పుడు వెళతారనేది ఆయన స్పష్టం చేయలేదు. గత ఏడాది జులైలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్-లెనినిస్ట్) పార్టీ (సిపిఎన్-యుఎంఎల్) అధికారంలోకి వచ్చిన తర్వాత, పార్టీ చైర్మన్‌గా ఉన్న ఓలి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నేపాల్ ప్రధాని భారత్ పర్యటనకు రావడం ఆనవాయితీగా వస్తుండగా, ఓలి అందుకు భిన్నంగా చైనా పర్యటనకు వెళ్లడం అప్పట్లో చర్చనీయాంశమైంది. భారత్‌కు ఓలి అంటే పడదనే వాదన చాలాకాలంగా బలంగా వినిపిస్తున్నది. అయితే, ఈ ప్రచారాన్ని ఓలి ఖండించారు. నేపాల్‌కు చైనా, భారత్ రెండూ అత్యంత కీలకమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. నేపాల్ పర్యటనకు రావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించానని, బహుశా ఈ ఏడాది నవంబర్ మాసంలో ఆయన పర్యటన ఉండవచ్చని పేర్కొన్నారు. భారత్‌లో పర్యటించాల్సిందిగా ఇప్పటి వరకూ ఎలాంటి ఆహ్వానం ఓలికి అందలేదన్న వార్త కూడా ప్రచారమవుతున్నది. అయితే, దీనిపై ఆయన స్పందించలేదు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్, చైనా దేశాలతో నేపాల్‌కు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. భారత్ పర్యటనకు సరైన సమయం అవసరమని వ్యాఖ్యానించారు.

## సిరియాలో మళ్లీ అంతర్యుద్ధం



**డమాస్కస్:** సిరియాలో మళ్లీ అంతర్యుద్ధం మొదలైంది. ద్రూస్, బెడౌయిన్ వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కనీసం వారం రోజులు కూడా అమలుకాలేదు. పలు ప్రాంతాల్లో ఇరు వర్గాల మధ్య తిరిగి ఘర్షణలు చెలరేగడంతో, సిరియా ప్రభుత్వం సైన్యాన్ని అప్రమత్తం చేసింది. సిరియా దక్షిణ ప్రాంతం, ప్రత్యేకించి స్వెయిదా ప్రావీన్స్‌లో ఘర్షణలు తీవ్ర స్థాయికి చేరగా, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ద్రూస్ అనేది ఇస్లాం నుంచి పుట్టిన ప్రత్యేక మతం. ఎక్కువగా సిరియా, లెబనాన్, ఇజ్రాయెల్, జోర్డాన్ లో నివసిస్తారు. గోప్యంగా మతాచారాలు పాటిస్తారు. తమ మతాన్ని బయట వ్యక్తీకరించడానికి ఇష్టపడరు. సిరియా జనాభాలో సుమారు 3 శాతం మంది ద్రూస్‌లు. స్వెయిదా ప్రాంతంలో వీరి సంఖ్య ఎక్కువ. ఇక అరబ్ సంస్కృతికి చెందిన నోమాడిక్ (చరిత్రకంగా గడ్డి మేకలతో సంచరించే) జాతులైన బెడౌయిన్‌తో వీరి ఘర్షణ దశాబ్దాలుగా కొనసాగుతున్నది. ద్రూస్‌ల వద్ద ఎక్కువగా సాగు భూములు ఉన్నాయి. తరచూ బెడౌయిన్‌ల మేకలు, ఒంటెలతో భూముల్లోకి ప్రవేశించడం ఘర్షణలకు దారితీసింది. నీటి వనరులపై స్వాధీనం కోసం కూడా యుద్ధాలు జరుగుతున్నాయి. ద్రూస్‌లు తమను తాము రక్షించుకునే మిలీషియాలను ఏర్పాటు చేసుకున్నారు. బెడౌయిన్‌లకు కొన్ని చోట్ల ప్రభుత్వ మద్దతు ఉంది. మరి కొన్ని ప్రాంతాల్లో వారు తిరుగుబాటుదారులకు మద్దతు ఇస్తున్నారు. ద్రూస్‌లలో 'బలిజా' అనే రీతిలో ప్రతీకారం తీసుకునే సంప్రదాయం ఉంది. బెడౌయిన్‌లు కూడా గౌరవం, పరువు విషయంలో ఆగ్రహం వ్యక్తం చేయడంలో వెనుకాడరు. ఇరు వర్గాలు పంతాలకు పోవడంతో, సిరియాలో అంతర్యుద్ధం తీవ్ర స్థాయికి చేరింది. ప్రభుత్వ చర్యలు అనుకున్న స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు. సుమారు వారం రోజుల క్రితం ఇరు వర్గాల మధ్య కాల్పుల ఒప్పంద విరమణ ఒప్పందం జరిగింది. కానీ, అది ఎక్కువ కాలం సాగలేదు.



## ఉక్రేన్‌కు ప్యాట్రియట్ క్షిపణి
### అందించేందుకు సిద్ధమని నాటో ప్రకటన

బ్రసెల్స్: రష్యాపై ఉక్రేన్ దాడులు చేయడానికి ఆయుధాలు సరఫరా చేస్తున్న నాటో కూటమి ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. రష్యా దాడుల నుంచి ఉక్రేన్‌ను రక్షించేందుకు వీలుగా శక్తివంతమైన రక్షణ కల్పించే ప్యాట్రియట్ క్షిపణి వ్యవస్థను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది. ఉక్రేన్‌కు మరిన్ని ప్యాట్రియట్ మిస్సైల్ సిస్టమ్స్ పంపిణీ చేయడానికి అమెరికా, జర్మనీ, నెదర్లాండ్స్ దేశాలు సిద్ధంగా ఉన్నాయని, రష్యా అధిక శక్తితో దాడులు చేస్తున్న నేపథ్యంలో ఇది తక్షణ అవసరంగా మారిందనినాటోకు యూరోప్ కమాండర్‌గా వ్యవహరిస్తున్న జెన్ క్రిస్టోఫర్ గ్రీన్‌కెవిచ్ ప్రకటించారు. ఈ వ్యవస్థ శత్రు క్షిపణులు, డ్రోన్లు, విమానాలను గుర్తిస్తుంది. నియంత్రిస్తుంది. దాడి జరిపి నాశనం చేస్తుంది. ప్రత్యేకించి, 70–160 కిలోమీటర్ల పరిధిలో బాలిస్టిక్ మిసైల్‌ను నిలువరించడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. రష్యా ప్రయోగిస్తున్న ఇస్కాండర్, కలిబర్ వంటి ఖచ్చిత లక్ష్య క్షిపణులను అడ్డగించగలదు. ఇలావుంటే, జర్మనీ, నెదర్లాండ్స్ దేశాలు ఇప్పటికే ఉక్రేన్‌కు రెండు ప్యాట్రియట్ సిస్టమ్స్ ఇచ్చాయి. ఇప్పుడు నాటో కూటమి నేరుగా సహకరించనుంది. రష్యా–ఉక్రేన్ యుద్ధాన్ని నిలువరించడానికి ప్రయత్నించకుండా, మరింత రెచ్చగొడుతూ, అమెరికా, ఐరోపా దేశాలు ఆయుధ వ్యాపారం చేస్తున్న విషయం తెలిసిందే. నాటో కూటమి తాజాగా తీసుకున్న నిర్ణయం కూడా ఇలాంటిదే.

## జడ్జిమెంట్ ఇచ్చేందుకు కాదు..
(మొదటి పేజీ తరువాయి)

జోక్యం చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసిందని, ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశాన్ని బిఆర్‌ఎస్ తప్పు పట్టడం ఏంటి అంటూ ప్రశ్నించారు. ఒక రాష్ట్రానికి అనుకూలంగా, మరొక రాష్ట్రానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వరన్నారు. కృష్ణా, గోదావరి జలాలపైన ఇద్దరు ముఖ్యమంత్రులు వేర్వేరు ఎజెండాలతో వచ్చారన్నారు. గోదావరి జలాల వినియోగంపైన రేవంత్ రెడ్డి ఏదైనా కార్యాచరణ రూపొందించారా? అని ప్రశ్నించారు. కేంద్రాన్ని, మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రెండు రాష్ట్రాలకు న్యాయం చేయాలనేదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు. యూరియా కొరత లేకుండా చూసే బాధ్యత కేంద్రానిదన్నారు. బ్రిటీష్ కాలంలో ఉన్న రిజర్వేషన్లను ముస్లిం రిజర్వేషన్లు ఎట్లా అవుతాయని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం బిసి ముస్లింల పేరు మీద పది శాతం రిజర్వేషన్ ఇచ్చిందన్నారు. పది శాతం పోతే బిసిలకు దక్కేది 32 శాతం మాత్రమే అని అన్నారు. దీనివల్ల బిసిలకు మేలు జరుగుతుందా, అన్యాయం జరుగుతుందా ఆలోచించాలన్నారు. మతపరమైన రిజర్వేషన్లు పక్కన పెట్టి బిసిలకే ఇవ్వాలన్నదే బిజెపి విధానమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

**త్వరలోనే వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం :** త్వరలోనే వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం కాబోతుందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపి బుర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, నాయకులు ఎన్.వి.సుభాష్, ప్రకాష్ రెడ్డిలతో కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆ నాటి ప్రధాని పి.వి. నరసింహారావు హయాం నుంచి వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ కావాలని అనేక పోరాటాలు జరిగాయన్నారు. రైలు మ్యాను ఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్యంయు)కి ప్రధాని మోదీ భూమి పూజ చేశారని, రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ 60 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనుల పురోగతిని పరిశీలిస్తారని చెప్పారు. రైలు ఇంజన్, కోచ్, వ్యాగన్స్ ఉత్పత్తి అయ్యేలా ప్లాన్ చేస్తున్నామన్నారు. ముందుగా రైలు ఇంజన్ తయారీ చేయాలని నిర్ణయించామని చెప్పారు.

**రూ.2 వందల కోట్లతో ప్రారంభమై.. మరో రెండు వందల కోట్లకు పెరిగే అవకాశం :** రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ వచ్చే ఏడాది ఉత్పత్తి ప్రారంభించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని కిషన్ రెడ్డి అన్నారు. రెండు వందల కోట్లతో ప్రారంభమైందని, మరో రెండు వందల కోట్ల వరకు బడ్జెట్ పెరిగే అవకాశం ఉందని కిషన్ రెడ్డి వెల్లడించారు. వరంగల్‌లో ఆధునికమైన కోచ్‌లు తయారు చేసే అవకాశం ఉందన్నారు. సుమారు మూడు వేల మందికి ఉపాధి అవకాశం లభిస్తుందన్నారు. ఇక్కడ నివసించే రాజస్థాన్ ప్రజలు రైలు కావాలని కోరుతున్నారని, శనివారం రాజస్థాన్‌కు రైల్ ప్రారంభిస్తున్నామన్నారు. ఎంఎంటిఎస్ రెండో పేజ్ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందానికి కట్టుబడి లేదని విమర్శించారు. యాదగిరిగుట్టకు ఎంఎంటిఎస్‌ను విస్తరిస్తున్నామన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ జనవరిలో భక్తులకు అంకితం చేస్తామన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కూడా వచ్చే సంవత్సరం ప్రజలకు అంకితం చేస్తామని ప్రకటించారు. కాచిగూడ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు కూడా ప్రారంభిస్తామని వివరించారు.

**వరంగల్‌కు మెగా టెక్స్ లైట్ పార్క్ తీసుకువచ్చాం :** వరంగల్‌కు మెగా టెక్స్ టైల్ పార్క్ తీసుకురావడం జరిగిందని కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పాలకులు మాత్రం హైదరాబాద్ చుట్టే ఆలోచన చేస్తున్నారని వ్యాఖ్యనించారు. వరంగల్ విమానాశ్రయానికి భూమి సేకరించి ఇవ్వాలని గత సిఎం కెసిఆర్‌కు అనేక లేఖలు రాసినట్లు చెప్పారు. కెసిఆర్ రాళ్ల వేయడం, విమర్శించడం తప్ప, భూమి సేకరించి ఇవ్వలేదని అన్నారు.

## ఇద్దరు కూలీలు మృతి
(మొదటి పేజీ తరువాయి)

చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే ఆ ఇద్దరు కూలీలు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆ రెండు కుటుంబాల్లో పెద్ద దిక్కును కోల్పోవడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన ఎస్‌ఐ రాజేందర్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## మహానగరం జలమయం
(మొదటి పేజీ తరువాయి)

చాలా ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి జనం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కార్యాలయాలు, పాఠశాలలు వదిలే సమయం కావడంతో ఒకసారిగా వచ్చిన వరదనీటి ఉధృతికి విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. సికింద్రాబాద్ సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ సమీపంలో వరద నీరు మోకాళ్ళ లోతుకుపైగా చేరుకుంది. దీంతో విద్యార్థులను పాఠశాల యాజమాన్యం బయటికి రానివ్వలేదు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఆటోడ్రైవర్లు విద్యార్థులను దగ్గరుండి తీసుకెళ్లారు. మోకాళ్ళ లోతు వరద నీరుచేరడంతో విద్యార్థులు ఇబ్బందులు వర్ణాతీతంగా మారాయి. బోయిన్‌పల్లిలోని సాయిబాబా కాలనీ, సీతారాంపురం, హర్షవర్ధన్ కాలనీ, రామ్ రెడ్డి కాలనీ, శ్రీనివాస్ నగర్ కాలనీ, సహా పలు కాలనీల్లో చెరువులను తలపించేలా భారీగా వరద నీరు చేరింది. భారీగా వస్తున్న వరద నీళ్లకు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీగా వరద నీరు వచ్చి చేరడంతో పాదచారులు భయాందోళనకు గురికాగా, ఇళ్లలోకి వెళ్లేందుకు కంటోన్మెంట్ సానిటరీ సిబ్బంది వారికీ సాయం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ పర్యటించారు. సహాయ చర్యలను పర్యవేక్షించారు.

**నిండు కుండలా హుస్సేన్ సాగర్:** ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్ కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బంజారా హిల్స్, పికెట్, కూకట్ పల్లి నాళాల నుంచి హుస్సేన్ సాగర్ లోకి వస్తున్న వరద కారణంగా సాగర్ నిండుకుండలా మారింది. హుస్సేన్ సాగర్‌లో నీటిమట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్ కు చేరుకుంది. హుస్సేన్ సాగర్ ప్రస్తుత నీటి మట్టం 513.38 మీటర్లకు చేరుకుంది. దీంతో నిండుకుండలా మారింది. హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 513.41 మీటర్లు. శుక్రవారం కురిసిన వర్షానికి కేవలం 0.3 మీటర్లే ఉంది. పూర్తి స్థాయిలో నిండిపోతుందని అధికారులు తెలిపారు. భారీగా వరద నీరు చేరటంతో నిండుకుండలా ప్రమాదకరంగా సాగర్ మారిపోయింది. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు నీళ్లను తూముల ద్వారా మిగులు జలాలలను దిగువకు విడుదల చేశారు.

**బోయిన్ పల్లిలో అత్యధిక వర్షపాతం :** హైదరాబాద్‌లో దాదాపు మూడు గంటలు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. బోయిన్ పల్లిలో అత్యధికగా 9.3 సెం.మీ. వర్షం నమోదైంది. బండ్లగూడలో 9.18 సెంమీ వర్షం కురిసింది. 11 ప్రాంతాల్లో 7 నుంచి 8 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. మారేడ్‌పల్లిలో 7.6 సెంటీమీటర్లు, మల్కాజ్ గిరిలో 7.35 సెంటీమీటర్లు, ఉప్పల్ లో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముషీరాబాద్, బండ్లగూడ, బాలానగర్, అంబర్ పేట్, సైదాబాద్ ప్రాంతాల్లో 5 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. హయత్ నగర్, హిమాయత్ నగర్, బండ్లగూడ ప్రాంతాల్లో 4.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**మరో నాలుగు రోజులు భారీ వర్షాలు :** రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసవరమైతేనే బయటకు వెళ్లాలన్నారు. పలు జిల్లాలకు ఎల్లో, ఆరేజ్, రెడ్ హెచ్చరికలు జారీ చేశారు. దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని జిల్లాల్లో 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్రవారం ఆదిలాబాద్, జగిత్యాల, జనగాం, గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల, సిద్దిపేట, సూర్యాపేట, వనపర్తి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. శనివారం సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో, ఆదివారం రంగారెడ్డి, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో, సోమవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో, మంగళవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు.

## రద్దు చేయాలి
(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం జరిగి 'ప్రజా పాలన–ప్రగతిబాట సభ'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ''ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం ప్రాజెక్టు వెనుక నుంచి 4 టిఎంసిలను తీసుకెళ్ళాల్సి ఉంటే ఇవ్వాళ తొమ్మిదిన్నర టిఎంసిల నీరు తీసుకెళ్లేందుకు మీరు ప్రాజెక్టులు కట్టుకుంటున్నరు. అందుకే చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తున్న.. రోజుకు 3 టిఎంసిలను తరలించుకుపోయే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రద్దు చేసి , మీ ఉదారత్వం ప్రదర్శించండి. మీరు రెండు రాష్ట్రాలను సమానంగా, తెలుగువాళ్ళను అభివృద్ధి చేయాలన్నది ఆలోచన నిజమైతే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను తక్షణమే రద్దు చేయండి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, డిండి, కల్వకుర్తి, కోయల్ సాగర్ బీమాలను పూర్తి చేయడానికి మీరు ఉదారంగా మాకు సహకరించండి'' అని విజ్ఞప్తి చేశారు. ''మీరు సిఎంగా ఉన్నప్పుడే పాలమూరు జల్లాలో కల్వకుర్తి, బీమా , నెట్టెంపాడు, కోయల్‌సాగర్ ప్రాజెక్టులు వచ్చినవి. మీరు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పనులు ప్రారంభమయ్యాయి. మీరు పదేళ్ళు ప్రతిపక్ష నాయకుడిగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మొదలైన ప్రాజెక్టులను మీరు అడ్డుకోవడం ఎంత వరకు న్యాయం?''ప్రాజెక్టులను చంద్రశేఖర్‌రావు కట్టకపోతే చంద్రబాబు అడ్డుకోవడం న్యాయమా?'' అని ఎపి సిఎం చంద్రబాబును రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఒకనాడు పాలమూరు జిల్లాను దత్తతు తీసుకున్నట్లు చెప్పారని, మీరు బాధ్యతగా ఉండాలని, మమ్మల్ని బతకనివ్వండి, మా ప్రాజెక్టులను పూర్తి చేసుకోనివ్వండి అని వ్యాఖ్యానించారు.

**కెసిఆర్ పదేళ్ళలో ఎందుకు పూర్తి చేయలేదు :** పదేళ్లు సిఎం గాఉండి పాలమూరు ప్రాజక్టులను కెసిఆర్ పడావు పెట్టారని, పాలమూరు రంగారెడ్డి ని పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదని, కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా ప్రాజెక్టులు ఎందుకుపూర్తి చేయలేదని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు 2019లో కట్టుడు, 2023లో కూలుడు అయిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా కెసిఆర్ పదేళ్ళలో రూ.20లక్షల కోట్లు చేతుల్లోకి వచ్చాయని, అందులో పాలమూరు ప్రాజెక్టులకు రూ.25వేల కోట్లు ఇచ్చినా 20లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేవని చెప్పారు. ఎందుకంత కడుపులో విషం పెట్టుకుని మాపై విషం చిమ్ముతున్నావన్నారు. పాలమూరు జిల్లా అంటే కెసీఆర్ కు చిన్నచూపు అని, పాలమూరులో ఊరు లేకపోయినా పార్లమెంట్ లో నోరు ఎత్తకపోయినా కెసిఆర్ ను పార్లమెంట్ కు పంపింది పాలమూరు జిల్లా అని అన్నారు. 98 జీవో ప్రకారం పదేళ్లు సిఎంగా ఉన్న కెసిఆర్ శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులను ఎందుకు ఆదుకోలేదు? అని ప్రశ్నించారు. వాల్మీకి సోదరులను ఎస్‌టి బోయలుగా మారుస్తానని చెప్పి మోసం చేశారన్నారు. పదేళ్లలో ఈ సమస్యలను పరిష్కరించి ఉంటే పాలమూరు వాసులు మళ్లీ సమస్యపై కొట్లాడే పరిస్థితి ఉండేదా? అని అన్నారు. ప్రజాపాలన చూసి కెసీఆర్ కు దుఃఖం వస్తుందట,పాలమూరు గడ్డ నుంచి రేవంత్ రెడ్డి సీఎం అయిండని నీకు దుఃఖం వస్తుందా ? అని నిలదీశారు. బలహీన వర్గాల పిల్లలు చదువుకునేందుకు 25 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నందుకు నీకు దుఃఖం వస్తుందా? పాలమూరు బిడ్డ 20 ఏండ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కంకణం కట్టుకుని పనిచేస్తున్నందుకా నీకు దుఃఖం అని రేవంత్‌రెడ్డి అన్నారు. నలభై ఏళ్లుగా మాదిగ బిడ్డలు వర్గీకరణ కోసం పోరాడుతుంటే, మాదిగ ఉపకులాల వర్గీకరణ చేసినందుకా నీకు దుఃఖం వస్తుందా అని ప్రశ్నించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అభినందించాల్సింది పోయి శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి ఆ దొంగకు సద్దులు మోస్తున్నారని మండిపడ్డారు.




## గవర్నర్ న్యాయ సలహా..!
(మొదటి పేజీ తరువాయి)

బిల్లులను ఒక నెలలోపు ఆమోదించాలని, లేదా తిరిగి పంపించాలని ఆదేశించిన నేపథ్యంలో గవర్నర్ త్వరలోనే దీనిపైన ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే గవర్నర్‌కు పంపించే ఆర్డినెన్స్ ముసాయిదాతో పాటు ఆర్డినెన్స్‌కు దారి తీసిన కారణాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా తెలియజేసినట్టు అధికారవర్గాలు పేర్కొన్నాయి. స్థానిక సంస్థలకు సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున, వెంటనే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంటుందని, మరోవైపు రిజర్వేషన్ల బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లోనే ఆర్డినెన్స్ ముసాయిదాకు తీర్మానం చేసినట్టు ప్రభుత్వం వివరించింది. అయితే రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి దాటుతున్న నేపథ్యంలో గవర్నర్ న్యాయ సలహాను కోరడంతో పాటు ఇతర రాష్ట్రాలలో రిజర్వేషన్ల అమలు తీరుపైన కూడా ఆరా తీసినట్టు తెలుస్తోంది.

## విద్యుత్ ప్రాజెక్టులు
(మొదటి పేజీ తరువాయి)

ఉంచుకొని పవర్‌ను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు..విద్యుత్ ఉత్పత్తి సరఫరాలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, రాష్ట్ర స్థూల ఉత్పత్తి విద్యుత్ పైన ఆధారపడిందని తెలిపారు. రాష్ట్ర జెన్కో సిఎండి డాక్టర్ హరీష్ ఆయా ప్రాజెక్టులపై వివరాలను తెలియజేశారు.

**పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా వచ్చినా బిఆర్‌ఎస్ నేతల తీరు, భాష మారదా?...** ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని హౌలే, సన్నాసిఅని దుర్భాషలాడుతూ బిఆర్‌ఎస్ నేతలు దిగజారుడు భాష..సంస్కృతిని అలవర్చుకోవడం శోచనీయమని, బిఆర్‌ఎస్ నేతలు ఇకనైనా ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా, రాజకీయ నాయకులుగా మనం మాట్లాడే భాషనే ప్రజలు నేర్చుకుంటారని, బిఆర్ ఎస్ నేతలు రాష్ట్ర ప్రజలకు ఏం నేర్పాలి అనుకుంటున్నారో వారికైనా అర్థం అవుతుందా అని డిప్యూటీ సిఎం ప్రశ్నించారు. అధికారం పోయింది అనే అక్కసుతో సమాజం సిగ్గుతో తలదించుకునేలా బిఆర్‌ఎస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని భట్టివిక్రమార్క అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వీళ్ళకు ప్రజలు బుద్ధి చెప్పారని, పార్లమెంటు ఎన్నికల్లో కారు సారు 16 అంటే ప్రజలు వారికి గుండు సున్నా ఇచ్చారని, అయినా బిఆర్‌ఎస్ నేతల తీరు, భాష మారడం లేదన్నారు. శ్రీశైలం ఎగువ భాగాన ఎత్తిపోతల పథకం ఎవరి పాలనలో ఏర్పాటు అయ్యిందని ప్రశ్నించారు. కెసిఆర్ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి బేసిన్లు లేవు. బేషజాలు లేవు అని ప్రకటించారని గుర్తుచేస్తూ వారి కాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ప్రస్తుతం నీటి సమస్య వచ్చేది కాదని అన్నారు. 10 సంవత్సరాల పాలనా కాలంలో బిఆర్‌ఎస్ నేతలు ఒక్క నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టులను కట్టారా అని మండిపడ్డారు. విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్న నేపథ్యంలో గ్రీన్ పవర్ వైపు వెళ్తున్నామని 29,30 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. అంతకుముందు జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ ఎమ్మెల్యే లు జైవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలు నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అదనపు కలెక్టర్లు జే.శ్రీనివాస్,నారాయణ అమిత్, హైడల్ డైరెక్టర్ పి.బాలరాజు, సిఇ నారాయణ, ఎస్‌ఇలు వెంకటరమణ, ఓఅండ్ ఎండి ఎస్‌ఇ రఘు రాం, సివిల్ ఎస్‌ఇ డి.రామకృష్ణారెడ్డి, సిఇ మంగేష్ కుమార్, ఈ ఉపేందర్ హాజరయ్యారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి : పశ్య పద్మ

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ఆధ్వర్యంలో మోపాల్ మండలం ఠాణాకుర్ద్ గ్రామంలోని చెక్‌డ్యామ్‌లో భూములు కోల్పోతున్న నిరుపేద రైతులతో కలిసి చెక్‌డ్యామ్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు మహిళలు తమ గోడును వెలిబుచ్చుకుంటూ మా భూముల పక్కన కంజర వాగుపై మా భూముల కింది భాగాన చెక్‌డ్యాం నిర్మిస్తున్నారని తెలిపారు. ఎలాంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా రోడ్డు వేస్తున్నారని, కనుక మాకు జీవనోపాధి కల్పిస్తున్న ఈ భూములను మాకు ఇప్పించడానికి తమ సంఘం మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య, రాధకుమార్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



# పల్లెల్లో జోరుగా 'పచ్చదనం'

ఇప్పటి వరకు కోటి 70 లక్షల మొక్కలు నాటిన పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'వన మహోత్సవ' కార్యక్రమం నిర్దేశించుకున్న లక్ష్యంలో 39 శాతం పూర్తి చేసుకున్నది. పల్లెల్లో 'వన మహోత్సవం' జోరుగా సాగుతోంది. ప్రతి రోజు లక్షల సంఖ్యలో మొక్కలు నాటుతున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ప్రస్తుత సంవత్సరంలో ఏడు కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవాలని నిర్దేశించుకోగా, శుక్రవారం నాటికి 1.7కోట్ల మొక్కలను(39శాతం) నాటినట్టు పంచాయతీ రాజ్ శాఖ వెల్లడించింది. గత సంవత్సరం ఏకంగా 6 కోట్ల 90లక్షల మొక్కలు నాటగా, ఈసారి 7 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో ఈసారి 22వేల ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 4521 ఎకరాల్లో పండ్ల మొక్కలను నాటారు. ఇది మొత్తం లక్ష్యంలో 21శాతంగా ఉంది. మొక్కలు నాటే కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. కాగా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వే కార్యక్రమం చివరి దశకు చేరుకుందని, ఇప్పటి వరకు 85 శాతం మేర గుంతలు తవ్వి మొక్కలు నాటేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అయితే నల్లగొండ జిల్లాల్లో వన మహోత్సవం కాస్త మందకొడిగా సాగుతోంది. ఇప్పటివరకు ఆ జిల్లాలో 42వేల మొక్కలను మాత్రమే ఇప్పటివరకు నాటారు. దీంతో ఆ జిల్లాల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని మరింత వేగం పెంచాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. ములుగు, ఇల్లందు, కామారెడ్డి, పెద్దపల్లి, భూపాలపల్లి పలు నియోజకవర్గాల్లో పర్యటించిన మంత్రి సీతక్క స్వయంగా మొక్కలు నాటి ప్రజల్లో పచ్చదనం పట్ల చైతన్యం కలిగించారు. పచ్చదనం విస్తరణతో పాటు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ తద్వారా గ్రామాల్లో మౌలిక మార్పులకు వన మహోత్సవం దోహదపడుతుందనే విషయాన్ని విస్తృతంగా ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారు. వన మహోత్సవం విషయంలో మంత్రి సీతక్క, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్. శ్రీధర్, డైరెక్టర్ జి. సృజన ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# ఆడబిడ్డలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

- కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- బతుకమ్మలతో మంత్రికి ఘన స్వాగతం
- లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ




ప్రజాపక్షం/భద్రాచలం : ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం, ధ్యేయమని రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన ఇందిరమ్మ రేలా మహిళాశక్తి సంబురాలు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి మహిళలు బతకమ్మలతో ఘన స్వాగతం పలికారు. స్థానిక శాసన సభ్యులు డా.తెల్లం వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీ నారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్, ఐటిడిఏ పిఒ రాహుల్, ఏఎస్‌పి విక్రాంత్‌కుమార్ సింగ్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి తెలంగాణ గీతాలాపనతో కార్యక్రమానికి ప్రారంభించారు. ముందుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని మహిళా స్వయం శక్తి సంఘాల ద్వారా చేపడుతున్న పనులు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రగతి నివేదికను వివరించారు.

అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల సాధికారిత కోసం ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. వడ్డీలేని రుణాలు, మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బీమాభద్రత పథకాలు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, రేషన్ కార్డులు, సబ్సిడి బియ్యం వంటి పథకాలు నిజమైన సంక్షేమ పాలనకు నిదర్శనం అన్నారు. మహిళా సభ్యులు బీమాపథకాన్ని పునరుద్ధరించి సహజ మరణానికి రూ.2లక్షలు, ప్రమాద మరణానికి రూ.10లక్షలు బీమా కల్పించామన్నారు. పేదలకు ఇళ్లను నిర్మించేందుకు జిల్లాలో అశ్వారావుపేట నియోజకవర్గానికి తొలిదశలో 4500 ఇళ్లు మంజూరు చేశామని, భద్రాచలం నియోజకవర్గంలో అదనంగా 1500 ఇళ్లు మంజూరుకి ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపథకంలో భాగంగా ఈ నియోజకర్గంలో రూ.24 కోట్ల 57,65,487 రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా 390మహిళా సంఘాలకు సుమారు 40వేల మందికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కలెక్టర్ జితేష్ విపాటిల్, ఐటిడిఎ పిఒ రాహుల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం భద్రాచలం నియోజకవర్గంలోని 268 స్వయం సహాయక సంఘాలకు రూ.17.64కోట్లు, బ్యాంకు లికేంజీ ద్వారా 268 స్వయం సహాయక సంఘాలకు రూ.17.64 కోట్లు,లోన్ బీమా ద్వారా 17 మంది సభ్యులకు రూ.22 లక్షల 49 వేల230 లను లబ్దిదారులకు చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. అనంతరం మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాన్స్‌ను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా రామాలయ మాఢవీధుల నిర్మాణం కోసం జరుగుతున్న తొలగింపు పనులను స్వయంగా పరిశీలించి వీటను పూర్తి వివరాలు అడిగి తెలుకున్నారు. ఈ కార్యక్రమంలో జేడ్పి సిఇఓ నాగలక్ష్మి, డిఎస్‌ఓ రుక్మిణి, భద్రాచలం తహశీల్దార్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సమాఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

అటవీ పార్కులో అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం వెలుగుమట్ల అర్బన్ అటవీ పార్కులో హరితనిధి, మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులు వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్ ట్రాక్, పిల్లల ఆట స్థలాలు, థీమ్ టిక్ గార్డెన్‌లు, విశ్రాంతి మండపాలు, చైన్‌లింక్ ఫెన్సింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్, బ్యాటరీ ద్వారా నడిచే చెత్త తొలగింపు వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత పెంపొందించేలా ఖమ్మం నగరంలో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణ, జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. ఖమ్మంను మోడల్ నగరంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఒక మొక్క తల్లి పేరు మీద సప్త వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మేయర్ పునుకొల్లు నీరజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రం సింగ్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఎఫ్‌డివోలు, కార్పొరేటర్లు, అధికారులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్‌వి పగటి కలలు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/హైదరాబాద్:ఫామ్‌హౌస్‌లో కెసిఆర్, గెస్ట్ హౌస్‌లో కెటిఆర్ కూర్చుని వంద సీట్లు బిఆర్‌ఎస్‌కు వస్తాయని పగటి కలలు కంటున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.హైదరాబాద్‌లోని సిఎల్‌పి మీడియాసెంటర్‌లో ఎంఎల్‌ఎ మందుల సామేల్‌తో కలిసి ఆయన శుక్రవారం మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నాయకత్వానికి కెటిఆర్ పనికి రారని ఆయన సొంత సోదరి కవితనే చెబుతుందని, ఇంట్లో ఉన్న తగాదాల కారణంగా కెటిఆర్ తన అసహనాన్ని సిఎంపైన రుద్దుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నదనే భ్రమలో కెటిఆర్ ఉన్నారని, రాష్ట్రంలో గుర్రం ఎవరో, గాడిద ఎవరో అందరికి తెలుసన్నారు. రేవంత్ రెడ్డి రేస్ గుర్రమైతే, కెటిఆర్ కుంటి గుర్రమని ఎద్దేవా చేశారు. గతంలో రేవంత్ రెడ్డి వైట్ చాలెంజ్‌కు ఆహ్వానిస్తే కెటిఆర్ రాలేదని ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. ఎంఎల్‌ఎ మందుల సామేల్ మాట్లాడుతూ తుంగతుర్తిలోని తిరుమలగిరిలో సిఎం రేవంత్ రెడ్డి బహిరంగసభ విజయవంతమైందని, కెటిఆర్‌ను ప్రజలు నాయకునిగా నమ్మడం లేదని ఆరోపించారు.

కెటిఆర్ ముందుగా ఆయన సోదరి ఏమంటుందో చూడాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీ ఎందుకు కూలిపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్‌లో దళిత నాయకులను హీనాతి హీనంగా చూశారని, మందకృష్ణ మాదిగను జైలులో పెట్టారని గుర్తు చేశారు.




## 23న బంద్‌కు ఎఐవైఎఫ్ మద్దతు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాపిత పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్‌కు అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావు లు, విద్యావేత్తలు సహకరించి పాల్గొనాలని ఎఐవైఎఫ్ విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర వ్యాపిత బంద్ గోడ పత్రికను ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం విడుదల చేశారు.

కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఆర్. బాలక్రిష్ణ, సల్మాన్ బేగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని అనేక సంవత్సరాలుగా విద్యార్థి, యువజన సంఘాలు పోరాటాలు చేస్తున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోకడం వల్లనే విద్యారంగం కుంటుపడిందని, ఇందు కు సిఎం రేవంత్‌రెడ్డే నన్నారు. నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఇఒ, డిఇఒ, తదితర పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్మీడియట్ కళాశాలల్లో అవినీతిని, గుర్తింపులేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆధునికయుగం జర్నలిజంలో చరిత్రాత్మకమైన మార్పులు

- సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే వార్తా సేకరణ సులభతరం
- పాఠకుల అభిరుచులకు అనుగుణంగా వార్తలు రాయాలి
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి




ప్రజాపక్షం/సిద్దిపేట:ఆధునిక యుగం జర్నలిజంలో చరిత్రాత్మకమైన మార్పులు వస్తున్నాయని మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం సిద్దిపేట విపంచి కళావేదికలో పాత్రికేయులకు రెండు రోజుల శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్తరూపం దాల్చాయన్నారు. సాంకేతికతను సమగ్రంగా తెలుసుకుంటే వార్తల సేకరణ సులభం అవుతుందన్నారు. పాఠకుల వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా వార్తలు ఉండాలన్నారు. తెలుగు వార్తలను సులభమైన భాషలో వ్రాయాలని సూచించారు. త్వరలోనే మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఎఐ అనే అంశంపై సెమినార్ వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు.

సిద్దిపేట శాసన సభ్యులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ రాజకీయరంగంలోనైనా, మీడియా రంగంలోనైన, ఇతర ఏ రంగాల్లోనైన వారు ప్రతి నిత్యం సామాజిక మార్పులకు, అవసరాలకు అనుగుణంగా మనల్ని మనం తీర్చిదిద్దుకోవాలని అన్నారు. జర్నలిస్టులు క్షేత్రస్థాయిలో పర్యటించి అనేక వార్తలను సేకరించి అధికారులతో ధృవీకరించుకొని క్రోఢీకరించుకొని వార్తలను విడుదల చేస్తామన్నారు. ఆయా వార్త లు ప్రజల్ని ప్రభావితం చేస్తాయన్నారు. జర్నలిస్టులు శిక్షణ ద్వారా నైపుణ్యాలను పొంది ప్రజల మన్ననలను పొందేలా జర్నలిస్టులు ప్రతి విషయాన్ని విపులీకరించుకొని సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో వార్తలు రాయాలన్నారు.

సమాజంలో యువత బెట్టింగ్, డ్రగ్స్ బారిన పడి చెడిపోతున్నారని దాన్ని నిర్మూలించటానికి పరిశోధనాత్మక వార్తలు రాయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల మైక్రోఫైనాన్స్ ఆగడాలు ఎక్కువై వారి వేధింపులు తట్టుకోలేక బాధితులు అనేక అవస్థలు, అవమానాలతో చివరికి ఆ ఆత్మహత్యలకు దారితీస్తున్నాయన్నారు. జర్నలిస్టుల కు, రాజకీయనాయకులకు నేర్చుకోవటం అనేది ఎప్పుడూ ముఖ్యమన్నారు. నేర్చుకోవటం ద్వారా తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత పెడదారి పడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను కంట్రోల్ చేసే విధం గా జర్నలిస్టులు కృషిచేయాలన్నారు. సామాజిక అంశాలపై జర్నలిస్టులు ప్రత్యేకంగా ఫోకస్ చేయాలని సూచించారు. ప్రభుత్వాన్ని కదిలించే వార్తలపై జర్నలిస్టు లు దృష్టిసారించాలన్నారు. జర్నలిస్టులకు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు మీడియా అకాడమి ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లాలన్నారు. సిద్దిపేట జర్నలిస్టులకు తన సొంత డబ్బులతో 10లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్, సీనియర్ జర్నలిస్టు దిలీప్‌రెడ్డి సమాచారం హక్కు చట్టం 2005 ప్రసంగించారు. భాషా, తప్పుఒప్పులు దిద్దుబాటు అనే అంశంపై విశాలాంధ్ర ఎడిటర్ ఆర్‌వి రామారావు, వార్త కథనాలు, ప్రత్యేక కథనాలు, సోషల్ మీడియా ప్రభావంపై దిశ ఎడిటర్ మార్కొండేయులు బోధించారు. అతిథులకు తెలంగాణ మీడియా అకాడమీ పక్షాన ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టియుడబ్లుజె అధ్యక్షులు విరాహత్ అలి, జిల్లా అధ్యక్షులు రంగాచారి, తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి దెబ్బకి ఫామ్‌హౌస్‌లో కెసిఆర్

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దెబ్బకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చున్నారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చి మరింత దోచుకోవచ్చని కలలు కన్న మాజీ సిఎం కెసిఆర్ కుటుంబానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ హయాంలో పదేళ్లు చర్చ లేకుండా అసెంబ్లీని నడిపారని, మంత్రులకే తెలియకుండా గతంలో జిఓలు విడుదల చేశారని యన విమర్శించారు. కేంద్ర జలశక్తి శాఖ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిపించిందని, నీటి పంపకాలపై నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు రప్పించినట్లు ప్రెస్ నోట్ కూడా విడుదల చేసిందని తెలిపారు. కానీ దానిని పక్కన పెట్టి బనకచర్ల గురించి మాట్లాడారని బిఆర్‌ఎస్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేదార్ అనే వ్యక్తి దుబాయ్ లోడ్రగ్స్ కారణంగా చనిపోయినట్లు తేలిందని అన్నారు. కేదార్‌కు, కెటిఆర్‌కు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. దుబాయ్‌లో కేదార్‌తో పెట్టుబడులు పెట్టించింది ఎవరని ప్రశ్నించారు.

## ఫోన్ ట్యాపింగ్‌తో ఎంజాయ్ చేసిన కెసిఆర్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపణ

ప్రజాపక్షం/జనగామ : ఫోన్ ట్యాపింగ్‌తో కెసిఆర్ తెగ ఎంజాయ్ చేశాడు. భార్యభర్తల సీక్రెట్ విషయాలు సైతం విన్నాడు. ఒక విధంగా చెప్పాలంటే సినిమాలో నటించే బ్రహ్మానందం కంటే ఎక్కువ ఆనందం పొందాడని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కిషన్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌కు గురైతే ఆయన ఎలా కెసిఆర్‌ను రక్షించినట్లు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిజెపి సిద్ధంగా ఉందన్నారు. శుక్రవారం జనగామలోని బిజెపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్‌కు ఏం పనిలేక ఫాంహౌస్‌లో పడుకొని ఇతర ఫోన్లు వింటూ ఆనంద పడ్డాడన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ల విషయాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, బిసిలకే 42శాతం ఇస్తే మంచిదన్నారు. కానీ అందులో 10శాతం ముస్లింలకు వెళుతుందన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డిని పదేపదే విమర్శించొద్దు

బిఆర్‌ఎస్‌కు సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ హితవు

న్యూఢిల్లీ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బిఆర్‌ఎస్ పదేపదే విమర్శించడం మానుకోవాలని, ఆయన ఎన్నుకోబడిన నేత అని నామినేట్ చేయబడిన వ్యక్తి కాదని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. తెలంగాణకు రేవంత్ అన్యాయం చేయలేదని చెప్పారు. ఢిల్లీలో శుక్రవారం ఆయన మీడియాతో రెండు రాష్ట్రాల మధ్య నీటి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆయన స్వాగతించారు.

టిఆర్‌ఎస్ బిఆర్‌ఎస్‌గా మారిన తరువాత సెంటిమెంట్ ఎగిరిపోయిందని నారాయణ అన్నారు. ప్రతి అంశంపై సెంటిమెంట్లతో బిఆర్‌ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. బనకచర్ల గురించి చంద్రబాబు మొదట మాట్లాడాల్సింది తెలంగాణ ముఖ్యమంత్రితో అని.. అలా చేయకపోవడం వల్ల విమర్శలు వచ్చి తెలంగాణ సిఎం ఆ ప్రాజెక్టును వ్యతిరేకించారని చెప్పుకొచ్చారు. బనకచర్ల ప్రస్తుతం ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టు కాదని, అది రూ.80వేల కోట్ల ప్రాజెక్టు కాదని.. 2 లక్షల కోట్లు అవుతుందని తెలిపారు.

## రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ స్మగ్లింగ్

'ఈగిల్'కు చిక్కిన ముఠా నుండి రూ.17లక్షలు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాజస్థాన్ కేంద్రంగా హైదరాబాద్‌కు స్మగ్లింగ్ అవుతున్న ఓ డ్రగ్స్ ముఠా గుట్టును 'ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్' (ఈగిల్) అధికారులు రట్టు చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.17లక్షల విలువైన 3.25 కిలోల నల్లమందుతో పాటు రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాకు చెందిన సవ్లారామ్ బిష్ణోయ్ (43), హాపురం బిష్ణోయ్(38), లాలారామ్ బిష్ణోయ్ (41)లు గతంలో హైదరాబాద్‌కు వచ్చి ప్రైయివేట్ కంపెనీలో పనిచేసేవారు.

నల్లమందుకు అలవాటు పడిన ఈ ముగ్గురు హైదరాబాద్‌లోని గుజరాతీయులకు నల్లమందు విక్రయించడం ద్వారా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే రాజస్థాన్‌లో నల్లమందు కొనుగోలు చేసి అధికధరకు హైదరాబాద్‌లో విక్రయించేవారు. ఇలా సంపాదించిన డబ్బుతో కార్లు ఖరీదు చేసి జల్సాలకు అలవాటు పడ్డారు. ఈ ముఠా డ్రగ్స్ స్మగ్లింగ్‌కు సంబంధించి ఈగిల్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. నల్లమందుతో కారులో బయల్దేరారు. ఈ సమాచారం తెలుసుకున్న ఈగిల్ అధికారులు కారుపై నిఘా పెట్టారు. కారు బోయిన్‌పల్లి కి చేరుకున్నాక అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న నల్లమందును స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, సర్కిల్ నెం.17, కె.జెడ్., జిహెచ్ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్.
NIT No.: 14/EE/CIRCLE-17/KZ/GHMC/25-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 18.07.2025
**పని పేరు:** సివిల్ పనులు (01 నెం.లు), **అంచనా విలువ / ఇసివి:** రూ.16.80 లక్షలు, **ప్రారంభ తేదీ / డౌన్‌లోడ్ ఆఖరి తేదీ & సమయం:** *క్ర.సం.01 నుండి 01 వరకు పనుల కొరకు:* 18.07.2025న మ.12.00గం.ల నుండి 22.07.2025న మ.12.00గం.ల వరకు మాత్రమే, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.in, ఇ-మెయిల్ అడ్రస్: eec17.ghmc@gmail.com, మొబైల్ నెం. 7337557246.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, కె.జెడ్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 5221-PP/CL/ADVT/1/2025-26, Date: 18-07-2025

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం.08743-232428
ఆర్.సి.నం. ఇ1/382/2025 eGP Portal-Tenders షార్ట్ టెండరు ప్రకటన తేది: 18.07.2025
ఈ దేవస్థానమునకు సంబంధించిన వివిధ పనులు చేయుటకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. **డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 19.07.2025 ఉదయం గం. 11.00ల నుండి, **టెండరు దాఖలుచేయు చివరి తేది:** 25.07.2025 ఉదయం గం.11.00వరకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 25.07.2025 ఉదయం గం.11.30లకు. ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు చూడగలరు.
సం/- ఎల్. రమాదేవి, కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 5196-PP/CL/ADVT/1/2025-26, Date: 18-07-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
డివిజన్-14, జిహెచ్ఎంసి.
NIT No.26: NIT No. 27/E.E.14/GHMC/25-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 17.07.2025
**పని పేరు:** జిహెచ్ఎంసి, గోషామహల్ సర్కిల్ 14, బేగంబజార్ కార్పొరేట్ డివిజన్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ఆవరణలో ఉన్న ఎస్‌డబ్ల్యు డ్రెయిన్‌లోని అడ్డంకులను తొలగించడం. **అంచనా విలువ:** రూ.4.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్‌కు ప్రారంభ తేది:* 18.07.2025న ఉ.11.00గం.ల నుండి మరియు *బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:* 19.07.2025న ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 5230-PP/CL/ADVT/1/2025-26, Date: 18-07-2025

**LOST DOCUMENTS**
I, **GOPULARAM NAGENDER, S/o. GOPULARAM NARASIMHA,** R/o. 5-2-696, Risala Abdulla, Osmangunj, Nampally, Begumbazar, Hyderabad, Telangana - 500012. Have lost my original link Doc No. **6255/1985** and **3555/2012.** That documents were either misplaced or lost during the journey on bus near wipro circle road area Gachibowli and despite my best efforts, I have been unable to locate them. If found Please Contact: **9393202777**

**డాక్యుమెంట్స్ పోయినవి**
**బొడ్డుపల్లి లింగయ్య s/o నర్సింహా,** ఇంటి నెం. 3-17/1, గ్రామం: ఎల్లారెడ్డి గూడెం, మండలం: నార్కెట్‌పల్లి, జిల్లా: నల్గొండ గారికి చెందిన ల్యాండ్ డాక్యుమెంట్స్ మరియు లింక్ డాక్యుమెంట్స్ నెం. **21394/2021** నా ఇంటి నుంచి మహాత్మాగాంధీ యూనివర్సిటీకి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా దారి మధ్యలో పోయినవి. దొరికిన వారు తిరిగి అందజేసిన ఎడల వారికి తగిన పారితోషకం ఇవ్వబడును. సంప్రదించవలసిన మొబైల్ నెంబర్: **9948047900**

ప్రజాపక్షం
శనివారం, 19 జులై

## నిస్సహాయత నుంచి ట్రంప్ బెదిరింపు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బ్యాలెన్స్ కోల్పోతున్నారు. అది మిత్రులు, ఇతరులు తేడా లేకుండా విచక్షణారహితంగా దిగుమతి సుంకాల పెంపుదల ప్రకటించడం, వాటి అమలును విరామం ప్రకటించడం, ఈలోపు వాణిజ్య ఒప్పందానికి రాకపోతే అదనపు సుంకాల హెచ్చరికలు చేయడం పరిపాటి అయింది. అయినా ఇప్పటికి వాణిజ్య ఒప్పందం చేసుకున్నది రెండే రెండు దేశాలు–వియత్నాం, బ్రిటన్ (యుకె). 20 దేశాలకు సంకేత డెడ్ లైన్ విధిస్తూ ఉత్తరాలు పంపారు. 'అమెరికాకు వ్యతిరేకమైన, బ్రిక్స్‌తో సంబంధం పెట్టుకున్న దేశాలపై 100 శాతం సుంకం హెచ్చరిక చేశారు. డాలర్‌కు ప్రత్యామ్నాయం ఆలోచిస్తే తాట తీస్తామంటున్నారు. రెండోవైపున, ఉక్రేన్‌తో 50 రోజుల్లో యుద్ధం నిలుపుదలకు ఒప్పించాల్సిందిగా రష్యాను, భారత్, చైనా, బ్రెజిల్‌లకు విజ్ఞప్తి చేస్తున్న ట్రంప్, అందులో అవి విఫలమైతే రష్యా నుండి అవి కొనుగోలు చేసే క్రూడ్ ఆయిల్‌పై 100 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించాడు. రష్యాపై మరో దఫా ఆంక్షల విధింపునకు రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం ప్రవేశపెట్టిన బిల్లును ట్రంప్ బలపరిచారు. ఆ బిల్లు ప్రకారం నిషేధించిన రష్యా ఉత్పత్తులు కొనుగోలు చేసే దేశాలు 500 శాతం సుంకాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే కూడా ట్రంప్‌ను, అమెరికన్ కాంగ్రెస్ సభ్యులను కలుసుకున్నాక హెచ్చరిక జారీ చేశారు. రష్యన్ క్రూడ్ ఆయిల్, ఆయిల్ ఉత్పత్తులు, బొగ్గు కొనుగోలు చేసే ప్రధాన దేశాలైన చైనా, ఇండియా, బ్రెజిల్‌లకు ప్రత్యేకించి అదనపు సుంకాల హెచ్చరిక చేశాడు రుట్టే. ఈ ద్వంద్వ ప్రమాణాలను భారత్ గురువారం ఖండించింది. 'మా ప్రజల ఇంధన అవసరాలు మాకు అత్యంత ప్రాధాన్యత గల విషయం. మార్కెట్‌లో రేట్లు, ప్రపంచ పరిస్థితులను బట్టి మేము నడుచుకుంటాం' అని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ పరిణామాల పర్యవసానాల కోసం వేచి చూద్దాం! అయితే ట్రంప్‌కు అసలు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది? ప్రశ్న.

తాను అధికారంలోకి వచ్చిన 24 గంటల్లోనే ఉక్రేన్ యుద్ధాన్ని ముగింపజేస్తానని డొనాల్డ్ ట్రంప్ తమ ఎన్నికల ప్రచారంలోనే వాగ్దానం చేశారు. ఇప్పుడు ఉక్రేన్‌కు అదనంగా ఆయుధాలు పంపుతానని ప్రకటించారు. ఈ సంక్షోభం 50 రోజుల్లో పరిష్కారం కాకపోతే రష్యాపై, దాని వాణిజ్య భాగస్వాములపై "తీవ్రమైన సుంకాలు" విధిస్తానని హెచ్చరించారు. ఇది ఆయన నిస్సహాయ స్థితికి నిదర్శనం. యుద్ధ విరమణకు తొలుత ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఒప్పుకోలేదు. ఎందుకంటే అతని వెనుక యూరోపియన్ యూనియన్ ఉంది. జెలెన్స్కీపై కస్సుబుస్సులాడిన ట్రంప్, అరుదైన భూగర్భ ఖనిజాల విక్రయంపై ఉక్రేన్ లొంగి వచ్చి అమెరికాతో ఒప్పందం చేసుకున్న తదుపరి ట్రంప్ యుద్ధ విరమణకు రష్యాపై ఒత్తిడి పెంచారు. తాము ఏ ప్రాథమిక లక్ష్యాల కోసమైతే (ఉక్రేన్ నాటోలో చేర్చుకోకపోవడం, రష్యా భద్రతకై ఆక్రమించిన ఉక్రేన్ భూ, సముద్ర ప్రాంతాలను అట్టిపెట్టుకోవడం, రష్యా రక్షణకై సముద్ర యూరప్ ఒప్పందం వగైరా) యుద్ధం ప్రారంభించామో వాటి నుంచి వెనక్కు వెళ్ళబోమని రష్యా అధ్యక్షుడు పుతిన్ అధ్యక్షుడు ట్రంప్‌కు స్పష్టం చేశాడు. మరోవైపున, రష్యా అప్పుడప్పుడు కాల్పుల విరమణ పాటించింది. కానీ ఉక్రేన్ బరితెగించి రష్యా లోపలికెళ్లి డ్రోన్లను పంపి దాని బాంబర్లపై దొంగ దెబ్బ తీసిన తదుపరి రష్యా ఉక్రేన్‌పై దాడులు ఉధృతం చేసింది. ఈలోపు ట్రంప్‌పై ఇయు, నాటో ఒత్తిడి పెరిగింది. దాంతో సుంకాలతో రష్యాను, దాని వాణిజ్య భాగస్వాములను బెదిరించి లొంగ దీసుకొనే ఎత్తుగడ వేశాడు ట్రంప్.

ఉక్రేన్ యుద్ధం మొదలైన నాటి నుండి అమెరికా, యూరోపియన్ రష్యాపై దఫదఫాలు ఆంక్షలు విధించాయి. అవి రష్యా యుద్ధ విధానాలను మార్చలేకపోయాయి. రష్యా చర్యలకు దాని వాణిజ్య మిత్ర రాజ్యాలను శిక్షిస్తే ట్రంప్ తాజా విధానం విఫలం కాక తప్పదు. రష్యాకే కాదు అమెరికాకూ మిత్రదేశమైన భారత్ కూడా వాటిలో ఉంది. అమెరికా గతంలో ఆంక్షలు విధించినపుడు, రష్యా డిస్కౌంట్ రేటుకు ఆయిల్ విక్రయించి తన ఆర్థిక వ్యవస్థను నిలుపుకుంది. భారత్, చైనా పెద్ద మొత్తంలో ఆ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకున్నాయి. అల్టిమేటంలు, బెదిరింపులవంటి పాత సామ్రాజ్యవాద ఎత్తుగడలతో వివాదాలు పరిష్కరించలేమని ట్రంప్ గ్రహించాలి. కావలసింది వాస్తవిక దృష్టితో కూడిన ఎడతెగని దౌత్యం. గాజాలో ఇజ్రాయెల్, ఉక్రేన్‌తో యుద్ధంలో రష్యా తమ పట్టువిడుపులు లేని వైఖరుల నుంచి వెనక్కి తగ్గకుండా వివాదాలు పరిష్కారం కావు– ట్రంప్ చేతిలో మంత్ర దండమేదీ లేదు!

# సెప్టెంబర్‌లో క్వాడ్, ఎస్‌సిఒ – మోదీ గడసాము



నిత్యా చక్రవర్తి

భారత్–చైనా ద్వైపాక్షిక సంబంధాల్లో జాగ్రత్తతో కూడిన మెరుగుదల ఆరంభమైంది. సాధారణ రాజకీయ, ఆర్థిక సంబంధాలు పునరుద్ధరణ పట్ల ఆసక్తితో ఉన్నట్లు ఇరుదేశాల నాయకత్వాలు తగిన సంకేతప్రాయంగా వెల్లడించారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ బుధవారంనాడు బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు క్సి జిన్‌పింగ్‌ను కలుసుకుని భారత రాష్ట్రపతి, ప్రధాని నుంచి శుభాకాంక్షలు తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల్లో గమనార్హమైన పురోగతిని ప్రస్తావించారు. చైనా అధ్యక్షుడు సంతృప్తి వ్యక్తం చేశారు.

టియాన్‌జిన్‌లో చైనా విదేశాంగమంత్రి ఆతిథ్యమిచ్చిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) విదేశాంగ మంత్రుల సమావేశంలో డాక్టర్ జైశంకర్ పాల్గొన్నారు. దక్షిణాసియా ప్రాంతంలో టెర్రరిజంపై చర్చలో ఆయన పాల్గొన్నారు. ఏప్రిల్ 22న పెహల్గాంలో టెర్రరిస్టు హత్యాకాండ నేపథ్యంలో, టెర్రరిజానికి వ్యతిరేకంగా ఎస్‌సిఒ సభ్యులు ఎట్టి మినహాయింపులు లేని పోరాటం చేయాల్సిన ఆవశ్యకతను వక్కాణించారు. పాకిస్థాన్ టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఎస్‌సిఒ సభ్యుల్లో పాకిస్థాన్ కూడా ఉంది. ఆ టెర్రరిస్టులతో పాకిస్థాన్‌కు సంబంధమున్నట్లు భారత్ ఎటువంటి సాక్ష్యాధారాలు చూడలేదని, పొరుగుదేశానికి వ్యతిరేకంగా యుద్ధ వేడిని కొనసాగించటానికి భారత్ ఉద్దేశపూర్వకంగా ఆరోపణ చేస్తోందని పాక్ విదేశాంగమంత్రి డాక్టర్ ఇషాక్ దార్ ప్రతివాదన చేశారు. ఇప్పుడు, ఎస్‌సిఒ సభ్యదేశాల అధినేతల సమావేశం సెప్టెంబర్‌లో టియాన్‌జిన్‌లోనే జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సమావేశానికి హాజరవుతారని, ఆతిథ్యమిస్తున్న జిన్‌పింగ్‌తో విడిగా సమావేశమవుతారని సూచనలు కనిపిస్తున్నాయి. పెండింగ్‌లో ఉన్న ద్వైపాక్షిక సమస్యలను జిన్‌పింగ్‌తో చర్చించేందుకు భారత ప్రధానికి ఈ సందర్భం అవకాశమిస్తుందని భావించబడుతున్నది. గత సంవత్సరం అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో వారిరువురి చర్చల తర్వాతనే సంబంధాల సాధారణీకరణ క్రమం ఆరంభమైంది. పెండింగ్‌లో ఉన్న ద్వైపాక్షిక సమస్యలు–స్వల్పకాలికం, దీర్ఘకాలికం– చూద్దాం. ముందుగా టిబెట్టు సమస్య, 90వ సంవత్సరంలో ప్రవేశించిన ప్రస్తుత దలైలామా వారసుని నియామకంపై వివాదం. తన వారసుని ఎంపిక చేసే హక్కు దలైలామాకు ఉందని చెప్పటం ద్వారా కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు తొలుత కొంత గడబిడ లేవదీశారు. దానికి చైనా అభ్యంతరం చెప్పింది. ఈ వారసుని ఎంపికలో భారత్ జోక్యం చేసుకోబోదని చెప్పి విదేశాంగమంత్రి ఆ వివాదాన్ని దిద్దుబాటు చేశారు. అదీ సరైన వైఖరి. అయితే దలైలామా అంతిమంగా, చైనా అభిప్రాయాలను కాదని వారసుని ప్రకటిస్తే చైనా నుంచి ఏదోకరూపంలో జోక్యం ఉంటుంది. అప్పుడు భారత వైఖరి ఏమిటన్న సందేహం ఉంది. రెండో సమస్య–ట్రంప్ వాణిజ్య యుద్ధం నేపథ్యంలో భారత్ – చైనా వాణిజ్య సంబంధాల నిర్వహణ. చైనాకు అనుకూలంగా భారీగా వాణిజ్య నిల్వ ఉంది. చైనా ఇంతకుముందు భారత్ వ్యతిరేక వైఖరులు తీసుకున్నప్పుడు, చైనా నుంచి దిగుమతులు తగ్గించి వాణిజ్య లోటుతగ్గించే ప్రయత్నం జరిగింది. ఆ పనిచేస్తే మన ఎలక్ట్రానిక్స్, ఫార్మారంగాల పరిశ్రమలు రెండింటిపై పడే వ్యతిరేక ప్రభావాన్ని వాణిజ్య మంత్రిత్వశాఖ గుర్తించింది. దాంతో దిగుమతుల తగ్గింపు ఆచితూచి జరుగుతోంది. అయినా చైనాతో భారత్ వాణిజ్య లోటు 2025లో 100 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. ట్రంప్ టారిఫ్ యుద్ధం నేపథ్యంలో ప్రస్తుతం వాషింగ్టన్‌లో అమెరికా–భారత్ వాణిజ్య చర్చలు తుదిదశలో ఉన్నాయి. చైనా వాణిజ్యానికి చేటుచేయటానికి భారత్‌ను కేంద్రంగా వాడుకోవాలని అమెరికా చూస్తోంది. ఇది చైనాకు తెలుసు. చైనా ఎగుమతులను నష్టపరిచే విధంగా అమెరికాతో ఒప్పందాలు చేసుకునే దేశాలకు చైనా నుంచి ఎదురుదెబ్బ తప్పదని అది ఇప్పటికే హెచ్చరించింది. చైనాది రెండవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ. అమెరికాతో గతనెలలో వాషింగ్టన్‌లో జరిగిన వాణిజ్య చర్చల్లో అది తన అనేక వాణిజ్య రంగాలను అమెరికా దాడినుంచి కాపాడుకోగలిగింది. భారత్‌కు అంతటి బేరసారాల శక్తి లేదు. అందువల్ల చైనా వాణిజ్యానికి చేటుచేయటంపై అమెరికా ఆదేశాలకు భారత్ తలొగ్గినట్లయితే చైనా– భారత్ వాణిజ్య సంబంధాల్లో కొత్త సమస్యలు తప్పవు. తమిళనాడు, కర్నాటకల్లోని ఫాక్స్‌కాన్ ఐఫోన్ ఫ్యాక్టరీలనుంచి చైనీస్ ఇంజినీర్లను వెనక్కి తీసుకోవటం ద్వారా భారత్ ఆర్థికవ్యవస్థకు చేటుచేయగల తన శక్తిని చైనా ఇప్పటికే ప్రదర్శించింది. చైనా ఎగుమతులను దెబ్బతీసే అంశాలు అమెరికా – భారత్ వాణిజ్య ఒప్పందం లో ఉన్నట్లయితే చైనా అటువంటి ఒత్తిళ్లు మరిన్ని ప్రయోగించగలదు. అసమానతలున్నప్పటికీ, భారత్ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో ఉంది. భారత్ ఈ సంవత్సరాంతానికి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానం చేరుకోవచ్చు. వచ్చే రెండు–మూడేళ్లలో అమెరికా, చైనా తర్వాత మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించవచ్చు. అయితే భారత్ ఇప్పుడు జనాభాలో చైనాతో సమానంగా ఉన్నప్పటికీ, చైనా ఆర్థికవ్యవస్థ భారత్‌కు ఆరు రెట్లు పైగా ఉంది. అమెరికాతో సమానం కావాలని, చైనాలో కమ్యూనిస్టు పాలన వందేళ్లలో ప్రవేశించే 2049 నాటికి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని చైనా కృతనిశ్చయంతో ఉంది.





అయితే చైనాను నిరోధించటానికి అమెరికా ఏర్పాటు చేసినట్లుగా జిన్‌పింగ్ పరిగణిస్తున్న క్వాడ్‌లో భారత్ క్రియాశీలంగా పాల్గొనడం చైనాకు ఆందోళన కలిగిస్తున్న తాజా అంశం. అధ్యక్షుడు ట్రంప్ ఇటీవలి యత్నాలు ప్రధాని మోదీకి ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, భారత్ ఇప్పటికి క్వాడ్‌పై అమెరికా వైఖరులు బలపరుస్తున్నది. ఈ సంవత్సరం సెప్టెంబర్–అక్టోబర్‌లో భారత్‌లో క్వాడ్ అగ్రనాయక సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆతిథ్యం ఇవ్వనున్నారు. దాదాపు అదే సమయంలో– తేదీలు తేడాతో చైనాలోని టియాన్‌జిన్‌లో షాంఘై సహకార సంస్థ అగ్రనాయక సమావేశం జరుగుతుంది. క్వాడ్ సమావేశం తదుపరి ఎస్‌సిఒ సమ్మిట్ జరిగే పక్షంలో, మోదీ చైనాలో జిన్‌పింగ్‌తో సమావేశంలో క్వాడ్ నిర్ణయాలపై ఎంతో వివరించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఎస్‌సిఒ తర్వాత క్వాడ్ సమ్మిట్ జరిగే పక్షంలో ఎస్‌సిఒ నిర్ణయాలు, అమెరికా వ్యూహంపై దాని ప్రభావం గూర్చి మోదీ ట్రంప్‌కు ఎంతో వివరణ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. అమెరికా, చైనా డిమాండ్‌ల విషయంలో భారత్ ప్రయోజనాలను సమతౌల్యం చేయటానికి ప్రధాని మోదీ సెప్టెంబర్/అక్టోబర్‌లో ఎంతో శ్రమించాల్సి ఉంటుంది.

సరిహద్దు సమస్య దీర్ఘకాలికమైంది. 2020లో గల్వాన్ లోయలో పరిణామాలలాగా దానినిప్పుడు పెంచుకోవటంలో చైనా ఆసక్తిచూపటంలేదు. చైనా ఇప్పుడు ఇతర సమస్యలపై–మరింతగా ప్రపంచ సమస్యలపై ఆసక్తి చూపుతోంది. చైనా నాయకత్వం మధ్యకాలిక వైఖరి తీసుకోవటంలో భారత్ వైఖరి నిర్ణయాత్మక అంశంగా ఉంటుంది. భారత్ 'చైనా వ్యూహం' ఈ కాలపు డిమాండ్‌లకు అనుగుణంగా వెసులుబాటుతో ఉండాలి. చైనా డోనాల్డ్ ట్రంప్ ఖాళీ చేసిన 'బహుళపక్ష వ్యవస్థ' జాగాను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తోంది. నిబంధనలు ప్రాతిపదికగా ఉన్న అంతర్జాతీయ ప్రపంచ వ్యవస్థకు ప్రాతినిధ్యం వహించే నాయకుని స్థానంలో తాను ఉండటానికై చైనా ఇయుతో సహా అత్యధిక దేశాలతో మృదువుగా మాట్లాడుతోంది. ప్రస్తుత సుంకాల ప్రపంచ కల్లోలంలో అనేక వర్ధమాన దేశాల, యూరోపియన్ దేశాల మనస్సులు గెలుచుకోవటం ద్వారా చైనా ప్రపంచ వాణిజ్య దౌత్యంలో లబ్ధి పొందింది.

దక్షిణాసియాలో దౌత్యంలో భారత్‌ను ఇబ్బందిపెట్టటానికి ఇటీవల కాలంలో చైనా చేసిన ప్రయత్నాలు భారత్ గ్రహించాలి. అందుకు నిందను భారత్ మోయకతప్పదు. భారత్‌ను మినహాయించి సార్క్ తరహా శిబిరం ఏర్పాటుకై చైనా ఇటీవల పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో చర్చలు జరిపింది. భారత్‌కు అమిత్ర తక్షణ ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లపై ఇప్పుడు చైనా పెద్ద ప్రభావం కలిగి ఉంది. సున్నితమైన సమస్యలతో వ్యవహరించటంలో మన విదేశాంగశాఖ అధికారులకు ఎంతో అనుభవం ఉంది. ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాల విషయంలో విధానాలు నిర్ణయించే స్వేచ్ఛ వారికిస్తే అది రానున్న రోజుల్లో భారత్ దౌత్యానికి సహాయకారి అవుతుంది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలో ప్రధానమంత్రి కార్యాలయం మితిమీరిన జోక్యం దాని సమర్థతను దెబ్బతీసింది. భారత్ విదేశాంగ విధానాన్ని ప్రస్తుత ప్రపంచ పరిణామాల దృష్ట్యా మోదీ ప్రభుత్వం పునరాలోచించాలి. అమెరికా, చైనా రెండింటితోనూ సంబంధాల పునర్నిర్ణయం వ్యూహాత్మక అవసరం.

# సర్కారు బడిలో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే..



వెంకగారి భూమయ్య
9848559863

ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ విధులను నిర్వర్తిస్తూనే ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటు లేదా నిర్వహణలో పాలుపంచుకోవడం అనేది ప్రభుత్వ విద్యా వ్యవస్థను పట్టిపీడిస్తున్న ఒక సంక్లిష్ట సమస్య. ఇది కేవలం వేతనాల స్థాయికి సంబంధించినది కాదు, అంతకు మించి నైతిక విలువలు, జవాబుదారీతనం, పారదర్శకతకు సంబంధించిన లోతైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. ప్రజాధనంతో వేతనం పొందుతున్న ఒక ప్రభుత్వ ఉద్యోగి, అదే ప్రజా వ్యవస్థకు పోటీగా, వ్యక్తిగత లాభాపేక్షతో ప్రైవేట్ రంగంలో లాభాలు ఆర్జించడం అనేది నైతికంగా, చట్టబద్ధంగా తీవ్ర అభ్యంతరకరం. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాల ఘర్షణ మాత్రమే కాదు, అంతకు మించి ప్రభుత్వ పాఠశాలల పట్ల అంకితభావం, జవాబుదారీతనం లోపించడాన్ని సూచిస్తుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలల వ్యాపారంలో నిమగ్నమైనప్పుడు, వారి దృష్టి సహజంగానే తమ ప్రభుత్వ పాఠశాల నుండి మళ్లుతుంది. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా ప్రమాణాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య కరువవుతుంది. అంతేకాకుండా, కొందరు ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులను తమ ప్రైవేట్ పాఠశాలలకు మళ్లించడానికి ప్రయత్నించే దుస్థితి కూడా ఏర్పడవచ్చు. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గడానికి దారితీస్తుంది, చివరకు వాటి మనుగడనే ప్రశ్నార్థకమవుతుంది. ఇది ప్రజా ధనంతో జీతం పొందుతూనే, ప్రభుత్వ విద్యకు గొడ్డలి పెట్టుగా మారిన పరిస్థితిని స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ ధోరణి కొనసాగితే, ప్రభుత్వ విద్యపై ప్రజలకున్న నమ్మకం సన్నగిల్లి, ప్రైవేట్ విద్య వైపు మొగ్గు చూపే పరిస్థితి వస్తుంది, ఇది సమాజంలో విద్యా అసమానతలను మరింత పెంచుతుంది. ఈ తీవ్రమైన సమస్యను పరిష్కరించడానికి ప్రజలు సూచించిన విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఒక కటాఫ్ వేతనం (ఉదాహరణకు నెలకు రూ. 50,000 మించకుండా) అనేది తాత్కాలిక ఒక పరిష్కారంగా కనిపించినా, దీనికి అనేక చిక్కులు ఉన్నాయి. వేతనాలను గణనీయంగా తగ్గించడం వల్ల కలిగే తక్షణ ఆర్థిక ప్రయోజనాలు స్పష్టంగా కనిపించినప్పటికీ, దీర్ఘకాలికంగా విద్యావ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఒకవేళ వేతనాలు తగ్గితే, ప్రతిభావంతులైన, అర్హత కలిగిన యువత ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలోకి రావడానికి ఆసక్తి చూపకపోవచ్చు. ఇప్పటికే ఉన్న సమర్థవంతమైన ఉపాధ్యాయులు, మెరుగైన జీవనోపాధి కోసం ప్రైవేట్ రంగం వైపు మొగ్గు చూపడం లేదా అదనపు ఆదాయ వనరుల కోసం ప్రైవేట్ ట్యూషన్లు, కోచింగ్ సెంటర్లు, లేదా ఇతర ప్రైవేట్ వ్యాపారాలలోకి అడుగుపెట్టడం వంటి మార్గాలను అన్వేషించవచ్చు. అంటే, తక్కువ వేతనం అదనపు వ్యాపారాలకు కారణం కావచ్చు తప్ప వాటిని అడ్డుకోకపోవచ్చు. అంతేకాకుండా, వేతన కోత ప్రభుత్వ ఉపాధ్యాయుల నైతిక స్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. తమకు లభించే వేతనం తమ అర్హతకు, పనికి తగ్గట్టుగా లేదని భావించినప్పుడు ఉద్యోగులలో అసంతృప్తి పెరుగుతుంది. ఇది వారి పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది, అంకితభావం తగ్గి, బోధనా నాణ్యత మరింత దిగజారే ప్రమాదం ఉంది. అత్యంత దారుణంగా, తక్కువ వేతనం కొందరు ఉపాధ్యాయులను అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించడానికి ప్రోత్సహించవచ్చు, తద్వారా విద్యా వ్యవస్థలో అవినీతి ప్రబలే అవకాశం ఉంది. అంతేకాకుండా, ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయ సంఘాలు ఈ రకమైన వేతన కోతను తీవ్రంగా వ్యతిరేకించి, పెద్ద ఎత్తున నిరసనలకు దిగే అవకాశం ఉంది, ఇది విద్యా రంగంలో అస్థిరతకు దారితీస్తుంది.

మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో అమలులో ఉన్న కొన్ని సంస్కరణల గురించి మనం ప్రస్తావించుకున్నప్పుడు, వాటిని పూర్తిగా తెలంగాణలో అమలు చేయడం అనేది అంత సులభం కాదు. ప్రతి రాష్ట్రానికి దానిదైన సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులు ఉంటాయి. ఒక రాష్ట్రంలో విజయవంతమైన విధానం మరొక రాష్ట్రంలో అదే స్థాయిలో పని చేయకపోవచ్చు. మహారాష్ట్రలో 'ఫలితాల ఆధారిత వేతనం' లేదా 'విద్యార్థుల సంఖ్య ఆధారిత వేతనం' వంటి ప్రయోగాలు ఉన్నప్పటికీ, ప్రతి ఉపాధ్యాయునికి రూ.50,000 మించకుండా వేతనం అనే కఠినమైన చట్టం అమలులో ఉందా అనేది స్పష్టం కాదు. ప్రభుత్వ ఉద్యోగుల పే స్కేల్ నిర్ణయం అనేది కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఉద్యోగుల డిమాండ్లు, జీవన వ్యయం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి, మహారాష్ట్ర మోడల్‌ను తెలంగాణలో అమలు చేయాలంటే విస్తృత అధ్యయనం, ప్రణాళిక, ప్రస్తుతం ఉన్న చట్టపరమైన నిబంధనలను సవరించడం వంటి సంక్లిష్ట ప్రక్రియ అవసరం.

ప్రస్తుతం, తెలంగాణ రాష్ట్రంలో సుమారు 1.25 లక్షల నుండి 1.30 లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ సంఖ్యలో ప్రాథమిక స్థాయి నుండి జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు కూడా భాగమై ఉంటారు. వీరి వేతనాలపై ప్రభుత్వం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుంది. ఉదాహరణకు, సగటున ఒక ఉపాధ్యాయునికి నెలకు రూ. 70,000 వేతనం అనుకుంటే, వార్షిక వేతన వ్యయం సుమారు రూ. 10,500 కోట్లు అవుతుంది. దీనికి అదనంగా, పెన్షన్లు, గ్రాట్యుటీలు, ఇతర అలవెన్సులు, వెల్ఫేర్ స్కీమ్‌ల కోసం ప్రభుత్వం చేసే వ్యయం కలిపి సంవత్సరానికి రూ. 15,000 కోట్ల నుండి రూ. 20,000 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా. ఇది రాష్ట్ర బడ్జెట్‌లో గణనీయమైన భాగం, ఇది ఆర్థిక క్రమశిక్షణ అవసరాన్ని నొక్కి చెబుతుంది. అయితే, ఈ భారాన్ని తగ్గించడానికి కేవలం వేతన కోతపైనే ఆధారపడకుండా, ప్రభుత్వ వ్యయాన్ని అన్ని రంగాల్లోనూ తగ్గించడం, పన్ను వసూళ్లను పటిష్టం చేయడం, ఆర్థిక వృద్ధిని సాధించడం వంటి సమగ్ర ఆర్థిక ప్రణాళికలు అవసరం.

కాబట్టి, ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేట్ వ్యాపారాల్లో పాల్గొనడాన్ని అరికట్టడానికి, విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఒక సమతుల్య విధానం అవసరం. కేవలం వేతన కోత వంటి తాత్కాలిక లేదా ఉపరితల పరిష్కారాలు దీర్ఘకాలికంగా విద్యా నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. దీనికి బదులుగా, కఠినమైన చట్టపరమైన చర్యలు, పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని కఠినతరం చేసి, ప్రైవేట్ వ్యాపారాల్లో భాగస్వామ్యాన్ని స్పష్టంగా నిషేధించాలి. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు విధించాలి, తద్వారా ఇతరులకు అది ఒక పాఠంగా మారుతుంది.

వీటన్నింటికీ మించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం అత్యంత కీలకమైన అంశం. పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, ఆధునిక బోధనా పద్ధతులను ప్రవేశపెట్టడం, సరిపడా సిబ్బందిని సమకూర్చడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆకర్షణీయంగా మార్చాలి. ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, అవసరమైన వనరులను అందిస్తూ, వారి పనితీరును క్రమం తప్పకుండా మూల్యాంకనం చేసి, జవాబుదారీతనాన్ని పెంచాలి. ఉత్తమ పనితీరు కనబరిచే వారికి తగిన ప్రోత్సాహకాలు అందించడం ద్వారా వారిని మరింత అంకితభావంతో పని చేయడానికి ప్రేరేపించవచ్చు. తల్లిదండ్రులలో ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించడం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచవచ్చు. ఈ సమగ్ర విధానం ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులలో తమ పాఠశాల పట్ల అంకితభావం పెరుగుతుంది, వారు ప్రైవేట్ వ్యాపారాల వైపు చూడకుండా తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తారు. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కలకలలాడుతాయి, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది, తద్వారా రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి.

# దృఢమైన దేహంలోనే చురుకైన మెదడు

మైదాన ఆటలు పిల్లలు, యువతకు మాత్రమే కాదని, పెద్దలు కూడా ఆడుతూ మన ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యకర దేహంలో చురుకైన మెదడు (సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ) ఉంటుందని మనం తెలుసుకోవాలి. ఏ పని సజావుగా, విజయవంతంగా పూర్తి చేయాలన్నా మనకు సంపూర్ణ ఆరోగ్యం ఉండాలి. ఆరోగ్య పరిరక్షణకు అనునిత్యం కొంత సమయం కేటాయించాలి, ఆరోగ్యంగా ఉన్నపుడుదాని విలువ తెలియదు. అనారోగ్యం చుట్టుముట్టినపుడు ఆరోగ్యం విలువ అవగతం అవుతుంది. ఆరోగ్యానికి తప్పనిసరిగా అర గంట నుండి గంట సమయం కేటాయిస్తే ఆరోగ్య దేవత మన శరీరంలో కొలువు ఉంటుంది. ఆటలు ఆడడం వల్ల శారీరక దృఢత్వం పెరిగి మానసిక చురుకుదనం కలుగుతుంది.



### ఆటలతో బహుళ ప్రయోజనాలు


ఆటలతో ఆనందం కలగడమే కాకుండా శారీరక, మానసిక వికాసం కలిగి శ్రేయస్సుకు దోహదపడుతుంది. నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలన్నా, సమస్యలకు పరిష్కార నిర్ణయాలు తీసుకోవాలన్నా, జట్టు స్ఫూర్తి అనుభవంలోకి రావాలన్నా, సృజనాత్మక ఆలోచనలు అంకురించాలన్నా, జీవితం ఆనందమయం కావాలన్నా మైదాన ఆటలను ఆశ్రయించాలని నిపుణులు పేర్కొంటున్నారు. మన శరీరంలో ఆటలకు సంబంధించిన జన్యువులా ఉంటాయని, ఆటలు ఆడినవారిలో ఇవి చురుకుగా ఉంటూ మెదడు చురుకు దనాన్ని పెంచుతాయని శాస్త్ర పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. నిత్యం ఆటలు ఆడే వ్యక్తులు స్మార్ట్‌గా, స్ట్రాంగ్‌గా, హ్యాపీగా ఉంటారని వెల్లడైంది. ఆటలు ఆడే పిల్లలు, యువత, పెద్దల్లో సహితం చురుకైన మెదడు, ఆలోచనా శక్తి పెరగడం, మానసిక శారీరక ఒత్తిడి తగ్గడం, జట్టుగా సమన్వయంతో పని చేసే అలవాటు కావడం, ఆత్మ విశ్వాసం పెరగడం, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ పెరగడం, విలక్షణ ఆలోచనలకు బీజాలు పడడం, ఓపిక పెరగడం, అనుకోని మార్పులను ఆకళింపు చేసుకొని ముందుకు సాగడం, శారీరక దృఢత్వం పెరిగి అన్ని ప్రతికూల వాతావరణాలను తట్టుకునే శక్తి పెరగడం, సామాజిక మానవీయ సంబంధాలు పెరగడం, నూతన మిత్రులు పెరగడం, ఉపశమనం కలగడం, విశ్రాంతి కలగడం, రీచార్జ్ కావడం లాంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలుసుకోవాలి.

పెద్దలు ఆటల్లో పాల్గొనడం వల్ల తమలోని బాల్యం నిద్ర లేస్తుంది, అమితానందాన్ని బహుకరిస్తుంది. సంతోషాల మూటలను బహుకరిస్తుంది క్రీడా మైదానం. వయస్సును మరిచి మనందరం ఆటలను మనం అలవాటు చేసుకోవాలి. మన ఆరోగ్య పరిరక్షణకు మనమే ఆటపాటల్లో పాల్గొనాలి. మైదాన ఆటలు, సైక్లింగ్, వ్యాయామాలు, యోగా లాంటి అంశాలకు తగిన సమయాన్ని కేటాయిస్తూ, రేపటి మన ఆరోగ్యానికి నేడు పెట్టుబడి పెడదాం, ఆయురారోగ్యాలు, ఆనందమయ క్షణాలను ఆస్వాదిద్దాం.

# ఆఫ్రికా ఖండంలో కొత్త మహాసముద్రం!



ఇప్పట్లో కాదుగానీ, ఎప్పటికైనా ఆఫ్రికా ఖండంలో కొత్త మహాసముద్రం ఒకటి ఉద్భవించనుంది. 'ది ఎర్త్' తాజా సంచికలోని నివేదికను అనుసరించి, తూర్పు ఆఫ్రికాలో సోమాలియన్ ఫలకం, ఆఫ్రికన్ ఫలకం భవిష్యత్తులో విడిపోతున్నాయి. ఈ ప్రక్రియ వల్ల ఆఫ్రికా ఖండం రెండు భాగాలుగా విడిపోయే అవకాశం ఉంది. దీని వల్ల ఏర్పడే పెద్ద చీలికలోకి ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ నుంచి ఉప్పు నీరు చేరి, కొత్త మహాసముద్రం ఏర్పడవచ్చు. ఈ ప్రక్రియకు 5 నుంచి 10 మిలియన్ సంవత్సరాలు పడుతుందని గతంలో భావించేవారు. తాజా పరిశోధనల ప్రకారం, ఈ ప్రక్రియ వేగవంతమై, 1 మిలియన్ సంవత్సరాల్లోనే కొత్త మహాసముద్రం ఏర్పడవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో మాగ్మా (శిలాద్రవం) ప్రభావం, భారీ భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయొచ్చు. ప్రస్తుతం అఫార్ డిప్రెషన్ ప్రాంతంలో భూగర్భ చీలికలు, కొత్త బాల్సాల్టిక్ క్రస్ట్‌లు ఏర్పడుతున్నాయి. ఇవి కొత్త మహాసముద్రం ఆరంభ దశగా భావిస్తున్నారు. ఇలావుంటే, ఆఫ్రికా ఖండం విడిపోయే ప్రక్రియ వల్ల భవిష్యత్తులో ఈ క్రింది మార్పులు సంభవించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆఫ్రికా ఖండం రెండు భాగాలుగా విడిపోయి, సోమాలియా, ఇథియోపియా, కెన్యా, టాంజానియా ప్రాంతాలు కొత్త ఖండం గా రూపాంతరం చెందవచ్చు. ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ నుండి ఉప్పునీరు చీలికలోకి ప్రవేశించి, భూభాగాల మధ్య కొత్త మహాసముద్రం ఏర్పడవచ్చు. ప్రస్తుతం భూమి మధ్యలో ఉన్న ఉగాండా, జాంబియా వంటి దేశాలు సముద్ర తీరాలను పొందే అవకాశం ఉంది. తూర్పు ఆఫ్రికా ప్రాంతం (అఫార్ డిప్రెషన్) ఈ మార్పులకు కేంద్రంగా మారుతుంది. భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు మరియు భూగర్భ శిలాద్రవం (మాగ్మా) కదలికలు తరచుగా సంభవిస్తాయి. ఈ మార్పుల కారణంగా ప్రస్తుత తీరప్రాంతాలు మారిపోయి, కొత్త తీరప్రాంతాలు ఏర్పడతాయి. జనావాసాల పునర్వ్యవస్థీకరణ, వనరుల పంపిణీలో మార్పులు సంభవిస్తాయి. ఈ మార్పులు భూమి టెక్టోనిక్ ప్లేట్ల కదలికల సహజ పరిణామంగా భావిస్తున్నారు. ఇది భూమి భౌగోళిక చరిత్రలో గొప్ప మలుపుగా నిలుస్తుంది. కొత్త మహాసముద్రం ఏర్పడితే ప్రపంచ వాతావరణంపై కూడా ప్రభావాలు తప్పకపోవచ్చు. ప్రస్తుత అంటార్కిటిక్ సర్కంపోలార్ కరెంట్ వలె కొత్త మహాసముద్రం కూడా ప్రపంచ ఉష్ణోగ్రతల సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. ఎర్ర సముద్రం నుండి ప్రవేశించే ఉప్పు నీరు, కొత్త ప్రవాహాలను ఏర్పరచి ఆసియా, ఆస్ట్రేలియా ఖండాల వర్షపాతాన్ని మార్చవచ్చు. కొత్త సముద్ర జీవవైవిధ్యం కార్బన్ డయాక్సైడ్‌ను ఎక్కువగా గ్రహించడానికి వీలు కల్పించవచ్చు. అయితే, సముద్ర ఆమ్లీకరణ ప్రమాదం పెరగడంతో పగడపు దిబ్బలు, సముద్ర జీవులపై హాని కలిగించవచ్చు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## త్యాగమూర్తి ఉమెన్ చాందీ

**కొట్టాయం :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత దివంగత ఉమెన్ చాందీ ఒక వ్యక్తి కాదని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. కేరళ రాజకీయాల వ్యక్తీకరణ అని, అత్యంత క్రూరమైన, అన్యాయమైన రాజకీయ దాడులను ఎదుర్కొన్నప్పటికీ ఆయన రాష్ట్ర ప్రజల కోసం 'తనను తాను చంపుకున్నారని' అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చాందీ రెండవ వర్ధంతి సందర్భంగా జరిగిన స్మారక సమావేశాన్ని ప్రారంభించిన తర్వాత రాహుల్ మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేతపై జరిగిన రాజకీయ దాడిని నేరంగా ఆయన అభివర్ణించారు. అతని (చాందీ) గురించి నిరంతరం అబద్ధాలు చెబుతున్నారని, కోట్లాది రూపాయల సోలార్ కుంభకోణాన్ని ప్రస్తావిస్తూ అన్నారు. చాందీ ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పుడు తాను క్రమం తప్పకుండా అతనితో మాట్లాడేవాడినని, కానీ కాంగ్రెస్ కురువృద్ధుడు ఎప్పుడూ ఎవరి గురించి కోపంగా మాట్లాడేవారు కాదన్నారు. ఆయన ఎల్లప్పుడూ సమతుల్యతతో వినయంగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసేవారని చెప్పారు. చాందీ నుండి తాను చాలా నేర్చుకున్నానని, కాంగ్రెస్ కురువృద్ధుడిలాంటి వ్యక్తులను మరింత మందిని అభివృద్ధి చేయాలనేది తన ఆకాంక్ష అని అన్నారు.

## గత పదేళ్ళుగా వాద్రాను బిజెపి వెంటాడుతోంది

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ



**న్యూఢిల్లీ :** హర్యానాలోని శికోపూర్‌లో జరిగిన భూ ఒప్పందంలో అక్రమాలకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో వ్యాపారవేత్తపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తన బావ రాబర్ట్ వాద్రాపై వేట ప్రారంభించిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఆరోపించారు. చివరికి సత్యం గెలుస్తుందని, తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా, ఆమె కుటుంబం ఎలాంటి 'హింస'నైనా తట్టుకుంటుందన్నారు. తన బావను గత పదేళ్లుగా ఈ ప్రభుత్వం వెంటాడుతోందన్నారు. అందులో భాగమే ఈ తాజా చార్జిషీట్ అని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. రాబర్ట్, ప్రియాంక, వారి పిల్లలు మరోసారి దురుద్దేశపూరితమైన, రాజకీయంగా ప్రేరేపించబడిన అపవాదు, వేధింపులను ఎదుర్కొంటున్నందున తాను వారికి అండగా నిలుస్తానన్నారు. వారందరూ ఎలాంటి హింసనైనా తట్టుకునేంత ధైర్యం ఉన్నారని తనకు తెలుసని, ఆ ధైర్యాన్ని కొనసాగిస్తారన్నారు. 'చివరికి సత్యం గెలుస్తుంది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. గాంధీ కుటుంబం ఎల్లప్పుడూ ఇటువంటి రాజకీయ ప్రేరేపిత వ్యూహాలను బలం, స్థితిస్థాపకతతో ఎదుర్కొంటూనే ఉందని, వారికి అండగా యావత్ పార్టీ నిలుస్తుందని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అన్నారు. ఎసిసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ 'మోదీ, షా ద్వయం కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకత్వం, వారి కుటుంబాన్ని వెంటాడేందుకు ఇడికి నెలవారీ పనిని ఇచ్చినట్లు కనిపిస్తోందన్నారు. 'మిస్టర్ రాబర్ట్ వాద్రాపై తాజా ఇడి చర్య పూర్తిగా రాజకీయ ప్రతీకారం. బెదిరింపులకు మరో వ్యర్థ ప్రయత్నం' అని ఆయన ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో ఆరోపించారు. మరో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్‌ను వేటగా అభివర్ణించారు. ఇది 'బెదిరించడానికి, హింసించడానికి' ప్రభుత్వం చేసిన మరొక ప్రయత్నమని, ఇది ఘోరంగా విఫలమవుతుందన్నారు.

## ఇస్లాంపూర్ ఇక ఈశ్వర్‌పూర్

మహారాష్ట్ర సర్కార్ నిర్ణయం

**ముంబయి:** మహారాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. సంగ్లీ జిల్లాలోని ఇస్లాంపూర్ పేరును ఈశ్వర్‌పూర్‌గా మార్పు చేసినట్లు ప్రకటించింది. ఈ మేరకు గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి ఛగన్ భుజ్‌బల్ అసెంబ్లీ వేదికగా శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆమోదం కోసం కేంద్రానికి పంపనున్నట్లు చెప్పారు. మహారాష్ట్రలో ఇప్పటికే ఔరంగాబాద్‌ను ఛత్రపతి శంభాజీనగర్‌గా, ఉస్మానాబాద్‌ను ధారాశివ్‌గా మారుస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇస్లాంపూర్ పేరును ఈశ్వర్‌పూర్‌గా మార్చాలన్న డిమాండ్ ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉండగా.. తాజాగా హిందుత్వ సంస్థ శివ్ ప్రతిష్ఠాన్ మరోసారి ఈ అంశంపై కలెక్టరేట్‌లో విజ్ఞాపన పత్రం అందజేసింది. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్రలో సిఎం దేవేంద్ర ఫడణవీస్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పేరు మార్పునకు ఆమోదం తెలిపింది. ఇస్లాంపూర్ పేరు మార్చాలన్న డిమాండ్ 1986 నుంచి పెండింగ్‌లో ఉందని శివసేన నేత ఒకరు తెలిపారు.

## యెమెన్ నర్సు ఉరిశిక్ష ప్రస్తుతానికి వాయిదా..

ఆమెను సురక్షితంగా తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం

'సుప్రీంకోర్టు'కు కేంద్రం వెల్లడి



**న్యూఢిల్లీ :** యెమెన్‌లో హత్యకేసులో మరణశిక్ష పడిన భారతీయ (కేరళ రాష్ట్రం) నర్సు నిమిష ప్రియను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ఈ విషయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నదని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం సుప్రీంకోర్టుకు తెలిపింది.న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన డివిజన్ బెంచ్‌కు ప్రియను జులైలో ఉరితీయడం అనే షెడ్యూల్ వాయిదా పడిందని చెప్పింది.'సేవ్ నిమిషప్రియఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్ ఆర్గనైజేషన్ తరపున హాజరైన న్యాయవాది హత్యకు గురైన బాధిత కుటుంబాన్ని కలిసి చర్చలు జరిపేందుకు కేంద్రం నియమించిన ప్రతినిధి బృందాన్ని నిమిష ప్రియకు న్యాయపరంగా సహాయపడేందుకు మద్దతు కొనసాగించాలని కోరారు. ధర్మాసనం మాట్లాడుతూ పిటిషనర్ ప్రభుత్వానికి ఒక వినతిపత్రం అందజేయవచ్చని చెప్పింది. దానిని వారు తరలించడానికి స్వేచ్ఛగా ఉన్నారు అని ధర్మాసనం చెప్పింది. అనంతరం అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి మాట్లాడుతూ కేంద్రం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పగా, పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ ఉరితీయడం వాయిదాపడిందని బెంచ్‌కు చెప్పారు. 'మొదటి విడతగా ఇప్పటికిప్పుడు వారు ఉరితీయడం ఆపివేశారు. మనం తొలుత వారి క్షమాపణను కోరాల్సిన అవసరం ఉంది. బ్లడ్‌మనీ రెండవదశలో వస్తుంది. మొదట బాధిత కుటుంబం మనల్ని క్షమించాల్సి ఉంటుంది' అని న్యాయవాది చెప్పారు. బ్లడ్‌మనీపై చర్చ తర్వాత బాగా జరగవచ్చని చెప్పారు. ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే నిషేధఉన్నందున యెమెన్ ఎవరూ ప్రయాణించలేని దేశమేమీ కాదని న్యాయవాది తెలిపారు. ధర్మాసనం దీనిపై స్పందిస్తూ మీరు ప్రభుత్వంతో సంప్రదించండి, ప్రభుత్వం ఇప్పటికే మీ కోసం చాలా చేస్తోంది. ద్వేషించే వారిని వారివైపు నుంచి చివరి వరకూ బాగా చూసుకోవడం సాధ్య మే అని ధర్మాసనం చెప్పింది. పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనాన్ని అభ్యర్థిస్తూ పిటిషనర్ ఆర్గనైజేషన్ నుంచి ఇద్దరు లేదా ముగ్గురుతో కూడిన ప్రతినిధి బృం దం, ఇప్పటికే యెమెన్‌లో బాధిత కుటుంబంతో సంప్రదింపులలో భాగస్వామియైన కేరళకు చెందిన ఒక మత ప్రబోధకుడి ప్రతినిధులు, యెమెన్‌కు ;ప్రయాణం అయ్యేలా అనుమతించాలన్నారు. కేంద్రం సముచితమని భావిస్తే ప్రభుత్వం నుంచి కూడా ఒక ప్రతినిధి కూడా యెమెన్‌కు వెళ్లవచ్చని న్యాయవాది చెప్పారు.బాధితురాలి కుటుంబంతో చర్చలు జరపడానికి నిమిషప్రియ తల్లి యెమెన్‌లో ఉందని, ఢిల్లీ హైకోర్టు ఆమె ప్రయాణానికి కేంద్రాన్ని అనుమతి కోరడంతో ఆమె యెమెన్‌కు వెళ్లిందని పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. ధర్మాసనం ఆగస్టు 14కు విచారణను వాయిదా వేసింది.

## జస్టిస్ వర్మ అభిశంసనతో ప్రభుత్వానికి సంబంధం లేదు

అది పూర్తిగా ఎంపిల అంశం : కేంద్ర మంత్రి మేఘ్‌వాల్

**న్యూఢిల్లీ :** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం తీసుకురావడమనే అంశం పూర్తిగా పార్లమెంటు సభ్యులకు సంబంధించిన వ్యవహారమని, అందులో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ శుక్రవారం తెలిపారు. నగదు దొరికిన వివాదంపై న్యాయమూర్తి వర్మ మీద ఆరోపణలను పరిశీలించడానికి నాటి భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ ఇప్పటికే తన నివేదికను సమర్పించిందని 'పిటిఐ' కి వెల్లడించారు. న్యాయమూర్తి వర్మ ఆ నివేదికతో ఏకీభవించకపోతే , సుప్రీంకోర్టు లేదా హైకోర్టును ఆశ్రయించినట్లయితే, అది ఆయన విచక్షణాధికారం అని మంత్రి మేఘ్‌వాల్ అన్నారు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తిని తొలగించే హక్కు పార్లమెంటుకు ఉందని ఆయన చెప్పారు. న్యాయమూర్తిని అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభలో కనీసం 100 మంది సభ్యుల మద్దతు, రాజ్యసభలో 50 మంది సభ్యుల మద్దతు అవసరం అని ఆయన తెలిపారు. ఇది పూర్తిగా ఎంపిల వ్యవహారం అని, వారు కొన్ని ప్రయత్నాలు చేశారని, ఇందులో ప్రభుత్వానికి ఎటువంటి ప్రమేయం లేదని మేఘవాల్ చెప్పారు. ఇదిలా ఉండగా, నగదు దొరికిన వివాదంలో తనను దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు తేల్చిన అంతర్గత విచారణ ప్యానెల్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ న్యాయమూర్తి వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనను పదవి నుండి తొలగించాలని నాటి ఛీఫ్ జస్టిస్ ఖన్నా మే 8న చేసిన సిఫార్సును రద్దు చేయాలని ఆయన కోరారు. సోమవారం నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో న్యాయమూర్తి వర్మను తొలగించడానికి ప్రభుత్వం ఒక తీర్మానం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎంపిలు కూడా ఈ తీర్మానంపై సంతకం చేస్తారని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ తెలిపారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ నేతృత్వంలోని 25 పేజీల విచారణ నివేదికలో హిందీలో రెండు చిన్న నోట్స్ ఉన్నాయి. మార్చి 14న న్యాయమూర్తి వర్మ లూటియన్స్ ఢిల్లీ నివాసంలోని స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగిన తర్వాత, నాలుగు నుండి ఐదు సగం కాలిపోయిన కరెన్సీ నోట్లతో కూడిన సంచులు లభించినట్లు అందులో పేర్కొన్నారు. ప్రాథమికంగా, షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగిందని నివేదిక తెలిపింది. అప్పట్లో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న న్యాయమూర్తి వర్మ, తన సమాధానంలో ఆ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తన ద్వారా లేదా తన కుటుంబ సభ్యుల ద్వారా ఎన్నడూ స్టోర్‌రూమ్‌లో నగదు ఉంచబడలేదని చెప్పారు. నాడు ఆయన అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయబడగా, అక్కడే కొనసాగుతున్నప్పటికీ ఆయనకు ఎటువంటి న్యాయపరమైన పని అప్పగించలేదు.

**ఆదివారం పార్లమెంటుపై రాజకీయ పార్టీలతో భేటీ**

పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కూడా అయిన మేఘ్‌వాల్ ఆగస్టు 21న ముగిసే పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సజావుగా జరుగుతాయని, అర్థవంతమైన చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. సమావేశాలు ప్రారంభమయ్యే ముందు ఆదివారం రోజు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులతో ఒక సమావేశం జరుగుతుందని, అక్కడ వారు తమ స మస్యలను తెలియజేస్తారని ఆయన అన్నారు. సమావేశం మొదటి రోజున బిజినెస్ అడ్వైజరీ కమి టీ (బిఎసి) జరుగుతుందని, అందులో సభలో చేపట్టాల్సిన అంశాలను నిర్ణయిస్తారని మంత్రి తెలిపారు.

రాజ్యాంగం మూల స్వభావాన్ని మార్చేందుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే ప్రతిపక్షాల ఆరోపణపై న్యాయ శాఖ మంత్రి మాట్లాడుతూ, 'నరేంద్ర మోడీ 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రిగా ఉన్నారు.... ప్రభుత్వం ఎప్పుడు రాజ్యాంగం మూల స్వభావాన్ని చెడగొట్టడానికి ప్రయత్నించింది? కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితి సమయంలో, అది మొత్తం రాజ్యాంగాన్ని మార్చింది. 42వ సవరణ ఏమిటి? రాజ్యాంగాన్ని మార్చడానికి పనిచేసింది కాంగ్రెస్' అని అన్నారు.



దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) అమలుపై ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, యుసిసిని అమలు చేసిన మొదటి రాష్ట్రం గోవా అని, దాని తర్వాత ఉత్తరాఖండ్ అని, ఇతర రాష్ట్రాలు కూడా ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన అన్నారు.

'ఈ అంశం భారత లా కమిషన్ ముందు పెండింగ్‌లో ఉంది, కమిషన్ నివేదిక వచ్చిన తర్వాత దాని గురించి మాట్లాడుతాము' అని మేఘవాల్ చెప్పారు. కొన్ని రాష్ట్రాల్లో భాషా వివాదంపై ఒక ప్రశ్నకు, 2020 జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) పూర్తిగా స్పష్టంగా ఉందని ఆయన అన్నారు. 'మేము అన్ని భారతీయ భాషలను గౌరవిస్తాము. అలా చేస్తూనే ఉంటాము. మేము అన్ని భారతీయ భాషలను బలోపేతం చేస్తాము . ఇది ఎన్ఇపిలో భాగం' అని పేర్కొన్నారు.

## తూర్పు భారతం అభివృద్ధికి 'విక్షిత్' బిహార్ కీలకం

ఉద్యోగాలు పేరుతో ఆర్‌జెడి భూమి లాక్కొంది : ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** ఉద్యోగాలు ఇస్తామని తప్పుడు వాగ్దానం చేసి పేదల నుండి భూమిని ఆర్‌జెడి లాక్కుందని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. పరక్షంగా 'ల్యాండ్ ఫర్ జాబ్' కుంభకోణాన్ని ప్రస్తావించారు. తూర్పు భారతదేశ అభివృద్ధికి 'విక్షిత్' (అభివృద్ధి చెందిన) బిహార్ కీలకమని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ తన ప్రచారాన్ని ఇప్పటి నుంచే ప్రారంభించారు. శుక్రవారం మోతీహారిలో జరిగిన బహిరంగ ర్యాలీలో ప్రసంగించారు. 'బనాయేంగే నయా బీహార్, ఫిర్ ఏక్ బార్ ఎన్డీఏ సర్కార్' (మరోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మేము కొత్త బీహార్‌ను నిర్మిస్తాం) అనే కొత్త నినాదాన్ని రూపొందించారు. ఇది జనంలో నినాదాలను రగిలించి పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరిచింది. కాంగ్రెస్‌-ఆర్జేడీ కలయిక పేదలు, సామాజికంగా అణగారిన ప్రజలతో రాజకీయాలు చేసిందని, రాష్ట్రం గతంలో నిర్లక్ష్యం, స్తబ్దతకు గురైందని, ప్రతిపక్ష కూటమిపై మోదీ విమర్శలు చేశారు. ఆపరేషన్ సింధూర్ తీర్మానాన్ని తాను బీహార్ నేల నుంచే తీసుకున్నానని, ప్రపంచం దాని విజయాన్ని చూసిందని ప్రధాని ఉద్ఘాటించారు. ఆర్జేడీ యువతకు ఉపాధి కల్పించడం గురించి ఆలోచించలేకపోతోందన్నారు. వారు (ఆర్జేడీ నాయకులు) ఉద్యోగాల కోసం తప్పుడు హామీ ఇచ్చి పేదల నుండి భూమిని లాక్కున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆర్జేడీ-కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిలో భారీ అంతరం ఉందన్నారు. వారు ఎప్పుడూ పేదల అభ్యున్నతి గురించి ఆలోచించలేదని, పేదలు, సామాజికంగా అణగారిన వర్గాల పేరుతో రాజకీయాలు మాత్రమే ఆడారని ఆయన ఆరోపించారు. యువతకు మరిన్ని అవకాశాలను హామీ ఇస్తూ, దేశవ్యాప్తంగా ఉద్యోగాలు, ఉపాధి కల్పించడంలో కేంద్రం రూ. లక్ష కోట్లు పెట్టుబడి పెడుతుందని ప్రధాని అన్నారు. తూర్పు భారత దేశం సమగ్ర అభివృద్ధికి 'విక్షిత్ బీహార్' ముఖ్యమైనదని మోదీ పేర్కొంటూ రాష్ట్ర పురోగతి గురించి ఎన్‌డిఎ ఆందోళన చెందుతోందని అన్నారు. 'గత 45 రోజుల్లో ప్రభుత్వం బీహార్‌లోని 24,000 స్వయం సహాయక బృందాలకు రూ. 1,000 కోట్లు విడుదల చేసింది. దేశంలోని మొత్తం 1.5 కోట్ల 'లక్షపతి దీదీ'లలో 20 లక్షల మంది రాష్ట్రానికి చెందినవారే' అని అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్మా గాంధీ ఉద్యమానికి చంపారన్ కొత్త దిశానిర్దేశం చేశారని చెప్పారు. ముంబయిలాగే మోతీహారిని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు.

## ఢిల్లీలో 45 పాఠశాలలకు బాంబు బెదిరింపు మెయిల్స్




**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదిరింపులు ఘటనలు అంతకంతకూ పెరుగుతున్నాయి. తాజాగా శుక్రవారం శుక్రవారం ఢిల్లీలోని 45కు పైగా పాఠశాలలు, మూడు కళాశాలలకు ఇ-మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. వరుస ఘటనలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడం ఈ వారంలో ఇది నాల్గవ రోజు. ఢిల్లీ పోలీసులు, ఇతర సత్వర స్పందన అధికారులు ప్రస్తుతం గాలింపు, తరలింపు కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారని ఒక అధికారి తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే బాంబు నిర్వీర్య, డాగ్ స్క్వాడ్‌లతో పాటు పోలీసులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకున్నారు. అధికారుల నుండి అందిన తాజా సమాచారం ప్రకారం, ఉత్తర ఢిల్లీలోని ఇంద్రప్రస్థ (ఐపి) కాలేజ్ ఫర్ ఉమెన్, హిందూ కాలేజీ, శ్రీ రామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సిసి) వంటి మూడు కళాశాలలకు ఇటువంటి బెదిరింపులు వచ్చినట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. గతంలోనూ బహుళ జిల్లాల్లోని పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ద్వారకలో, సెయింట్ థామస్ స్కూల్, జిడి గోయెంకా స్కూల్, డిఐఎస్ ఎడ్జ్ స్కూల్, మోడరన్ ఇంటర్నేషనల్ స్కూల్, ద్వారకా ఇంటర్నేషనల్ స్కూల్, లా పెటైట్ మాంటిస్సోరి ఆరు పాఠశాలలకు బెదిరింపులు వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందించింది. తదనంతరం, ఈ పాఠశాలల్లో సహాయక చర్యలు ప్రారంభించారు. 'హలో... నేను పాఠశాల తరగతి గదుల్లో అనేక పేలుడు పరికరాలను (ట్రినిట్రోటోలుయెన్) ఉంచానని మీకు తెలియజేయడానికి వ్రాస్తున్నాను. పేలుడు పదార్థాలను నల్లటి ప్లాస్టిక్ సంచులలో దాచిపెట్టారు' అని ఇమెయిల్స్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ద్వారక పాఠశాలల్లో ఇప్పటివరకు అనుమానాస్పదంగా ఏమీ కనుగొనబడలేదని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ద్వారక) అంకిత్ సింగ్ తెలిపారు. అదేవిధంగా, రోహిణిలో, సెక్టార్ 3లోని ఎంఆర్‌జి స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, సెక్టార్ 24లోని సావరిన్ పబ్లిక్ స్కూల్, హెరిటేజ్ పబ్లిక్ స్కూల్, సెక్టార్ 9లోని ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్, సెక్టార్ 3లోని అభినవ్ పబ్లిక్ స్కూల్, హెరిటేజ్ స్కూల్ అధికారులు తమ ప్రాంగణంలో పేలుడు పరికరాలు ఉన్నాయని మెయిల్స్ రాగా, పోలీసులను సంప్రదించిన తర్వాత తరలింపు ప్రక్రియను ప్రారంభించారు. దేశ రాజధానిలోని ఇతర ప్రాంతాల పాఠశాలల్లో కూడా ఇలాంటి దృశ్యాలు కనిపించాయి. ఈ విషయంపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిషి బిజెపిని తీవ్రంగా విమర్శించారు.

**బెంగళూరులోనూ బాంబు బెదిరింపులు**

ఢిల్లీ తరహాలోనే శుక్రవారం బెంగుళూరులోని స్కూళ్లకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. సిటీలోని సుమారు 40 ప్రైవేటు స్కూళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు పోలీసులు వెల్లడించాయి. ఆర్ఆర్ నగర్‌తో పాటు కేన్‌గిరిలో ఉన్న స్కూళ్లకు కూడా బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. బెదిరింపు మెయిల్స్ రావడంతో విద్యార్థులు, పేరెంట్స్ ఆందోళనకు గురయ్యారు. పోలీసులు తక్షణమే స్కూళ్ల వద్ద తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు.


## లాలూపై ట్రయల్ కోర్టు విచారణ నిపివేతకు సుప్రీం 'నో'



**న్యూఢిల్లీ :** భూములకు ఉద్యోగాల కుంభకోణంలో బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌కు చుక్కెదురైంది. ఈ కేసులో ట్రయల్ కోర్టు విచారణను నిలిపివేసేలా ఢిల్లీ హైకోర్టుకు ఆదేశాలివ్వాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారంనాడు కొట్టివేసింది. ఈ కేసులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో ఈ కేసు విచారణ యథాతథంగా కొనసాగనుంది. ఇండియన్ రైల్వేస్ వెస్ట్ సెంట్రల్ జోన్ జబల్‌పూర్‌లో గ్రూప్‌డి నియామకాల్లో అవకతవకలకు సంబంధించిన కేసు ఇది. 2004-2009 మధ్య లాలూ ప్రసాద్ రైల్వేశాఖ మంత్రిగా ఉన్నారు. ఉద్యోగాలకు ప్రతిగా అభ్యర్థులు లాలూ కుటుంబసభ్యులు, సన్నిహితులకు భూములు బదలాయించారని ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీల ఆరోపణగా ఉంది. ఈ క్రమంలో సిబిఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాల్సిందిగా లాలూ ప్రసాద్ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. అయితే అత్యున్నత న్యాయస్థానం ఇందుకు నిరాకరించింది. విచారణను త్వరతగతిన పూర్తి చేయాల్సిందిగా ఢిల్లీ హైకోర్టును న్యాయమూర్తులు ఎంఎం సుంద్రేష్, ఎన్.కోటీశ్వర్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టు ముందు జరుగుతున్న విచారణలో జోక్యం చేసుకోలేమని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. ప్రస్తుతానికి విచారణ కోర్టుకు లాలూ ప్రసాద్ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. దీనికి ముందు, ఈ కేసులో ప్రత్యేక కోర్టు ముందున్న విచారణపై స్టే ఇచ్చేందుకు మే 29న ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణను ఆగస్టు 12కు వాయిదా వేసింది.

## ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న ఖైదీల విడుదలపై రాష్ట్రాలు ఉమ్మడి నిర్ణయం తీసుకోవాలి

సుప్రీంకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ :** జైలు నిబంధనలు రాష్ట్రాల వారీగా వేర్వేరుగా ఉంటాయని, అయితే ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలను విడుదల చేసే క్రమంలో ఒకే రకమైన నియమాలు రూపొందించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మోహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ప్రాణాంతక వ్యాధులున్న రోగులు, 70 ఏళ్ల పైబడిన ఖైదీలను విడుదల చేయాలని నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను రిజర్వ్ చేసింది. ఈ విషయంలో కేంద్రం ఇప్పటికే మార్గదర్శకాలను రూపొందించిందని, అదే రికార్డులో ఉన్నట్లు తెలిపింది. 'జైలు నిబంధనల విషయానికి వస్తే రాష్ట్రాల వారీగా వ్యక్తిగతంగా ఉంటాయి. అయితే, ప్రాణాంతక వ్యాధులున్న రోగుల విడుదలకు అన్ని రాష్ట్రాలు ఒకే రకమైన నిబంధనల రూపకల్పనకు ముందుకు రావాలి.' అని బెంచ్ తెలిపింది. అయితే, ఇలాంటి ఖైదీల పట్ల కేంద్రం ఆలోచిస్తుందని అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు తెలిపారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇందుకు తగిన నిర్వహణ చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. క్షమాభిక్షలో భాగంగా ఇలాంటి ఖైదీల విడుదల అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలకు కేంద్రం సూచించినట్లు చెప్పారు. మరోవైపు ఈ విధానంలో దుర్వినియోగం జరిగే అవకాశాలను సుప్రీం పరిగణనలోకి తీసుకుంది. ఇలాంటి అర్హులైన ఖైదీలకు వైద్య చికిత్స, విడుదల విషయంలో సరైన నిబంధనలను రూపొందించాలని చెప్పింది. దీనిపై స్పందించిన పిటిషనర్ ప్రాణాంతక వ్యాధులుగా ఉన్నవారిగా ఎవరిని గుర్తించాలనే అంశాన్ని మార్గదర్శకాల్లో ఉంచామని తెలిపారు. వీరిని సంబంధిత జైలు వైద్య అధికారి ధ్రువీకరిస్తారని చెప్పారు. ఇందు కోసం ఒక వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రం ఆలోచిస్తుందని తెలిపారు. ఈ క్రమంలోనే ఢిల్లీ ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది మాట్లాడుతూ 1985 నుంచి ఆస్తమాతో బాధపడుతున్న ఖైదీ జైలులో ఉన్నాడని తెలిపారు. మరోవైపు కేరళలో కూడా 94ఏళ్ల ఖైదీ ఉన్నాడని నల్సా న్యాయవాది చెప్పారు. 2018లో రూపొందించిన విధానంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తుల కోసం కొన్ని నిర్దిష్ట నిబంధనలను చేర్చిందని, వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని ఉత్తరప్రదేశ్ న్యాయవాది అన్నారు. కాగా, ఈ పిటిషన్‌పై మే 5న కేంద్రంతో పాటు బిహార్, ఉత్తరప్రదేశ్ సహా 18 రాష్ట్రాల స్పందనలు కోరింది సుప్రీం కోర్టు. 70ఏళ్లు పైబడిన, ప్రాణాంతక వ్యాధిగ్రస్తులైన ఖైదీలు బిహార్, కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బంగాల్, ఒడిశాతో సహా అనేక రాష్ట్రాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్నారని నల్సా తెలిపింది. తమ నేరారోపణలను సవాలు చేయడానికి, బెయిల్ నిరాకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు రాలేని ఇలాంటి ఖైదీల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని పిటిషనర్ వాదించారు. జైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల జైలు అధికారులు సహాయం అందించడం కూడా సాధ్యం కాకపోవచ్చు అని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందుకే ఈ విషయంలో జోక్యం అవసరమని అన్నారు. 2022 డిసెంబర్ 31 నాటికి దేశంలో జైలు ఆక్యుపెన్సీ రేటు 131 శాతంగా ఉందని చెప్పింది.



## మనీలాండరింగ్ కేసులో ఛత్తీస్‌గఢ్ మాజీ సిఎం కుమారుడు అరెస్టు

**రాయ్‌పూర్ :** లిక్కర్ స్కామ్‌తో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ నాయకుడు, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బాఘేల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం అరెస్టు చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దుర్గ్ జిల్లా భిలాయ్ పట్టణంలోని ఆయన నివాసంలో తాజాగా దాడులు నిర్వహించిన తర్వాత మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆయన నివాసం వద్ద పార్టీ పార్టీ మద్దతుదారులు తరలి రాగా, ఇంటి వెలుపల భారీ సంఖ్యలో పోలీసు సిబ్బంది మోహరించారు. శుక్రవారం చైతన్య పుట్టినరోజు అని మాజీ ముఖ్యమంత్రి బఘేల్ తెలిపారు. కాగా, ప్రత్యేక పిఎంఎల్‌ఎ కోర్టు చైతన్యను ఐదు రోజుల పాటు ఇడి కస్టడీకి పంపినట్లు వర్గాలు తెలిపాయి. ఈ కేసులో తాజా ఆధారాలు అందిన తర్వాత సోదాలకు సహకరించడం లేదని ఆరోపిస్తూ మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 19 కింద చైతన్యను అరెస్టు చేసినట్లు వర్గాలు తెలిపాయి. చైతన్యతో సంబంధం ఉన్న కంపెనీలు మద్యం కుంభకోణం నుండి వచ్చిన దాదాపు రూ. 17 కోట్ల నేరపూరిత ఆదాయాన్ని పొందాయని ఆ వర్గాలు తెలిపాయి. ఈ కుంభకోణం ఫలితంగా రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం జరిగిందని, మద్యం సిండికేట్ లబ్ధిదారుల జేబులను రూ. 2,100 కోట్లకు పైగా నింపిందని ఇడి పేర్కొంది. రాయ్‌గఢ్ జిల్లాలోని తమ్నార్ తహసీల్‌లో అదానీ గ్రూప్ బొగ్గు గని ప్రాజెక్ట్ కోసం చెట్లను నరికివేసే అంశాన్ని లేవనెత్తాల్సి ఉండగా, అసెంబ్లీ సమావేశాల చివరి రోజున ఇడి తన ఇంటికి వచ్చిందని భూపేశ్ బఘేల్ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. ఈ నెల ప్రారంభంలో సీనియర్ బఘేల్ తహసీల్‌ను సందర్శించి, ఆ ప్రాంతంలో బొగ్గు గని ప్రాజెక్టు కోసం చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న స్థానిక గ్రామస్తులకు మద్దతు ఇచ్చారు. ఈ గనిని మహారాష్ట్ర స్టేట్ పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించారు. ఇది ఎండిఒ (మైన్ డెవలపర్ కమ్ ఆపరేటర్)ను అదానీ గ్రూప్‌కు కాంట్రాక్ట్ ఇచ్చింది. విపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, అయితే తాను న్యాయవ్యవస్థను విశ్వసించానని, వారితో సహకరిస్తానని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శుఓకవారం ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ కార్యకలాపాలను బహిష్కరించారు. ఏజెన్సీ ప్రతిపక్షాలను వేధించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

## ఒక మార్పు... అభివృద్ధికి మలుపు

ప్రజాపక్షం/దేవరకొండ: ఒక మార్పు అభివృద్ధికి మలుపు అని ఆకాంక్షిస్తూ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఎన్నో అద్భుత ఫలితాలు సాధించామని దేవరకొండ మునిసిపల్ చైర్మన్ వై. సుదర్శన్ అన్నారు. శుక్రవారం 100 రోజుల ప్రణాళికలో ఇచ్చిన సూచన మేరకు ఖిల్లా పార్కులో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా 19వ వార్డు ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఏబిసి ప్రచార వీధి, పెంపుడు కుక్కలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాణిజ్య లైసెన్స్ పరిశీలన రోజువారి కార్యాచరణలో భాగంగా వాణిజ్య లైసెన్స్ పరిశీలన జరిగింది. ఈ కార్యక్రమంలో ఏతం రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, మునిసిపల్ మేనేజర్ రాకేష్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సత్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## రామకృష్ణను పరామర్శించిన ఎమ్మెల్సీ

ప్రజాపక్షం/యాదాద్రి: రోడ్డు ప్రమాదానికి గురైన డిప్యూటీ సీఎం పీఆర్వో రామకృష్ణను శుక్రవారం శాసనమండలి సభ్యులు, సిపిఐ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లికంటి సత్యం యాదగిరిగుట్టలోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఆయన వెంట యాదాద్రి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగయ్య, మండల కార్యదర్శులు గాదగాని మాణిక్యం, చిగుళ్ల లింగం ఉన్నారు.





## గత ప్రభుత్వం రేషన్‌కార్డులివ్వలేదు

ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

ప్రజాపక్షం/కోదాడ: అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు ఇస్తామని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ లు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురం రోడ్డులో గల దేశాబు ఫంక్షన్ హాల్లో నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూర్యాపేట జిల్లాలోనే సన్నబియ్యం పథకం ప్రారంభం, నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ జిల్లాలోనే జరిపించారని అన్నారు. కోదాడ డివిజన్‌లోని ఆరు మండలాల్లోని కోదాడ, చిలుకూరు, అనంతగిరి, మునగాల, నడిగూడెం, మోతె మండలాల్లోని 174 చౌక దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ జరుగుతుందని, కోదాడ డివిజన్‌లో నూతన రేషన్‌కార్డులు 4171 కార్డులు అర్హులైన పేదవారికి రావడం జరిగిందని, కొత్త కుటుంబ సభ్యుల పేర్ల నమోదు అయినవి 9201 వచ్చినవని కలెక్టర్ తెలిపారు. ప్రజా పాలన, మీసేవ కేంద్రాలలో వచ్చిన దరఖాస్తులను విచారణ జరిపి అర్హులైన వారికి ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మాట్లాడుతూ గత పది ఏ ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, తహసిల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు శాస్త్రీయ రంగాలలో సైన్స్ దృక్పథం అలవర్చాలి

గూడూర్ ఉన్నత పాఠశాల సందర్శించిన రాష్ట్ర విద్యా కమిషనర్ చైర్మన్ ఆకునూరి మురళి



ప్రజాపక్షం/బీబీనగర్ : మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషనర్ చైర్మన్ ఆకునూరు మురళి శుక్రవారం పాఠశాలను సందర్శించి ఇంటిగ్రేటెడ్ లైబ్రరీని పరిశీలించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ కృత్యాలు ప్రయోగాలు వర్చువల్ రియాల్టీ ప్రదర్శలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో లైబ్రరీ సైన్స్ ల్యాబ్ వర్చువల్ రియాల్టీ లాంటి సౌకర్యాలను కల్పించి విద్యార్థులను శాస్త్రీయ రంగాలలో సైన్స్ దృక్పదం అలవర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కే.సత్యనారాయణ, రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారులు ఆర్.వెంకట్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వెంకట్ రెడ్డి, తెలంగాణ డెవలప్మెంట్ పోరం ప్రతినిధులు గోన రెడ్డి ప్రీతి రెడ్డి, గూడూరు చిన్న నారాయణరెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు అరుణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.బాల్రెడ్డి పాల్గొన్నారు.

## పరిశుభ్రత విషయంలో రాజీపడేది లేదు




ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: పరిశుభ్రత విషయంలో రాజీపడే సమస్య ఉండదని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా 41వ వార్డులో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీధి, ప్రతి కాలనీ శుభ్రంగా ఉండేలా అధికారులను కట్టుదిట్టంగా నియమించి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. వార్డులో డ్రైనేజీ, తాగునీటి సరఫరా, దోమల ఉధృతి వంటి అంశాలపై ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిశీలిస్తున్నామని అన్నారు. ప్రజల సమన్వయంతో సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా మున్సిపాలిటి ముందడుగు వేస్తుందని అన్నారు. వార్డు ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తమ చెత్తను తడి, పోడి చెత్తగా వేరు చేసి ఇళ్ల ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిఈ సత్యారావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ షఫి ఉల్లా, అయూబ్‌ఖాన్, కుమ్మరికుంట్ల లింగయ్య, ఎఇ తిరుమల్లయ్య, వార్డు అధికారి శ్వేత, శివప్రసాద్ పాల్గొన్నారు.

## ఆశావహులకు రిజర్వేషన్లు కలిసొచ్చేనా..?

ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు




ప్రజాపక్షం/మునుగోడు: మండలంలో ఎంపిటిసి జడ్పిటిసి సర్పంచులకు పదవి కాలం సర్పంచులకు 2024 ఫిబ్రవరికి జడ్పిటిసి ఎంపిటిసి లకు 2024 జూలైలో పదవి కాలం ముగిసింది దీంతో గ్రామాలకు అప్పటి నుండి ఇప్పటివరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల ఎంపిటిసిల పదవి కాలం ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించకుండా సంవత్సరం పాటు అధికారుల పాలన కొనసాగిస్తుంది. రాష్ట్రంలో సెప్టెంబర్ నెల కల్లా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇవ్వడంతో మండలంలో సర్పంచులకు ఎంపిటిసిలకు స్థానాలకు పోటీ చేసే రాజకీయ నాయకులు ఓటర్లను కుల సంఘాల నాయకులను ఊర్లలో ఉండే పెద్ద మనుషులను ఈసారి నాకు సపోర్ట్ చేయాలని నన్ను గెలిపించాలని మచ్చిక చేసుకుంటున్నారు. అందులో భాగంగా గత ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు ఈసారి నన్ను గెలిపించాలని గెలిచిన అభ్యర్థులు ఊరిని అభివృద్ధి చేశానని మరోసారి నాకు అవకాశం కల్పించాలని గతంలో పోటీ చేసేందుకు రిజర్వేషన్లు అనుకూలించని నాయకులు కొత్తగా పోటీ చేసే నాయకులు కూడా మాకు సపోర్ట్ చేయాలని ఓటర్లను వేడుకుంటున్నారు.రేపో మాపో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని ఆశతో ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. ఆ తర్వాత ఆయా గ్రామాలకు వచ్చే రిజర్వేషన్లతో ఆశావాకులకు అవకాశం కలిసి వచ్చేనా వేసి చూడాల్సిందే.

# అర్హులకు కొత్త రేషన్ కార్డులు

ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యుడు బీర్ల ఐలయ్య

పేదవాడు కడుపు నిండా అన్నం తినాలనే సంకల్పంతో సన్నబియ్యం పంపిణీ



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం ఆలేరు నియోజకవర్గ స్థాయిలో యాదగిరిగుట్ట మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఫంక్షన్ హాల్ నందు ఆహార భద్రత కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఆలేరు నియోజకవర్గంలో కొత్తగా 5,600 రేషన్ కార్డులు మంజూరీ చేయడం జరిగిందని, 15,632 యూనిట్లు మొత్తం 18,640 మంది సుమారు ఆలేరు నియోజకవర్గంలోనే 36 వేల మందికి 6 కిలోల చొప్పున తెల్ల రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమం ప్రజా ప్రభుత్వం చేపట్టిందన్నారు. గత ప్రభుత్వంలో దొడ్డు బియ్యంతో పేదవారు అన్నం తినకుండా బియ్యం దళారులకు అమ్ముకునేవారు. ఈ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి గొప్ప ఆలోచన మేరకు పేదవారు కడుపునిండా అన్నం తినాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఏ బియ్యం తింటున్నారో అదే బియ్యం ప్రతి పేదవారు సన్న బియ్యంతో కడుపునిండా తినాలని గొప్ప కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. పేదవారి సొంతింటి కల నెరవేర్చేందుకు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు, మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేసి కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ముఖ్యమంత్రి ఆలోచన అని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి సంక్షేమ పథకంలో మహిళలను భాగస్వామ్యం చేస్తున్నారు.అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మహిళలు కాంట్రాక్టర్ గా మారి నిర్మాణాలు చేపట్టారన్నారు. గత ప్రభుత్వంలో కొత్తగా పెళ్లయిన, పిల్లలు పుట్టిన వారిని రేషన్ కార్డులు చేర్చాలంటే అనుమతించేదని ఈ ప్రభుత్వం వచ్చినాక రేషన్ కార్డులో లబ్ధిదారులు నమోదుకు నిరంతర ప్రక్రియగా చేపట్టామన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ఒక పండుగ వాతావరణంలో అమలవుతున్నాయన్నారు. జిల్లాలో 1/4 శాతం ఆలేరు నియోజకవర్గ లబ్ధిదారులకే కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎవరైతే తొందరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకుంటారో వారికి ఆలేరు శాసనసభ్యులు నూతన వస్త్రాలు గొర్రె పొట్టేలు అందించడం ఎంతో అభినందనీయం అని అందుకు ప్రతి ఒక్కరు వారికి కృతజ్ఞతలు తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ఆలేరు, మోత్కూరు మార్కెట్ కమిటీల చైర్మన్లు జనాల చైతన్య మహేందర్ రెడ్డి, విమల వెంకటేష్, ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఆలేరు నియోజక వర్గం తహసీల్దార్‌లు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.



## ఔషధ మొక్కలను కాపాడుకుందాం

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: ఔషద మొక్కలను కాపాడుకుందాం వాటి విలువను తెలుసుకోవాలని రిటైర్డ్ డిప్యూటి రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ రఫీయుద్దీన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో పర్యావరణం పరిరక్షణలో భాగంగా ఔషదవనం, కూరగాయల సాగు, ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషద మొక్కలు ప్రతి ఒక్కరి ఇంట్లో ఉండాలని, ప్రతి విద్యార్థికి ఔషద మొక్కలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం తులసి, అడ్డసారం మొక్కలపై వివరించారు. సిజిఆర్ అడ్మిషన్ ఆఫీసర్ అనుదీప్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంత, కంపోస్టు ఫిట్, ఔషద వనం, కూరగాయల తోటలు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ, ఉపాధ్యాయులు విశ్వజ్ఞ చారి, సిజిఆర్ జిల్లా కోఆర్డినేటర్ మామిడి శంకరయ్య, కత్తి కోటయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాగర్ ఎడమకాలువకు నీరు విడుదల చేయండి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (గరిడేపల్లి): వానాకాలం సీజన్ ప్రారంభమై నెలరోజులవుతున్నదని రైతులు నార్లుపోసుకొని నాట్లకు సిద్ధంగా ఉన్నారని, అనేక మంది రైతులు వడ్లను ఎదజల్లుకునే పద్ధతిలో వడ్లు చల్లుకుని 20 రోజులవుతున్నదని, అలాగే చాలమంది రైతులు డ్రమ్‌సీడ్ లాగారని, వారందరూ తడికట్టుకోవడానికి నీళ్లులేక సాగర్ నీటి కోసం ఎదురుచూస్తున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన గరిడేపల్లి మండలంలోని కొండాయిగూడెం గ్రామంలో జరిగిన రైతు సంఘ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులో సరిపోను నీళ్లు ఉండి కూడా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఎన్నడులేని విధంగా శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా ఉందని, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కూడా 560 అడుగుల నీరు వచ్చిన తర్వాత కూడా వ్యవసాయానికి నీళ్లని ఇవ్వటానికి మీనమేషాలు లెక్కించడం సరికాదని అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి సాగర్ ఎడమకాలువ ద్వారా పాలేరు జలాశయాన్ని నింపుకొని ఖమ్మం జిల్లా మంత్రులు పాలేరు ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తే సాగర్ ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న మేజర్లకు నీటిని విడుదల చేయకపోవడంలో ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఎడమకాలు ఆయకట్టు పరిధిలోని అన్నిమేజర్లు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, నాయకులు కుందురు వెంకటరెడ్డి, అంబటి వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, పంగ గోవిందు, బక్కయ్య, ఈదయ్య, నందిపాటి కాశయ్య, ముండ్లకోటయ్య, కర్నే సైదిరెడ్డి, గోవిందరెడ్డి, కేతిరెడ్డి సంజీవరెడ్డి, బంధురామయ్య, ఏసుపాదం, మాతంగి వెంకన్న పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల కలయిక సాధ్యం పడదు

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్



ప్రజాపక్షం/నల్లగొండ: కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను అంతం చేసి గిరిజ,ఆదివాసుల సంపదను కొల్లగొట్టి సంపన్న వర్గలకు ధారదత్తం చేయడం కోసం నక్సలైట్లు చంపుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. ఆపరేషన్ వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉన్న పది వామపక్ష పార్టీలు ప్రత్యేక కార్యచరణతో ఆందోళన పోరాట కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అయినా కమ్యూనిస్టులో కలయిక సాధ్యపడదని స్పష్టం చేశారు.శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరుగుతున్న ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశానికి విచేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మంత్రులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో బనకచర్లపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చలు జరిపారని కొన్ని నిర్ణయాలు జరిగాయని ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ మంత్రి రామానాయుడు ప్రకటన చేసిన నేపథ్యంలో అసలు చర్చలు జరిగాయా లేదా స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత తెలంగాణ ముఖ్యమంత్రిపై ఉందని వెంటనే ప్రజలకు స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై ఆందోళన కార్యచరణ సిద్ధం ఆగస్టు, సెప్టెంబర్ నెలలో గ్రామాలు, బస్తీలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఆందోళన చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. గ్రామాలకు బస్తీలకు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి అయిలయ్య, డబ్బికార్ మల్లేష్, బండ శ్రీశెలం, పాలడుగు నాగార్జున పాల్గొన్నారు.

## త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి



యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు

ప్రజాపక్షం/మోటకొండూర్ : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం మండలంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇండ్లు నిర్మాణం పనులు వేగంగా పూర్తి చేసుకోవాలన్నారు. స్లాబ్ దశ పూర్తి అయిన మిగిలి ఉన్న పనులు కూడా పూర్తి చేసుకుంటే వెంటనే డబ్బులు పడతాయని అన్నారు. తొందరగా నిర్మాణాలు పూర్తి అయితే తొందరగా గృహప్రవేశం చేసుకోవచ్చన్నారు. గ్రామంలో ఇసుక, మట్టి అందుబాటులో ఉండేలాచూడాలన్నారు. లబ్ధిదారులకు ఇసుక, మట్టి కొరత లేకుండా సరఫరా చేయాలని తహసిల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ఇండ్లు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. బేస్మెంట్ లెవెల్ పూర్తయిన వారికి ప్రతి సోమవారం వారి ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మోటకొండూర్ లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం కింద అందిస్తున్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం మంచి రుచికరమైన భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ ఇందిర, యంపిఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ రవి చంద్ర, సంబంధిత అధికారులు ఉన్నారు.

## ప్రిపరేషన్‌తోనే పోటీ పరీక్షలు ఉన్నత శిఖరాలు

జిల్లాకలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: కళాశాల స్థాయిలోనే విద్యార్థులు నైపుణ్యత కలిగి పోట పరీక్షలకు సిద్దపడి చదవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ జూనియర్ కళాశాలను అకస్మికంగా తనిఖీచేసి నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని పరిశీలించి గుత్తేదారులను పనులు త్వరగా పూర్తి చేయాలని, క్వాలిటితో రాజీ పడకుండా ప్రతివారం పనుల పురోగతిపై నివేదిక అందించాలని కలెక్టర్ అన్నారు. బిహర్ నుండి వచ్చిన కూలీ చిన్న పిల్లలను చూసి చిన్న పిల్లలను పనుల వద్దకు తీసుకరావద్దని, వారిని దగ్గరలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలని ఐసిడిఎస్ సిబ్బందిని అదేశించారు. తదుపరి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం సైన్స్ విద్యార్థుల క్లాసులోకి వెళ్లి సైన్స్‌లో ఎలక్ట్రానిక్స్ సబ్జెక్ట్ మీద క్లాసు తీసుకున్నారు. వనజ అనే విద్యార్థిని లేపి పారడే మొదటిసూత్రాన్ని చెప్పాల్సిందిగా కోరగా విద్యార్థి సమాధానం చెప్పడం వల్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మోటివేషన్‌పై క్లాస్ తీసుకుని విద్యార్థులు కష్టపడి చదవాలని, ఎదో ఒక రంగంలో నైపుణ్యత సాధించాలని, కష్టపడితే ఫలితం అదే వస్తుందని అందుకు గానూ ప్రతి ఒక్కరు కష్టపడి చదవాలన్నారు. అలా చదువుకోవడం వల్లే మేము కలెక్టర్లం, మున్సిపల్ కమిషనర్లం, ఆర్డీవోలు, తహసిల్దార్లు అయ్యామని మమ్మల్ని ప్రేరణగా భావించి చదువుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసిల్దార్ నాగార్జునరెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గుంటుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిరంతర జీవనది... నీరు లేక నిర్జీవమైంది

వర్షాభావ పరిస్థితులకు ఒట్టిపోయిన నిరంతర జీవనది...

వాగులో తడి ఆరిన నీరు...

ఆందోళన చెందుతున్న అన్నదాతలు



ప్రజాపక్షం/ హాలియా: నిరంతరం నీటి ప్రవాహంతో కళకళలాడే అహల్య వాగు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నీరు లేక ఒట్టిపోయింది. ఏళ్ల తరబడి సాగునీటికి, మూగజీవాల గొంతు తడుపుతూ అన్నదాతలకు అన్నివేళలా నిరంధిస్తూ ఈ ప్రాంత ప్రజలకు జీవనదిగా మారింది. అలాంటి అహల్య వాగు సరైన వర్షాలు లేక పోవడంతో ఎండల తీవ్రతకు తడి ఆరి ఎండిపోయింది. దీంతో కొన్ని వందల ఎకరాలకు సాగునీటికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపయోగపడే అహల్య వాగు నేడు వెలవెలబోతుంది. గత మూడు నెలలుగా భారీ వర్షాలు ఏవి లేకపోవడం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వాగు పరిధిలో బోర్లను అధికంగా వినియోగించడంతో వాగు నీరు లేక ఎండిపోయింది. మూగజీవాలకు నీరు దొరకడం కూడా కష్టంగా మారింది. నిరంతరం నీటితో కళకళలాడే వాగు సైతం ఎండిపోయిందంటే వర్షాభావ పరిస్థితులు ఏమైనా ఉన్నాయో ఇట్టే తెలుస్తుంది. ఎడమ కాలువకు నీటి విడుదల ఆలస్యమైన బాగు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందిస్తూ ఉన్న ఈ వాగు ప్రస్తుతం వర్షాలు లేక ఉన్న నీరు ఇంకిపోయి వర్షాభావ పరిస్థితులకు అద్దం పడుతుంది. ఈ వాగు ఎండిపోవడంతో సుమారు దీని పరిధిలో ఉన్న 200 ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగునీరు అందే పరిస్థితి లేకపోవడంతో వాగు పరిధిలో సాగుచేసిన పంటలు ఎండిపోతుండడం తో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడమ కాలువకు నీటి విడుదల జరిగితేనే ఈ వాగులోకి నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. లేదంటే వరుణుడు కరుణిస్తే తప్ప అహల్య వాగులో నీటి ప్రవాహం వచ్చే పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆకాశం వైపు వరుని కరుణ కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితి నెలకొనడం గమనార్హం.

## తుర్కపల్లిలో వాహనాల తనిఖీ

ప్రజాపక్షం/తుర్కపల్లి : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో శుక్రవారంనాడు డీసిపి ఆకాంక్ష్ యాదవ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీని నిర్వహించారు. తుర్కపల్లి శివారు ఇండియన్ పెట్రోల్ పంప్ సమీపంలో భువనగిరి గజ్వేల్ ఎన్ హెచ్ 161 ప్రధాన రహదారిని నాకబందీ చేసి అనుమానాస్పద వాహనాలు, లైసెన్సులు, రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగాలేని వాహనాలు తనిఖీ నిర్వహించి వాహనదారులకు పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల, సమాజంలో ఎలాంటి అసాంగీక సంఘటనలు కాపాడే చర్యల్లో భాగంగా నాకాబంది కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏసీబి శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణే ప్రధానం

చెన్నూరు సిఐ దేవేందర్ రావు

**ప్రజాపక్షం/చెన్నూరు:** ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, నేరాల నియంత్రణే తమ ప్రధాన లక్ష్యమని చెన్నూరు సిఐ దేవేందర్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని పొక్కూరు గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, సన్మార్గంలో నడవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అలాగే 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు సిపిఐ జిల్లా 22వ మహాసభ




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా 22వ మహాసభలను నగరంలోని ప్రగతి నగర్ మున్నూరు కాపు కళ్యాణ మండపం మినీ హాలులో నిర్వహిస్తున్నామని సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య అన్నారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ హాజరవుతున్నారని అన్నారు. కావున జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు అన్ని సంఘాల బాధ్యులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కావున ఉదయం 10 గంటల వరకు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

## పేపర్‌మిల్‌లో ఉద్యోగాలు కల్పించాలి



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:** స్థానిక నిరుద్యోగులకు సిర్పూర్ పేపర్ మిల్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే డిమాండ్‌తో 22వ తేదీన నిరుద్యోగుల ర్యాలీ నిర్వహించనున్నట్టు విద్యార్థి, నిరుద్యోగ జెఎసి జిల్లా కన్వీనర్ పొన్న రమేష్ తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుండి సిర్పూర్ పేపర్ మిల్ స్టాఫ్ గేటు వరకు నిరుద్యోగుల ర్యాలీ చేపడతామని తెలిపారు. పేపర్ మిల్‌ను మళ్లీ ప్రారంభించినప్పటికీ స్థానికులకు ఉద్యోగాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. రాజకీయ జండాల కింద కాకుండా, అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థులు, యువజనులు, కార్మిక సంఘాలు, కుల సంఘాలు, విశ్రాంత ఉద్యోగులు, రాజకీయ పార్టీల నాయకులు అందరూ కలిసి ఉద్యమం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముజాబ మిలుద్దిన్ హైమద్, అఖీల్ హైమద్, ఎంఆర్పిఎస్ నాయకులు మంత్రి మల్లేష్, దుర్గం విస్తారు, బోగ శ్రీనివాస్, ఎన్నం శ్రీకాంత్, దుర్గం సూరజ్, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులలో ప్రతిభను వెలికి తీయడానికి డ్యూటీ మీట్స్




**ప్రజాపక్షం/ సంగారెడ్డి:** జోనల్ స్థాయి పోలీసు డ్యూటీ మీట్ నందు సందర్భంగా శుక్రవారం నాడు జిల్లా సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో జోనల్ డ్యూటీ మీట్ ను జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత నెలలో నిర్వహించిన జిల్లా స్థాయి డ్యూటీ మీట్ నుందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయడానికి జోన్ VIలో కమీషనరేట్స్ మినహా సంగారెడ్డి వికారాబాద్ జిల్లాకు చెందిన 56 మంది అధికారులు సిబ్బందికి డాగ్ స్క్వాడ్ బాంబ్ డిస్పోసల్ టీంలకు ఈ రోజు జోనల్ లెవెల్ డ్యూటీ మీట్ నిర్వహించడం జరిగింది. జోనల్ డ్యూటీ మీట్ నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 26072025 నాడు వరంగల్ లో నిర్వహించే రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పోలీసుల ప్రతిభను వెలికి తీయడానికి పోలీసు డ్యూటీ మీట్ నిర్వహించడం జరుగుతుందని ఈ డ్యూటీ మీట్ నందు సైంటిపిక్ ఎవిడెన్స్ నేరం జరిగిన తరువాత నేరస్థలం నందు క్లూస్ ఏవిదంగా సేకరించాలి ,కంప్యూటర్ పరిజ్ఞానం ,బాంబ్ స్క్వాడ్ ,డాగ్ స్క్వాడ్ పని తీరుపై పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నెల 26న వరంగల్ లో నిర్వహించే రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ నందు సత్తా చాటి అనంతరం పూనే లో జరిగే నేషనల్ స్థాయి డ్యూటీ మీట్‌కు అర్హత సాదించాలన్నారు. పోలీసుల పనితీరుకు అద్దం పట్టే ఇన్వెస్టేగేషన్ లో మెళకువలు ఈ డ్యూటీ మీట్ ద్వారా మరింత మెరుగ్గా నేరుకోవచ్చునన్నారు. సరైన పద్ధతిలో ఇన్వెసిగేషన్ చేసి కేసును డిటెక్ట్ చేసినట్లయితే ప్రజలలో పోలీసుల పై నమ్మకం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంబడి డ్యూటీ మీట్ నోడల్ అదికారి అదనపు ఎస్పీ ఎ సంజీవరావు డిసిఆర్బీ డిఎస్పీ శ్రీనివాస్‌రావు ,ఎఆర్‌డియస్పీ నరేందర్ వికారాబాద్ డ్యూటీ మీట్ నోడల్ అధికారి ఏఆర్‌డిఎస్పీ వీరేష్, ఎస్బీ ఇన్వెక్టర్ విజయ్, కృష్ణ, డిసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్ డ్యూటీ మీట్ అదికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో భవిష్యత్ విధ్వంసం

కాగజ్ నగర్ డిఎస్‌పి రామానుజం




**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** మాదకద్రవ్యాల వినియోగం భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. కాగజ్‌నగర్ డిఎస్‌పి రామానుజం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఓల్డ్ కాలనీలోని ఎక్బాల్ ఉర్దూ పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వలన యువత జీవితాలు తారుమారు అవుతున్నాయని, మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. మాదకద్రవ్యాల బానిసలుగా మారడం వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాదు, కుటుంబం, సమాజం కూడా ప్రభావితమవుతుందని తెలిపారు. యువత అభ్యున్నతికి అవరోధంగా మారుతున్న డ్రగ్స్‌ను సమాజం నుంచి తొలగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల విక్రయం, రవాణా, వినియోగం జరుగుతుందని తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా 8712670551కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ టౌన్ సిఐ ప్రేమ్ కుమార్, ఎస్ఐలు లక్ష్మయ్య, సంతోష్, పాఠశాల ప్రిన్సిపల్ నియాజ్ బాబా, వైస్ ప్రెసిడెంట్ ఇమాముద్దీన్, ఇమామ్ నవ్విదుల్ రహామాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## త్వరితగతిన రైతులకు సేవలు

**ప్రజాపక్షం/హాజీపూర్:** రైతులకు త్వరితగతిన సేవలు అందించే విధంగా రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టిన పి.చంద్రయ్య శుక్రవారం హాజీపూర్ తహాశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్‌కు తహాశీల్దార్ శ్రీనివాసరావు దేశ్ పాండే, సిబ్బంది పూలకుండి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ భూభారతి ద్వారా వచ్చిన దరఖాస్తులను నిష్పక్షపాతంగా పరిశీలించి, వీలైనంత త్వరగా ఆమోదించేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల దరఖాస్తులపై విభాగాధిపతులు సకాలంలో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయంలోని సిబ్బంది గదులను, భూభారతి గదిని పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన అదనపు కలెక్టర్, ప్రాజెక్టు పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులోకి వెళ్లి తాను స్వయంగా పరిశీలించారు. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ అతీష్, సీనియర్ అసిస్టెంట్ రంజిత్, గిర్దావర్లు యేసయ్య, మంగ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తనిఖీ

విభాగాల వారీగా ఫలితాలపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సమీక్ష





**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాలిటెక్నిక్ కళాశాలలను శుక్రవారం బోధన్ శాసనసభ్యులు పి.సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో సమావేశమై ఒక్కో విభాగం వారిగా నమోదైన ఫలితాలను అధ్యాపకుల ఖాళీలు, అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం తరగతి గదులు, వర్క్‌షాపులను సందర్శించి పనితీరును పరిశీలించారు. విద్యార్థులతో బేటీ అయ్యి వారికి అందిస్తున్న శిక్షణ తీరుతెన్నులపై అడిగి తెలుసుకున్నారు. మెకానికల్, సివిల్స్ తదితర వర్క్‌షాపులలో యంత్ర పరికరాల పనితీరుపై వాకబు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దోహదపడేలా విద్యార్థులకు నాణ్యతతో కూడిన శిక్షణ అందించాలని హితవు పలికారు. సాంకేతిక విద్యాభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా వివిధ డిప్లమా కోర్సులలో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తే విద్యార్థులు చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఆస్కారముంటుందన్నారు. పూర్తి స్థాయిలో శిక్షణ పొంది సాంకేతిక నైపుణ్యాన్ని ఏర్పర్చుకుంటే యువత స్వయం ఉపాధి పొందేందుకు కూడా అవకాశముంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా బోధనా సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. పాలిటెక్నిక్ కాలేజీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూరుస్తూ అవసరమైన బోధనా సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏమైనా లోటు పాట్లు ఉంటే వాటిని సవరించుకుని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నిర్వహణను మరింతగా మెరుగుపర్చాలని సూచించారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో కేవలం ఉత్తీర్ణత సాధిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని, ప్రతిభను కొలమానంగా గుర్తిస్తూ ఆయా సంస్థలు ఉపాధి కల్పిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించే పోటీ పరీక్షలలో సైతం నెగ్గుకురావలంటే అత్యుత్తమ ప్రతిభను చాటాల్సిన అవశ్యకత నెలకొందన్నారు. డిప్లొమా కోర్సు పూర్తి చేసిన వెంటనే ఆయా సంస్థలలో ఉద్యోగావకాశాలు లభించేలా విద్యార్థులకు తర్ఫీదునివ్వాలని సూచించారు. డిప్లొమా అనంతరం పై చదువులు చదివే వారికి మంచి ప్లేస్‌మెంట్‌లతో కూడిన ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలలో ప్రవేశాలు దక్కేలా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని హితవు పలికారు. ఇక నుండి తాను క్రమం తప్పకుండా ప్రతి మూడు మాసాలకోకసారి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నిర్వహణ, ఫలితాల సాధనపై సమీక్ష జరుపుతానని కలెక్టర్ స్పష్టం చేశారు. వీరి వెంట తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, గంగారెడ్డి, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధన సిబ్బంది ఉన్నారు.

## పాస్ బుక్ ప్రాసెసింగ్ కోసం రూ.2 లక్షల డిమాండ్

ఎసిబి అధికారులను ఆశ్రయించిన బాధితులు

ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ ఆధ్వర్యంలో అధికారుల తనిఖీలు



**ప్రజాపక్షం/గజ్వేల్:** పట్టేదారు పాసుపుస్తకం ప్రాసెస్ కోసం ఓ రైతు ములుగు మండల డిప్యూటీ తాసిల్దార్ ఎలగందుల భవానిని సంప్రదించగా, ఆమె పాస్ పుస్తకం ప్రాసెస్ పూర్తి చేసేందుకు రూ రెండు లక్షలు డిమాండ్ చేసింది. దీంతో బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, శుక్రవారం ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో అధికారులు ములుగు తహసిల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో డిప్యూటీ తాసిల్దార్ భవాని సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని ఆమెపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు ఎసిబి డిఎస్పి సుదర్శన్ పేర్కొన్నారు.

## సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/తాండూర్ :** ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంను మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తో కలిసి సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, త్రాగునీరు, వంటశాల, భోజనశాల, వసతి గృహంలో వసతులు, పడకలు, మూత్రశాలలు, గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ, వంటశాల ఇతర అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని, ఆహారం తయారీ సమయంలో నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, శు ద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వర్షాకాలం కావడంతో పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని, బడి బయట పిల్లలు, మధ్య బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం పాఠశాల భవనంపై నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరిగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అన్ని ఆలయాలను దశలవారీగా అభివృద్ధి





బాసర అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/నిర్మల్, బాసర:** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శుక్రవారం ఉదయం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి సన్నిధికి వచ్చిన మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు వేద మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం అర్చకులు మంత్రికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే మహంకాళి, దత్తాత్రేయ స్వామిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం వసతి గృహంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రికి నిర్మల్ పెయింటింగ్స్ చిత్రపటం బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని ఆలయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తోందని, బాసర నూతన ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలుపై ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకుముందు ఐఐఐటి వసతి గృహంలో మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ పాఠక్, ఈవో సుదర్శన్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా కృషి



కలెక్టర్ పావీణ్య

**ప్రజాపక్షం/సంగారెడ్డి:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ఇళ్ల నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేపట్టాలని కలెక్టర్ లబ్దిదారులకు సూచించారు. శుక్రవారం వట్టిపల్లి మండలం దేవనూరు గ్రామంలో బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మాణంలోఉన్నా ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఎంత త్వరగా పూర్తిచేస్తే అంత త్వరగా బిల్లులు లబ్దిదారులకు అందిస్తామని తెలిపారు. స్వయం సహాయక బృందాలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు వడ్డీ లేని ఋణాల ద్వారా ఇంటి నిర్మాణానికి సహకారం అందిస్తామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఏమైన సమస్యలు ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పంచాయితీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో లబ్దిదారులను నేరుగా కలిపి వారు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలన్నారు. ఇందిరమ్మ, ఇండ్ల నిర్మాణంలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిర్మాణం పనులు పూర్తి చేయడంలో జిల్లాను ఆగ్రగామిగా నిలపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ పాండు రెవన్యూ అధికారులు మండల పరిషత్ అధికారులు సంబందిత అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు సౌకర్యం కల్పించండి



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టిన విద్యార్థులు

**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జీడుచేను విద్యార్థులు తమ గ్రామం నుండి భట్టుపల్లిలోని జడ్పిపాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు బురదమయం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీడిచేను నుండి పాఠశాలకు వెళ్లాలంటే వర్షాలకు రోడ్డు వెళ్లే రోడ్డు గుంతులు పడి బురదమయంగా మారి ప్రమాదకరంగా ఉందని దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని రోడ్డు పై బైఠాయించారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయారు. రోడ్డు బాగుచేయాలని ఎన్నిసార్లు ఆందోళన చేసిన ఎవరు పట్టించుకోవడం లేదని అన్నారు. తమకు బడికి వెళ్లేందుకు రోడ్డు బాగు చేసి సౌకర్యం కల్పించాలని కోరారు. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ ఎంపిడిఓ కోట ప్రసాద్ ఆందోళన చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. గ్రామపంచాయతీ నిధులతో త్వరలోనే రోడ్డుకు ప్రత్యేక మరమ్మతులు చేపడతామని హామీ ఇవ్వడంతో, ఆందోళన విరమించారు.

## సాగునీటి కోసం రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/ఎడపల్లి:** సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ నిజాంసాగర్ డి46 కెనాల్ ఆయకట్టు రైతులు శుక్రవారం శుక్రవారం బోధన్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎడపల్లి మండలం సాటాపూర్ గేటు వద్ద జరిగిన ఈ ఆందోళనలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొని తమ పంటలను కాపాడుకోవడానికి తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఆశించి రైతులు పెద్ద ఎత్తున పంటలు వేసుకున్నారు. అయితే వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో తమ పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డి 46 కెనాల్ ద్వారా నీటిని విడుదల చేస్తేనే పంటలను రక్షించుకోవచ్చని, లేదంటే భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుందని వారు తెలిపారు. దుబ్బాతండా, భూలక్ష్మి క్యాంప్, పెంటాకలాన్, బర్దిపూర్, ఏఆర్పీక్యాంప్, అంబం పెగడాపల్లి, అంబేద్కర్ నగర్, రెంజల్, ఎడపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఈ రాస్తారోకోలో పాల్గొన్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించబోమని రైతులు స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న ఎడపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. సాగునీటి విడుదలకు ఆదేశాలు ఇచ్చే వరకు రాస్తారోకో విరమించేది లేదని రైతులు భీష్మించుకొని కూర్చోగా స్పందించిన ఇరిగేషన్ డీఈ అధికారులతో చర్చలు జరిపి నీటి విడుదలకు కృషి చేస్తానని హామీనిచ్చారు. దీంతో రైతులు రాస్తారోకోను విరమించారు.ఈ రాస్తారోకోలో 200మంది రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మోక్షం ఎన్నడో..!



**ప్రజాపక్షం/నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోతుందని మండల విద్యార్తులు అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ఆర్మూర్ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం మారినా కళాశాలకు మోక్షం లభించలేదు. మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఒకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. నందిపేట్‌లో ప్రయివేటు కళాశాలలు ఉన్నాయి. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు డిగ్రీ చదవడానికి నిజామాబాద్, ఆర్మూర్ వెళ్లాల్సి వస్తుందని యువజన నాయకులు అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా పలితం లేదు. మండలంలో మధ్య తరగతి కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. వీరురోజు బస్సులలో జిల్లా కేంద్రం వెళ్లి వస్తుంటారు. రోజు ప్రొద్దుననే వెళ్ళాలి. భోజనం కాకున్నా బాగో బాగో. పేద కుటుంబాల విద్యార్తులు జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఫీజులు చెల్లించలేక చదువులు మానుకుంటున్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి కూడా విద్యార్థులు, యువజన నాయకులు తీసుకెళ్ళారు. ఎప్పుడు మోక్షం లభిస్తుందో చూడాలి.

## దుర్గమ్మకు బోనం సమర్పించిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా మాతకు మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బోనం, ఓడి బియ్యం సమర్పించారు. వారు ఆలయ ప్రాంగణానికి చేరుకోగానే ఆలయ అధికారులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఈవో చంద్రశేఖర్ అదనపు కలెక్టర్ నగేష్ ను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## ‘అతి ఉత్ కృష్ణ’ పోలీసు సేవా పథకం అందుకున్న హోంగార్డు ఆఫీసర్

ప్రజాపక్షం/జగిత్యాల:పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అత్యుత్తమ సేవలకు గాను అతి ఉత్ కృష్ణ పోలీస్ సేవా పథకంను హోంగార్డు ఆఫీసర్ ఆర్ వెంకటేశ్వర్లు అందుకున్నారు. జగిత్యాల జిల్లాలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో హోమ్ గార్డ్ రిజర్వు ఇన్స్‌ఫెక్టార్ ఆఫ్ పోలీసు సైదులు ఆర్డర్ కాపీని వెంకటేశ్వర్లుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజర్వు ఇన్స్‌ఫెక్టార్ ఆఫ్ పోలీస్ అడ్మిన్ అధికారి వేణు, పోలీసు అధికారులు హోమ్ గార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



## పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పోడు భూముల పట్టాలను టిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందని, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వేములవాడ, భూడిదకుంట, నాంపల్లి, పల్లగుట్ట, మర్రిపెల్లి, ఇల్లంతకుంట లాంటి ప్రాంతాల్లో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మరిమడ్ల కొండంచర్లో 80 ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు పాల్గొన్నారు.




## మహిళలు ఆర్థికంగా ఎదగాలి


జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ



ప్రజాపక్షం/ఎల్లారడ్డిపేట:మహిళలు ఆర్థికంగా ఎదిగి అన్ని రంగాలలో ముందుకు రావాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు కోరుట్లపేట గ్రామంలో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఎరువుల మందుల దుకాణాలు ప్రారంభించి ఆయన మాట్లాడారు. మహిళ సంఘాలను బలోపేతం చేయాలన్న తపనతో ప్రభుత్వం వారికి అన్ని రకాల అవకాశాలు కల్పిస్తుందని, వడ్ల కొనుగోలు కేంద్రాలను విజయవంతంగా పూర్తి చేసిన ఘనత మహిళా సంఘాలదే అని కొనియాడారు. అలాగే మహిళలకు పెట్రోల్ బంకులను, మండలానికి ఒకటి చోప్పున రైస్ మిల్లులను కూడా మంజూరు చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, డిఆర్‌డిఎ అధికారి శేషాద్రి, డిపిఎం వరుణ్ రెడ్డి, ఎపిఎం మల్లేశం, ఎంపిడిఓ సత్తయ్య, ఎఎంసి చైర్మన్ ఎస్కే సాబేరా భేగం, వైస్ చైర్మన్ గుండాటి రామ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, కోరుట్ల పేట మాజీ సర్పంచ్ దేవానంద్, డైరెక్టర్ రవీందర్, చెన్ని బాబు, బండారి బాల్‌రెడ్డి, దండు శ్రీనివాస్, మల్లారెడ్డి, రామచందర్, రాములు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు నిర్విరామ కృషి

పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ :సుల్తానాబాద్ పట్టణంలో మహాత్మ జ్యోతిబా పూలే బాలికల డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని స్థానిక నాయకులతో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులు, అడిషనల్ కలెక్టర్, కళాశాల ప్రిన్సిపల్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా ప్రభుత్వ కళాశాలను ప్రోత్సహిస్తున్నామని 2023 సంవత్సరంలో ప్రారంభించిన ఈ కళాశాలలో మొదటి సంవత్సరమే 92 శాతం ఉత్తీర్ణత సాధించిందని రానున్న రోజుల్లో 100% ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయినీలు కృషి చేయాలని అన్నారు. గతంలో కళాశాల పాఠశాలలో ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రిన్సిపాల్ తమ దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించి అన్ని వసతులతో ఉన్న ఈ భవనాన్ని ఎంచుకొని ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిర్విరామం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి ఇప్పుడు ఉన్న విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువగా 300 మంది విద్యార్థినిలు ఉండేలా కృషి చేయాలని తద్వారా జిల్లా మంత్రి శ్రీధర్ బాబు గారితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ సహాయంతో రానున్న రోజుల్లో అధునాతన సౌకర్యాలు ఉండే విధంగా 5 ఎకరాల స్థలాన్ని పరిశీలించి సిఎం రేవంత్ రెడ్డి సహాయంతో అధునాతన సౌకర్యాలు ఉన్న నూతన బిల్డింగ్ నిర్మించేందుకు కృషి చేస్తానని అన్నారు. విద్యార్థులకు వారం రోజుల్లోనే గీజర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గత పాలకులు విద్యార్థుల భవిష్యత్తును విస్మరిసించారని ప్రస్తుతం ముఖ్యమంత్రి విద్యార్థుల భవిష్యతే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించేందుకు మిస్ చార్జీలను పెంచారని పేర్కొన్నారు. 140కోట్ల జనాభా ఉన్న దేశం మనదని మన దేశంలో ఉన్న విద్యార్థులు రానున్న రోజుల్లో క్రీడల్లో సైతం రాణించాలని గోల్డ్ మెడల్ సాధించేలా క్రీడాకారులను తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్. ఆర్డీవో బి.గంగయ్య, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ అంజనీకుమారి, ప్రిన్సిపల్ వనజ, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమతా కృష్ణ, తహసిల్దార్ బషీర్, మున్సిపల్ కమిషనర్ టి.రమేష్, ఎంపిడిఓ దివ్యదర్శన్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల రాజమల్లు,వేగోళం అబ్బయ్య గౌడ్, సాయిరి మహేందర్, , దామోదర్ రావు,పన్నాల రాములు, ముస్త్యాల రవీందర్, కుమార్ కిషోర్, సత్యం,భూపతిపూర్ జెబిపి విద్యాలయం ప్రిన్సిపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,మాజీ కౌన్సిలర్లు,తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి : ఆనందరావు



ప్రజాపక్షం/జగిత్యాల: కెజిబివి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సుదీర్ఘకాలంగా ఎదుర్కోంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పిఆర్‌టియు టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుడు బోయినపల్లి ఆనందరావు, యాల్ల అమర్నాథ్‌రెడ్డి అన్నారు. జగిత్యాల అర్బన్ మండంలోని కెజిబివి ధరూర్ క్యాంప్ వీక్లి బజార్ పురాణీపేట్ , మోతె, గోపాలరావుపేట్, కొత్తవాడ, కజీపూర పాఠశాల పిఆర్‌టియు టిఎస్ సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెజిబివిలో ఉపా ధ్యాయులు ప్రధానంగా ఎదుర్కోంటున్న మినిమం టైం స్కేల్, కేర్‌టేకర్ నియమాకాలు, సమ్మె కాలానికి వేతనం, వ్యాయామ ఉపాధ్యాయులకు సిఆర్టిలతో సమానంగా వేతనాలు ఆర్థికేతర అంశాలు ముఖ్యమంత్రి దృష్టికి ఇప్పటికే ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు పింగళి శ్రీపాల్‌రెడ్డి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మండల శాఖ అధ్యక్ష ప్రదాన కార్యదర్శులు విద్యాదేవి, పద్మ, మహిళ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు శశికళ, ఉపాధ్యక్షురాలు చందన, రాష్ట్ర కార్యదర్శులు ప్రభాకర్, అనుజ, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, సుజాత, ప్రవీణ్, షఫీ, రమేష్, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించండి


హుస్నాబాద్ పట్టణంలో మంత్రి మార్నింగ్‌వాక్‌లో ప్రజలతో ముఖా ముఖీ




ప్రజాపక్షం / హుస్నాబాద్: ప్రకృతి పర్యావరణ కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరం ప్లాస్టిక్ వా డ కాన్ని నిశేదించాలని వాటి బదులు తట్టు సంచులు స్టీల్ వస్తువులను వినియోగించుకోవాలని అలాగే ముఖ్యంగా వేడుకల్లో ప్లాస్టిక్ బదుల స్టీల్ వస్తువులను వాడాలని తెలంగాణ బిసి, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు ప్రజలకు సూచించారు. శుక్రవారం అయన హుస్నాబాద్ పట్టణంలో ప్రజలతో కలిసి పలు వార్డుల్లో పర్యాటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అరెపల్లి చౌ రస్తాలో సుందరికరణలో భాగంగా ఏర్పటు త్రిశూలం పౌంటెషన్ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వా అసుపత్రిని పరిశీలించి రోగులతో మచ్చటించారు, వారికి అందుతున్న వైద్యం గూర్చి అడిగి తెలుసుకున్నారు. అలాగే మున్సిపల్ సిబ్బందికి రేన్‌కోట్లు, గౌజులు టీ షర్ట్లు, స్వీట్లు పంపిణీ చేసి వారు పట్టణ పరిశుభ్రత కోసం పడుతున్న కృషికి సిబ్బందిని అభినందించారు. స్వచ్ఛ హుస్నాబాదుకు ప్రజలు సిబ్బంది సహకరించి మరో మారు అవార్డు వచ్చేందుకు కృషిచేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టక్ వాడకం వల్ల కలిగే నష్టలను ఎదురయ్యో సమస్యలను మున్సిపల్ సిబ్బందికి ప్రజలకు వివరించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2024–2025సర్వేలో హుస్నాబాద్ మున్సిపాల్‌టికి జాతీయ స్థాయిలో 139వ ర్యాంకు రావడం సిబ్బంది, పట్టణ ప్రజల సహకారం ఎంతో ఉందని అన్నారు. రాబోవు కాలంలో నియోజకవర్గంను ప్లాస్టిక్ రహిత కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఇప్పటికు గ్రామగ్రామన స్టీల్ బ్యాంకులు ఏర్పటు చేస్తునట్లు నియోజకవర్గంలో 340 హోటల్లో34 వేల స్టీలు గ్లాస్‌లు పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మన్ బొల్లి శెట్టి శివయ్య, నాయకులు చిత్తారి పద్మ రవిందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బంక చందు, కొమటి సత్యనారయణ, సరోజన, రాజు రాజిరెడ్డితదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపి వేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్



ప్రజాపక్షం/పెద్దపల్లి :మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను చంపుతూ మారణ హోమం సృష్టిస్తుందని, మావోలను అంతం పేరుతో గిరిజన గ్రామాల్లో అలజడి సృష్టించి భయానక వాతావరణ సృష్టిస్తుందని, వెంటనే కగార్ ఆపరేషన్ నిలిపి వేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ గార్డెన్‌లో జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవైన శంకర్ హాజరై మాట్లాడుతూ నిన్న జరిగిన సిపిఐ పార్టీ పెద్దపల్లి జిల్లా నాలుగో మహాసభలు విజయవంతం అయ్యాయని, ఈ మహాసభలకు సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యదర్శిగా తాండ్ర సదానందం, సహాయ కార్యదర్శిగా గోశిక మోహన్, కార్యవర్గ సభ్యులుగా గౌతమ్ గోవర్ధన్, కడారి సునీల్, తాళ్లపల్లి మల్లయ్య,కే కనక రాజు, కోడంస్వామి, ఓదెమ్మ, మడ్డి ఎల్లయ్య ప్రత్యేక ఆహ్వానితులుగా మార్కాపూరి సూర్య, లక్ష్మ ణ్ లను ఎన్నుకోవడం జరిగింది.

## ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల కమిటీ లిస్ట్ ఎస్ఎస్ఓకు అందజేత



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఎఐటియుసి నూతన కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ లిస్ట్ ను ఆర్జీ వన్ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డికి అందజేసి నూతన కమిటీని పరిచయం చేయడం జరిగిందని గుర్తింపు సంఘం ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం ఆర్జీ వన్ సెక్యూరిటీ కార్యాలయంలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల కమీటి ని పరిచయం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న వారికి కనీస వేతనాలు అమలు చేయాలని, చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని ఆయన యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు, అదేవిధంగా సింగరేణి ఆస్తులను కాపాడటం లో కృషి చేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సంక్షేమానికి ఎఐటియుసి కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, ఏఐటియుసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ తో పాటు ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల నూతన కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## అన్యాక్రాంతమవుతున్న భూములను పరిశీలించిన ఆర్‌డిఓ

ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం:ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో అన్యాక్రాంతం అవుతున్న భూములను మెట్‌పల్లి ఆర్‌డిఓ శ్రీనివాస్ వర్షకొండ గ్రామంలోని సర్వే నెంబర్ 311లో గల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుందని వచ్చిన పిర్యాదు మేరకు సర్వే నెంబర్ చూసి ఎంజాయ్‌మెంట్ సర్వే చేయుటకు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే లాండ్ రికార్డ్, తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. భూములను పరిశీలించారు. తహసీల్దార్ వర ప్రసాద్, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

## కుల దురహంకార హంతకులను కఠినంగా శిక్షించాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్



ప్రజాపక్షం/కరీంనగర్: తెలంగాణ రాష్ట్రంలో ఈ యేడాది కాలంలోనే 10 కుల దురహంకార హత్యలు జరిగాయని, గత బిఆర్ఎస్ సర్కారు హయాంలో రేవంత్‌రెడ్డి కులాంతర వివాహాల రక్షణచట్టం తెస్తామని చెప్పి ఎందుకు చేయడం లేదని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ ప్రశ్నించారు. ఇంకా ఎంతమంది కులదురహంకారానికి బలికావాలో రేవంత్ సర్కారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కిషన్‌రావు పేట గ్రామంలో నలుగు మల్లేష్(26)అదే గ్రామానికి చెందిన యువతి గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నారని, ఆ యువతికి వేరే వ్యక్తితో పెళ్లికి సిద్ధం చేస్తున్న సమాచారంతో వారి ఇంటికి వెళ్లి మల్లేష్ అడిగితే ఆగ్రహించిన ఆ అమ్మాయి తండ్రి, బాబాయి కత్తులతో దాడి చేసి కులదురహంకార హత్యకు పాల్పడ్డారని చ్పెపారు. మల్లేష్ తక్కువ కులం కావడంతో ఈ హత్య జరిగిందన్నారు. కుల దురహంకార హత్యలు రోజురోజుకీ పేట్రోగిపోతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ హత్యలను అరికట్టడంలో తీవ్రంగా విఫలమైందన్నారు. రాజ్యాంగం ప్రకారం చట్టబద్దంగా ఇద్దరూ మేజర్లు అయిన తర్వాత వివాహం తప్పు కాదన్నారు. కుల అహంకారంతో ఆ జంటను విడదీయడం లేదా యువకుడిని పొట్టన పెట్టుకోవడం పరిపాటిగా మారిందన్నారు. కులాంతర వివాహితులకు రక్షణ చట్టం చేయకుండా, వీటిని అరికట్టలేమని పేర్కొన్నారు. నలుగు మల్లేష్ తాను ప్రేమించిన యువతి తోటే కాపురం చేస్తానని చెప్పడం ఏ విధంగా నేరమవుతుందన్నారు. వివాహానికి కావాల్సింది వయస్సు, గుణం మాత్రమేనన్నారు. కులం, మతం, ప్రాంతం వివాహానికి అడ్డు రాకూడదన్నారు. తక్షణమే నలుగు మల్లేష్ కుల దురహంకార హత్య వెనుక ఉన్న పాత్రదారులను, సూత్రదారులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఈ పదేండ్ల కాలంలో 132 కుల దురహంకార హత్యలు జరిగాయన్నారు. ఇప్పటికైనా కులాంతర వివాహితుల ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని, పోలీసులు చట్ట ప్రకారంగా మేజర్లు అయిన జంటలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మరో హత్య జరగకుండా ప్రభుత్వం అప్రమత్తం కావాలన్నారు. ప్రజలు ప్రజాస్వామిక వాదులు మల్లేష్ హత్యను ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

## ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు మూలస్తంభాలు



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రాధాన్యం కల వ్యవస్థ జర్నలిజం రంగం అని తెలంగాణ ఆల్ సీనియర్ సీటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం తెలంగాణ ఆల్ సీనియర్ సీటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో టియుడబ్ల్యుజె(ఐజెయు) ఎన్నికల్లో విజేతలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు చీటి శ్రీనివాసరావు , ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణచారి, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, సహాయ కార్యదర్శులు గుర్రం చంద్రశేఖర్, కోరేపు రాజ్‌కుమార్, చింత నరేశ్, టీ న్యూస్ మనోజ్, మహిళ జర్నలిస్టు సాకేతలను సన్మానించి వారి సేవలను కొనియాడారు. హరిఅశోక్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు వెంటనే మంజూర్ చేయాలని, ఆరోగ్య పథకం ప్రవేశపెట్టాలని, ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కౌన్సిలింగ్ అధికారి పి వి హన్మంతరెడ్డి, ఉపాధ్యక్షులు ఎండి యాకుబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పూసాల అశోక్‌రావు, సంయుక్త కార్యదర్శి దిండిగాల విఠల్, యూసుఫ్, యాకుబ్ హుస్సేన్, కస్తూరి శ్రీమంజరి, గంగంజలజ, రాధ,తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమస్యల పరిష్కార వేదిక శుక్రవారం సభ

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్: శుక్రవారం సభ వేదికగా మహిళలకు కావాల్సిన అన్ని రకాల సహాయం, సమాచారం ఇస్తున్నామని, వారి సమస్యకు పరిష్కార మార్గం చూపుతున్నామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ శుక్రవారం సభ ద్వారా మహిళల హక్కులు, చట్టాలు వారికి ఉన్న సదుపాయాలు సౌకర్యాలను అధికారులు తెలియజేస్తారని అన్నారు. మహిళలకు ఉన్న ప్రభుత్వ పథకాల గురించి విషయాలను ఇక్కడ అధికారులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు శుక్రవారం సభలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ప్రతి నెల బి పి, షుగర్ మాత్రలు అవసరమయ్యేవారు శుక్రవారం సభలో ఏర్పాటు చేసే మెడికల్ క్యాంపులో ఉచితంగా పొందవచ్చని అన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, 40 రకాల పరీక్షలను ఉచితంగా చేయించుకోవచ్చని తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ఈ పరీక్షల్లో ముందుగానే గుర్తించి నయం చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం పొందాలని, అవసరమైతే వ్యాధి తీవ్రతను బట్టి ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేసి పది లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని, అక్కడ బలవర్ధకమైన ఆహారంతో పాటు చక్కటి పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ చిన్నారులకు డ్రాయింగ్ బుక్స్, పలకలు అందజేశారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డిఎంహెచ్‌వో సుధా, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, సిడిపివో సబిత , అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల నిర్మాణ పనులు వేగవంతం

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : మండలంలో నిర్మాణంలో ఉన్న పాఠశాలలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కాల్వశ్రీరాంపూర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం అంకంపల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు,అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, మడిపల్లి గ్రామంలోని ఎంపిపిఎస్, నిర్మాణంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల, ఉషన్నపల్లి గ్రామంలోని నిర్మాణంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మెట్లపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కిష్టంపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లను కలెక్టర్ పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకంపల్లి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన సంపూర్ణ సహకారం అధికారులు అందించాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. మడిపల్లి, ఉషన్నపల్లి గ్రామాలలో నిర్మాణంలో ఉన్న పాఠశాలల పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మడిపల్లి పాఠశాలలో ప్రహరీ గోడ, గ్రౌండ్ లెవెలింగ్ పనులు కూడా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మొట్లపల్లిలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ మొక్కను నాటారు. కాల్వ శ్రీరాంపూర్ మండల పరిధిలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా అమలు చేయాలి. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కాల్వ శ్రీరాంపూర్ ఎంపిడిఓ పూర్ణ చందర్ రావు, మండల పంచాయతీ అధికారి ఆరిఫ్, పంచాయతీ రాజ్ ఎఇ శ్రవణ్, మండల విద్యాశాఖ అధికారి మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డుల పంపిణీ

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ప్రజాపక్షం/కరీంనగర్:అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందజేస్తామని, రేషన్ కార్డుల ధరఖాస్తులు, జారీ నిరంతర ప్రక్రియ అని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లి రైతు వేదికలో పర్లపల్లి, నల్లగొండ మొగిలిపాలెంట, పోలంపల్లి గ్రామాల ప్రజలకు కొత్త రేషన్ కార్డుల మంజూరు ఉత్తర్వు కాపీలను అందజేశారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు సైతం మంజూరు కాలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే సబ్సిడీ సిలిండర్, రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ వంటివి ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేశామని చెప్పారు. పేదవాడి సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు. నిర్మాణం ప్రక్రియ వేగవంతంగా సాగుతోందన్నారు. ఏకకాలంలో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశామని, రాష్ట్రంలో సుమారు 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని పేర్కొన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరమని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత దిశగా ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎంతో అండగా నిలుస్తోందన్నారు. జిల్లాలో 78 వేలకు పైగా రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆర్డీవో మహేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

జిల్లా ఎస్పీ మహేష్ గీతే



ప్రజాపక్షం / చందుర్తి :చందుర్తి సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూసుకోవాలని జిల్లా ఎస్పి మహేష్ గీతే సిఐ వెంకటేశ్వర్లుకి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగాంగ శుక్రవారం చందుర్తి సర్కిల్ కార్యాలయాన్ని, పోలీస్ స్టేషన్ శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ముఖ్యంగా యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా నిఘా తీవ్రతరం చేయాలన్నారు. స్టేషన్‌లోని రికార్డు, కేసులు, బ్లూ కోట్, పెట్రోలింగ్, సిబ్బంది పని తీరు తెలుసుకున్నారు.సైబర్ నేరాలు, గోల్డెన్ అవర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతినిత్యం డ్రంకన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, షటిల్ కోర్టు ప్రారంభించారు. ఎస్ఐలు రమేష్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్,సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడ



## ప్రజ్ఞానందకు ఊహించని ఓటమి..
# సెమీఫైనల్లో అర్జున్

ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగేసి విశ్వ వేదికపై మరోసారి తన తడాఖా చూపించాడు. ప్రతిష్ఠాత్మక ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్‌లో అదరగొడుతున్న అతడు దర్జాగా సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. లాస్ వేగాస్‌లో శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో ఉజ్బెకిస్థాన్ స్టార్ నొద్రిబెక్ అబ్దుసత్రోవ్‌ను తెలంగాణ కుర్రాడు చిత్తు చేశాడు. అయితే.. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి రెట్టించిన ఉత్సాహంతో క్వార్టర్స్ చేరిన ప్రజ్ఞానంద మాత్రం అనూహ్యంగా టైటిల్ రేసులో వెనకబడ్డాడు.

## బిసిసిఐకి భారీగా ఆదాయం..
### ఐపిఎల్‌తోనే రూ.5761 కోట్ల ఆర్జన..!

ప్రపంచంలోనే సంపన్న క్రికెట్ బోర్డు అయిన భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రతి ఏటా భారీగా సమకూర్చుకుంటోంది. మీడియా, డిజిటల్ హక్కుల వేలంతో పాటు స్పాన్సర్‌షిప్ ద్వారా కోట్లాది రూపాయలు ఆర్జిస్తోంది. మరీ ముఖ్యంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఏమంట మొదలైందో బీసీసీఐ పంట పండిందనే చెప్పాలి. అవును.. నిరుడు ఐపిఎల్ ద్వారానే భారత బోర్డు ఏకంగా రూ.5,761 కోట్లు సముపార్జించింది. మొత్తంగా చూస్తే.. 2023 24లో రూ.9741.7 కోట్లు బిసిసిఐ ఖాతాలో చేరాయి. బిసిసిఐ సంపాదనలో సింహభాగం ఐపిఎల్ వాటానే ఉండడం విశేషం.





## భారత ఓపెనర్‌కు షాకిచ్చిన ఐసిసి..
### ఇంగ్లాండ్ జట్టు మొత్తానికి జరిమానా!

క్రికెట్ స్ఫూర్తిని దెబ్బతీసే చర్యలను తీవ్రంగా పరిగణించే అంతర్జాతీయ క్రికెట్ మండలి హద్దు మీరిన ఆటగాళ్లకు జరిమానాలు విధిస్తుంటుంది. ఈ క్రమంలోనే భారత ఓపెనర్ ప్రతికా రావల్‌కు ఐసిసి షాకిచ్చింది. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో కోడ్‌ను ఉల్లంఘించినందుకు ఓపెనర్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా వేసింది. అంతటితోనే సరిపెట్టకుండా ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. నాట్ సీవర్ బ్రంట్ నేతృత్వంలోని ఆతిథ్య జట్టుకు కూడా భారీ ఫైన్ పడింది. స్లో ఓవర్ రేటు కారణంగా జట్టు సభ్యులకు మ్యాచ్ ఫీజులో 5 శాతం జరిమానా విధించింది ఐసిసి.

## రెజ్లింగ్‌లో భారత్‌కు స్వర్ణం!



పోలీయాక్ ఇమ్రేవర్గా జానోస్ మెమోరియల్ 2025 రెజ్లింగ్ టోర్నీలో భారత రెజ్లర్ సుజీత్ కల్కల్ స్వర్ణ పతకం సాధించాడు. హంగేరీలోని బుడాపెస్ట్ వేదికగా జరిగిన 65 కేజీల పురుషుల ఫ్రైస్టైల్ ఫైనల్లో సుజీత్ కల్కల్ 5–1 తేడాతో రహీమ్‌జాదేను ఓడించాడు. ఈ ఏడాది జరిగిన రెజ్లింగ్ ర్యాకింగ్ సిరీస్‌ల్లో భారత్‌కు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. అమ్మాన్, మంగోలియా వేదికగా జరిగిన రెజ్లింగ్ టోర్నీల్లో భారత రెజ్లర్లు పతకాలు సాధించకుండానే వెనుదిరిగారు. ఫైనల్లో సుజీత్ ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించాడు. తొలి పిరియడ్‌లోనే ఒక యాక్టివిటీ పాయింట్ సాధించిన సుజీత్.. రెండో పిరియడ్ పూర్తయ్యేసరికి రెండు యాక్టివిటీ పాయింట్స్‌తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆఖరి వరకు ఇదే జోరును కొనసాగించి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ టోర్నీలో సుజీత్ తొలి రౌండ్‌లో 11–0 తేడాతో పారిస్ 2024 ఒలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్ అల్బేనియా రెజ్లర్ ఇస్లాం దుడాయేవ్‌ను ఓడించాడు. క్వార్టర్ ఫైనల్లో యూరోపియన్ రెజ్లర్, సిల్వర్ మెడలిస్ట్ ఖమ్జాత్ అర్సామెర్జుయెవ్‌ను చిత్తు చేశాడు. సెమీఫైనల్లో ఆర్మేనియాకు చెందిన వాజ్‌జెన్‌ను 6–1 తేడాతో ఓడించాడు. ఇదే టోర్నీలో పురుషుల 57 కిలోల విభాగంలో భారత్‌కు మరో పతకం దక్కింది. కాంస్య పోరులో భారత రెజ్లర్ రాహుల్ 4–0తో జర్మనీకి చెందిన నిక్లాస్ స్టెచెలేపై విజయం సాధించి బ్రాంజ్ దక్కించుకున్నాడు. అంతకుముందు జరిగిన క్వార్టర్‌ఫైనల్లోరాహుల్ 5–3 తేడాతో కొరియాకు చెందిన కిమ్ సంగ్‌ను ఓడించాడు. కానీ సెమీఫైనల్లోరాహుల్ 6–7 తేడాతో అమెరికా రెజ్లర్ ల్యూక్ జోసెఫ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఇతర పోటీల్లో భారత్‌కు చెందిన ఉదిత్(61 కిలోల విభాగం), విక్కీ(97 కిలోల విభాగం) ఓటమిపాలయ్యారు. ఈ టోర్నీలో పొందే ర్యాకింగ్ పాయింట్స్.. ఈ ఏడాది సెప్టెంబర్‌లో క్రొయేషియాలోని జాగ్రెబ్ వేదికగా జరిగే వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సీడింగ్ పొందేందుకు ఉపయోగపడుతాయి.


# ఫోకస్ సైన్స్

## అపార ఖనిజ సంపద

గ్రహశకలాల్లో ఇనుము, ప్లాటినం, టైటానియం వంటి అపారమైన ఖనిజ సంపద ఉంది. వాటి ఉపరితలంపై ఉన్న నీటిని విచ్ఛిన్నం చేసి అంతరిక్ష వాహనాలకు ఇంధనంగా ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. ఎన్నో పరిశోధనలు, మరెన్నో అవసరాల కోసం మనిషికి కావాల్సిన ఎన్నో ఖనిజాలు ఉండడంతో, గ్రహశకలాల నుంచి వాటిని తవ్వి తీస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, ఆస్టరాయిడ్స్‌ను తవ్వి, ఖనిజాలను వెలికితీయడం సాధ్యమా?

ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అసాధ్యమనే చెప్పాలి. ఎందుకంటే, ఆస్టరాయిడ్ బెల్ట్ మనకు సుమారు 179.5 నుంచి 329 మిలియన్ కిలోమీటర్ల దూరంలో ఉంది. అత్యాధునిక వ్యోమనౌకలను ఉపయోగించినప్పటికీ, ఒక గ్రహశకలానికి చేరుకోవాలంటే 6 నుంచి 8 నెలలు పడుతుంది. ఒక్కోసారి సంవత్సరం కూడా కావచ్చు. అలాంటి వ్యోమనౌకను సిద్ధం చేసినప్పటికీ, అక్కడ తవ్వకానికి అవసరమైన పరికాలను మోసుకెళ్లడం అనుకున్నంత సులభం కాదు. ఒకవేళ భారీ వ్యోమనౌకను తయారు చేసి, పంపించినా, అది ఎలాంటి సమస్యలు లేకుండా తిరిగి భూమికి చేరుకుంటుందని అనుకోవడానికి వీల్లేదు. ఏ రకంగా చూసినా, గ్రహశకలాల నుంచి ఖనిజాలను వెలికితీయడం, భూమికి తీసుకురావడం అసాధంగానే ఉంది. అయినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా చాలా కంపెనీలు ఈ దిశగా ప్రయత్నాలు చేస్తుండడం ఆశ్చర్యకరం. ఇలా వుంటే, భూమిపై రాక్షస బల్లులు (డైనోసార్స్) తుడిచిపెట్టుకు పోవడానికి ఒక గ్రహశకలమే కారణమని వాస్తవేత్తలు భావిస్తున్నారు. శాస్త్రీయ సమాజంలో ఈ సిద్ధాంతం ప్రబలంగా ఉంది. డైనోసార్ల సామూహిక విలుప్తానికి కేంద్రం మెక్సికోలోని యుకాటాన్ ద్వీపకల్పం కింద కనుగొన్న, ఇంపాక్ట్ బిలం అయిన చిక్సులబ్ క్రేటర్‌లో ఉందని చాలా మంది శాస్త్రవేత్తల నమ్మకం.






## పెరుగుతున్న భూభ్రమణ వేగం

సాధారణంగా భూమి ఒకసారి తన చుట్టూ తాను తిరగడానికి 23 గంటలు 56 నిమిషాలు 4.09053 సెకన్లు పడుతుంది. అయితే, భూమి తిరిగే వేగం స్వల్పంగా పెరిగిందని ఇటీవల శాస్త్రవేత్తలు గుర్తించారు. గత కొన్ని సంవత్సరాలలో, ముఖ్యంగా 2020 తర్వాత, కొన్ని రోజులు భూమి సాధారణంగా కంటే తక్కువ సమయంలో తిరుగుతోందని నిర్ధారణకు వచ్చారు. 2022లో జులై 26న భూమి తన చరిత్రలో అతి తక్కువ రోజును నమోదు చేసింది. సాధారణమైన రోజు కంటే ఇది 1.59 మిల్లీసెకన్లు తక్కువ. ఈ ఏడాది కూడా కొన్ని రోజులు భూమి 1.3 – 1.6 మిల్లీసెకన్లు త్వరగా తిరిగినట్లు నాసా, జాతీయ భూ పరిశోధన సంస్థలు గమనించాయి. ఈ మార్పుకు క్షీణిస్తున్న పర్యావరణ పరిస్థితులే కారణమని అంటున్నారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా గ్లేషియర్లు కరగడం పెరుగుతున్నది. భారీగా మంచు కరిగిపోతే, దాని బరువు భూమిపై ప్రభావం చూపుతుంది. భ్రభ్రమణం నెమ్మదిస్తుంది. గ్లోబల్ వార్మింగ్‌తోపాటు భూగర్భంలోని లిక్విడ కోర్ ప్రవాహాలు కూడా భూభ్రమణ సమయం పెరుగుదలకు ఒక కారణం. భూమి గర్భకేంద్రంలో ఉన్న ద్రవ మాంతలికలు (మోల్టెన్ కోర్) అర్థ చంద్రాకారంలో తిరుగుతున్నాయి. వీటి కదలిక భూమి తిరగడంపై ప్రభావం చూపుతుంది. ఇలా వుంటే, చంద్రుడు భూమిపై కొంత టైడల్ బ్రేకింగ్ ప్రభావాన్ని చూపుతాడు, అంటే భూమి తిరిగే వేగాన్ని కాస్త తగ్గిస్తాడు. కానీ చంద్రుడు దూరం పెరుగుతున్న కొద్దీ ఈ ప్రభావం తగ్గిపోతోంది. అందువల్ల భూభ్రమణ వేగం పుంజుకుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కొన్ని పెద్ద భూకంపాలు కూడా భూమి గుండ్రపు ఆకారాన్ని కొద్దిగా మార్చవచ్చు. ఇది భూమి తిరగడంపై తక్కువ ప్రభావం చూపుతుంది. ప్రస్తుతానికి పెద్దగా సమస్య లేకపోయినప్పటికీ, భూభ్రమణ వేగం పెరిగితే, ప్రపంచ సమయ వ్యవస్థలో మార్పులు సంభవిస్తాయి. భూమి వేగంగా తిరిగితే, లీప్ సెకండ్‌ను తీసివేయాల్సి రావచ్చు. దీనిని 'నెగెటివ్ లీప్ సెకండ్'గా పిలుస్తారు. ఇది ఇప్పటివరకు ఎన్నడూ జరగని పరిణామం. జిపిఎస్ వ్యవస్థ ఉపగ్రహాలు భూమి తిప్పే వేగాన్ని బాగా ఖచ్చితంగా అంచనా వేస్తూ పనిచేస్తాయి. భూభ్రమణ వేగం మారితే, జిపిఎస్‌లో స్వల్ప మార్పులు అనివార్యమవుతాయి. కాబట్టి సమయాన్ని అప్‌డేట్ చేసుకోవాల్సి రావచ్చు. టెలికాం, ఫైనాన్షియల్ నెట్‌వర్క్స్, ఇంటర్నెట్ సమయ సమన్వయం మీద కూడా ప్రభావం ఉండొచ్చు. కాగా, 2029 లేదా 2030 ప్రాంతంలో, మానవాళి చరిత్రలో మొట్టమొదటి 'నెగెటివ్ లీప్ సెకండ్' నమోదయ్యే అవకాశముంది. అంటే ఒక సెకను తీసేస్తారు. ఇది కంప్యూటింగ్, డిజిటల్ సిస్టమ్స్‌కి పెద్ద సవాలు. ఈ వేగం తాత్కాలికమా లేదా శాశ్వతమా అనే దానిపై శాస్త్రవేత్తలు ఇంకా పరిశోధన చేస్తున్నారు.

# వరంగల్ సమగ్రాభివృద్ధికి ఉద్యమాలు

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి
### 30,31 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు




**ప్రజాపక్షం/వరంగల్ :** జిల్లా సమగ్ర అభివృద్ధికి ఉద్యమాలకు సిద్ధమవుతామని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పేర్కొన్నారు. శివనగర్ సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో శుక్రవారం జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి సంగి ఎలేంధర్ అధ్యక్షత వహించగా మేకల రవి మాట్లాడారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఉద్యమాలు చేసిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. మోదీ ప్రభుత్వం పూర్తిగా ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ధనిక, కార్పొరేట్ ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నియంత్రించాలని, తెలంగాణ ప్రభుత్వం పంపిన 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో ఆమోదించి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30,31 తేదీలలో వరంగల్ నగరంలో జరిగే సిపిఐ వరంగల్ జిల్లా 2వ మహాసభలను విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలను ఆయన కోరారు. రానున్న రోజుల్లో భవిష్యత్ పోరాటాల రూపకల్పనకు మహాసభలో సమగ్రంగా చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లా అన్నివర్గాలకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె బాష్‌మియా, పార్టీ జిల్లా నాయకులు పనాస ప్రసాద్, బుస్స రవీందర్, అక్కపెల్లి రమేష్, గన్నారపు రమేష్, గుంపెల్లి మునిశ్వర్, గుండె బద్రి, వీరగోని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కఠినంగా మహిళా చట్టాల అమలు

### మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మజ డిమాండ్



**ప్రజాపక్షం/పాల్వంచ :** మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలని మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీసంశెట్టి పద్మజ డిమాండ్ చేశారు. సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో పద్మజ మాట్లాడుతూ సమాజంలో మహిళలపై వేధింపులు, హత్యలు, అత్యాచారాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో మహిళల రక్షణకు అనేక హక్కులు ఉన్నాయని, వాటికి తోడు నూతనంగా నిర్భయ, దిశ చట్టాలు వచ్చినప్పటికి మహిళలకు భద్రత కరువైనదని వాపోయారు. ప్రభుత్వాలు మహిళా చట్టాలు కఠినంగా, సక్రమంగా అమలు చేయక పోవటంతోనే హింసలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు బలమైన ప్రజా ఉద్యమాలను నిర్వహించాలన్నారు. మహిళల హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తూ ఉద్యమాలు, ప్రజా పోరాటాలను నిర్వహిస్తూ ఎన్నో విజయాలను అందించిన భారత జాతీయ మహిళా సమాఖ్య పాల్వంచ పట్టణ, మండల 5 మహాసభలు ఈనెల 21న జరగనున్నాయని తెలిపారు. పట్టణ, మండలంలో అన్నివర్గాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకులు వగ్గెల పద్మ, డి.లక్ష్మి, వై.ప్రభావతి, సంధ్య, జి.పద్మ, కె.ఈశ్వరమ్మ, వై.మేరమ్మ, ఆర్.హేమలత, వాడె లక్ష్మి, కె.స్వర్ణలత, వజ్జా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి
# ప్రజాప్రతినిధుల ఇండ్లు ముట్టడిస్తాం



### 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలు బంద్ : ఎఐఎస్‌ఎఫ్ పిలుపు

**ప్రజాపక్షం/వరంగల్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా ప్రతినిధుల ఇండ్లు ముట్టడిస్తామని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. జూలై 23న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు నాయకుల పిలుపునిచ్చారు. వామపక్ష విద్యార్థి సంఘాలైన ఎఐఎస్‌ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎఐఎఫ్‌డిఎస్, ఎఐఎస్బి, ఎఐడిఎస్‌ఒ , ఎఐపిఎస్యూ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ ఓంకార్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదెల్ల శరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చుక్క ప్రశాంత్, యార ప్రశాంత్‌రెడ్డి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు అలువాల నరేష్, జిల్లా సహాయ కార్యదర్శి సాయి, రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముక రవి, ఎఐఎఫ్‌డిఎస్ జిల్లా కార్యదర్శి మార్త నాగరాజు, ఎఐఎస్బి నాయకులు సూర్య తేజ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడినీ అరికట్టాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యం లో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఇఒ, డిఇఒ పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డి మాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి సం ఘాల నాయకులు పోలబోయిన రాజు, చెరుకు రాజేష్, డి.వినయ్, రాంబాబు మధు తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ రూరల్ :** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని ఆరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఐబిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువస్తామని చెప్పి తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వ, కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు సింగారి వెంకటేష్, రాహుల్, సిహెచ్ దిగంబర్, పరమేశ్వర్ భరత్, నవీన్‌రాజ్‌రత్నం పాల్గొన్నారు.

**హనుమకొండ టౌన్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా ప్రతినిధుల ఇండ్లు ముట్టడిస్తామని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు స్టాలిన్, పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష, జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎఐఎస్బి జిల్లా నాయకులు ఎస్డీ ఫుర్కన్, ఏఐఎఫ్ డిఎస్ రాష్ట్ర కన్వీనర్ మాస్ సావిత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తున్నదని, రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల ప్రారంభమై రెండునెలలు గడుస్తున్నా కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. వర్షం కురిస్తే చాలావరకు హాస్టల్ భవనాలు, పాఠశాల భవనాలు నాని కూలిపోయే ప్రమాదం ఉందని వాటిని వెంటనే కూల్చివేసి నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్స్ చార్జీలను పెంచాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను కట్టడి చేయాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, అనుమతి లేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 23 జరిగే విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, విద్యార్థి నాయకులు సిపతి వినయ్, సాయి, అవినాష్ కావ్య, గణేష్, వినయ్, వంశీ, ఓరుగంటి హరీష్ బుర్ర సంపత్ పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 23న జరిగే విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ సంఘాల అధ్వర్యంలో సురవరం వెంకటరమణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మ ణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు బకాయలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. విద్యాసంస్థల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. 23న విద్యాసంస్థల బంద్‌కు విద్యాసంస్థల యజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రమేష్, సాయి, శేఖర్, సాయి, జీవన్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.










# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## పువ్వాడ నాగేశ్వరరావును కలిసిన కెటిఆర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సిపిఐ సీనియర్ నాయకుడు మాజీ ఎంఎల్ఏ పువ్వాడ నాగేశ్వరరావును బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కలిశారు. శుక్రవారం ఖమ్మం పర్యటనకు విచ్చేసిన కెటిఆర్ పువ్వాడ నాగేశ్వరరావు స్వగృహంకు వెళ్లి వారిని కలిసి ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ శాసన సభ్యురాలు సండ్ర వెంకట వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



## అక్రమార్కులకు అడ్డా గ్రీన్ ఫీల్డ్ హైవే!

### హైవేపై రాకపోకలను నియంత్రించలేకపోతున్న అధికారులు

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** అక్రమార్కులకు గ్రీన్ ఫీల్డ్ హైవే అడ్డగా మారింది. ఆంధ్రా నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీ ఒకటి గురువారం రాత్రి సత్తుపల్లి మండలం, లింగపాలెం ఎగ్జిట్ వద్ద డివైడర్ ను ధ్వంసం చేసుకుంటూ వచ్చింది. ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడి ఆగిపోవడంతో పొద్దున్నే గుర్తించిన హైవే అధికారులు కదలనివ్వకుండా అడ్డుకున్నారు. నష్టపరిహారం చెల్లించే వరకు వాహనం తీస్తే ఊరుకునేది లేదంటూ ఒక సెక్యూరిటీ గార్డును ప్రమాదం జరిగిన ప్రదేశంలో రక్షణగా ఉంచారు. ఇంత భారీగా ప్రమాదం జరిగినప్పటికీ కూడా హైవే సిబ్బంది పోలీస్ కు ఫిర్యాదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రాత్రి సమయంలోనే కాకుండా పట్టపగలు కూడా అక్రమార్కులు ఈ దారిని అనువైన మార్గంగా ఎంపిక చేసుకున్నట్లుగా తెలుస్తోంది. సెక్యూరిటీ ఏర్పాటుచేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉంది హైవే అధికారుల తీరు. ప్రమాదం జరగకముందే వాహనాలను అనుమతించకుండా ఎగ్జిట్ ల వద్ద సెక్యూరిటీని ఏర్పాటు చేసి ఉంటే నష్టం జరగకపోయి ఉండేదని, కాని అక్రమంగా వాహనాలు హైవే పైకి వచ్చి ప్రమాదాలకు గురి అయిన అనంతరం వాహనాలను కదలనివ్వకుండా బేరసారాలను ఆడుకుంటూ, లారీలను ప్రమాద స్థలం నుండి తరలించకుండా ఉండేందుకు సెక్యూరిటీని ఏర్పాటు చేయడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభం అనంతరం జరిగే ప్రమాదాలకు ఎవరిని బాధ్యులు చేస్తారని, యాక్సిడెంట్ అనేది యాదృచ్ఛికంగా జరుగుతుందే కానీ కావాలని చేసింది కాదు కదా అని అటువంటి సమయంలో లారీ యజమానులను డబ్బులు కట్టాలి అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు ప్రజలు.

## చట్టాలపై అవగాహన అవసరం

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖమ్మం కార్యదర్శి కెవి.చంద్రశేఖర్ రావు తెలిపారు. ఖమ్మం నగరంలోని దానవాయి గూడెంలో గల మహాత్మగాంధీ జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చిన్నారులను లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించడం, పిల్లల అక్రమ రవాణా వంటి విషయాల గురించి వివరించారు. విద్యార్థులు ఫోన్లకు ఆకర్షితులు కాకుండా క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకుని రావాలన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. ఏది గుడ్ టచ్, ఏది బ్యాడ్ టచ్ పిల్లలకు అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిసిసి పీఠం దక్కేదెవరికో?

### రేసులో పలువురు ఆశావహులు

### కత్తి మీద సాములా మారిన అధ్యక్ష ఎన్నిక



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి మొదలైంది. గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్ఠపరిచేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుంది. ఇందుకు సంబంధించి ఎఐసిసి కార్యదర్శులతో పాటు పిసిసి నుంచి కూడా ఉమ్మడి జిల్లాలు, పార్లమెంటు పరిధి, శాసన సభ నియోజకవర్గాల వారీగా పరిశీలకులను ఏర్పాటు చేసి వారి సమక్షంలో సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేసే కార్యక్రమాన్ని చేపట్టింది.

ముఖ్యంగా జిల్లాలో ప్రధాన పదవులకు ఐదేండ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేయాలనే నిబంధనను విధించారు. పార్టీలో పనితీరు, ప్రజా సంబంధాలు, అంకిత భావం తదితర విషయాలను పరిగణలోకి తీసుకోనున్నారు. ఇదే సమయంలో ఇతర పార్టీల నుండి ఎన్నికల సమయంలో వచ్చేవారికి పదవులు దక్కే అవకాశం లేదు. ప్రధానంగా డిసిసి పదవిని ఆశిస్తున్న పలువురు నేతలు వారి నాయకుల సిఫారసు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు.

**కత్తి మీద సాములా డిసిసి అధ్యక్షుని ఎంపిక :**

ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు, మరో ఇద్దరు శాసన సభ్యులు ఉండి కాంగ్రెస్‌కు బలమైన జిల్లాగా ఉన్న నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుని ఎంపిక కత్తి మీద సాములా మారింది. మంత్రులు వారి నియోజకవర్గాలతో పాటు మిగిలిన నియోజకవర్గాల్లోనూ ప్రభావం చూపుతున్న నేపథ్యంలో పరిశీలకులకు జిల్లా అధ్యక్షుని ఎంపిక కత్తి మీద సాములా తయారైంది. కాంగ్రెస్ పార్టీలో భిన్న భావజాలం ఉండదని, వర్గాలకు తావు లేదని, భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉంటాయని పరిశీలకులు చెబుతున్నా అందుకు అనుగుణంగా నాయకుల మధ్య సమన్వయం అంతగా ఉన్నట్లుగా కనిపించడం లేదు.

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే నేపథ్యంలో పరిశీలకులు డిసిసి అధ్యక్షుని ఎంపికపై ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ముగ్గురు మంత్రులతోపాటు ఒక ఎంపి, మరో రాజ్యసభ సభ్యురాలు, ముగ్గురు శాసన సభ్యులు ఉండడంతో ఆశావహులు తమ నాయకుల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పరిశీలకులు ఏ ప్రాతిపదికన అధ్యక్షున్ని ఎంపిక చేస్తారో వేచి చూడాలి.

## ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇల్లు

### స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించండి

### ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలో 1,4,12 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్లకు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ భూమి పూజ కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఇళ్లు నిర్మించుకుంటున్న దంపతులకు సాంప్రదాయబద్ధంగా నూతన వస్త్రాలను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడికీ ఇల్లు నిర్మించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని దాదాపుగా 500 ఇళ్లు మంజూరు చేసి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరాలనే ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున తీసుకొని అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు కట్టించి రూ. 5లక్షలు ఆర్థికసహాయాన్ని అందిచండంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆశీర్వదించాలని, మీ అందరినీ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, దార్న రాజశేఖర్, మిట్టపల్లి నాగి, పాలేటి నర్సింహారావు, కొప్పురావూరి శబరినాథ్, గుడిపూడి సురేష్, కట్ల నాగరాజు, కంభంపాటి సత్యనారాయణ, దురిశెట్టి నర్సింహారావు, ముత్యాల కోటి, కురిశెట్టి వెంకటేశ్వర్లు, ఖమ్మం మీరా, రేచర్ల నాగేశ్వరరావు, మోరు శ్రీకాంత్, అధికారులు, మున్సిపాలిటీ కమీషనర్ చింతా వేణు, హౌసింగ్ డిఇ, ఎఇ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మం సిపిఐ జిల్లా మహాసభలు






**ప్రజాపక్షం/మధిర :** చైతన్యానికి ప్రతీకగా చెప్పుకునే మధిర భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా 23వ మహాసభలకు అతిథ్యం ఇవ్వనుంది. ఈనెల 19, 20 తేదీల్లో అమరజీవి పోటు ప్రసాద్ నగర్ (రెడ్డి గార్డెన్స్)లో జరగనున్నాయి. మహాసభల ఏర్పాట్లను ఆహ్వాన సంఘం పూర్తి చేసింది. మధిర పట్టణాన్ని పార్టీ జెండాలు, తోరణాలతో ముస్తాబు చేశారు. మహాసభల జయప్రదం కోరుతూ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మహాసభల ప్రాంగణానికి పోటు ప్రసాద్‌నగర్‌గా నామకరణం చేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసి అమరులైనవారిని స్మరిస్తూ స్మారక ద్వారాలను ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ కర్నాటి రాంమోహన్‌రావు, కార్యదర్శిగా బెజవాడ రవి, కోశాధికారి ఊట్ల కొండలరావు, ఎంఎ.రహీం తదితరులు వ్యవహరిస్తున్నారు. సిపిఐ జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరు కానున్నారు. సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తదితరులు అతిథులుగా హాజరుకానున్నారు. మహాసభల ప్రారంభ సూచికంగా అరుణ పతాకాన్ని పువ్వాడ నాగేశ్వరరావు ఉదయం 9.30 గంటలకు ఆవిష్కరించనుండగా అమర జ్యోతిని రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా వెలిగించనున్నారు. మహాసభ అమరులకు నివాళులర్పించిన అనంతరం రాజకీయ రిపోర్టును కూనంనేని, కార్యక్రమాల నివేదికను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రవేశపెట్ట నున్నారు.



## బానోతు మదన్‌లాల్ కుటుంబ సభ్యులను పరామర్శించిన కెటిఆర్

### మళ్లీ మంచి రోజులు వస్తాయని భరోసా

**ప్రజాపక్షం/వైరా :** దివంగత వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కలిసి ఖమ్మం కవిరాజునగర్‌లో స్వర్గీయ బానోతు మదన్‌లాల్ నివాసం నందు మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మదన్‌లాల్ సతీమణి బానోతు మంజుల, కూతురు, అల్లుడు మనీషా లక్ష్మి అశోక్, మదన్‌లాల్ అన్న సుందర్‌లాల్‌ను కెటిఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ సతీమణి మంజులకు కల్వకుంట్ల తారక రామారావు ధైర్యంగా ఉండాలని మంచి రోజులు వస్తాయని భరోసా ఇచ్చారు. నివాళి అర్పించినవారిలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, బానోతు చంద్రావతి, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ తదితరులు ఉన్నారు.

## లక్ష్మీదేవిపల్లిలో సిపిఐకి తిరుగులేదు

### గ్రామ గ్రామాన ఎర్ర జెండా ఎగరాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా



**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి :** లక్ష్మీదేవిపల్లి మండలంలోని హమాలీ కాలనీ నందు సిపిఐ మండల 4వ మహాసభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చంద్రగిరి శ్రీనివాసరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పాల్గొని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐ పార్టీ పురుడు పోసుకున్న గడ్డ లక్ష్మీదేవిపల్లి మండలం అన్నారు. మండలంలో పలు ప్రాంతాల అభివృద్ధికి సిపిఐ నాటి నుండి నేటి వరకు అనేక రకాల పోరాటాలను నిర్వహించి ప్రజల శ్రేయస్సే పరమావధిగా భావించి సమస్యల పరిష్కారం దిశగా పని చేసిందని తెలిపారు.

మండలంలో పోడు భూములు, అంబసత్రం భూముల సమస్యల పరిష్కారానికి సైతం భారత కమ్యూనిస్టు పార్టీ ముందుండి ప్రజల పక్షాన నిలబడిందని గుర్తు చేశారు. మండలంలో పలు ప్రాంతాలను సిపిఐ పార్టీ నిర్మించి ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి బాటలు వేసిందని తెలిపారు. మండలంలో ఎటువంటి ఎన్నికలనైనా జయించగలిగే పటిష్టమైన నాయకత్వాన్ని కలిగి ఉన్నారు. ఈ ప్రాంతం పూర్తి ఏజెన్సీ ప్రాంతమై ఉన్న ఇక్కడి ప్రజల అభివృద్ధికి ఎటువంటి ఆటంకం లేకుండా ప్రజాసేవే ముఖ్యమని భావించే నాయకత్వాన్ని కలిగి ఉన్నామన్నారు. ఈ సందర్భంగా హమాలి సంఘం నాయకులు జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావును శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కల్లూరు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, చంద్ర నరేంద్ర, సలిగంటి శ్రీనివాస్, వెంకట నరసయ్య, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, గోవిందు,లింగయ్య, రవి, ఉపేందర్, కృష్ణ, రాజు, పూర్ణచందర్ రావు, రాంప్రసాద్, మాధవ్ రావు, కరిష రత్నకుమారి, మామిడాల ధనలక్ష్మి, మంద నిర్మల పాల్గొన్నారు.

## మహాసభలలో భవిష్యత్తు కార్యాచరణ

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా మహాసభలు ఈనెల 19, 20 తేదీల్లో మధిరలో జరగనున్నాయని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. మహాసభలలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు.

శుక్రవారం జిల్లా కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు, పూర్తి కాలపు కార్యకర్తల సంయుక్త సమావేశం రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సురేష్ మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామ, మండల మహాసభలను పూర్తిచేసుకుని మధిరలో జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 600మంది ప్రతినిధులు హాజరయ్యే మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తదితరులు హాజరుకానున్నట్లు సురేష్ తెలిపారు. కేంద్రంలోని బిజెపి రైతులు, వ్యవసాయ, కార్మికులకు సంబంధించి వివక్ష పూరిత వైఖరిని అవలంభిస్తుందన్నారు. ప్రశ్నించే హక్కును, జీవించే హక్కును హరించే క్రమంలోనే నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చిందన్నారు. దేశ ప్రజలకంటే మత ప్రయోజనాలే మోదీ సర్కార్‌కు ప్రధానంగా మారాయని సురేష్ ఆరోపించారు. మతతత్వ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని సురేష్ తెలిపారు. మావోయిస్టుల సాయుధ పోరాటాన్ని సాకుగా చూపి అమాయక ఆదివాసీలను కాల్చి చంపడాన్ని సిపిఐ వ్యతిరేకిస్తుందని, అదే సమయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అహంకారపూరిత ప్రకటనలను సైతం ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆశలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలేదని సురేష్ తెలిపారు. ఆరు గ్యారెంటీలను తక్షణం అమలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. రైతాంగ, కార్మిక, మహిళ, యువత, విద్యార్థి సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని తదనుగుణంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని సురేష్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె.జానిమియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబి అధికారుల తనిఖీలు

### పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో

### రూ.50 వేలు స్వాధీనం



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ డివిజన్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు సిబి డిఎస్‌పి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేశారు. ఉదయం 11:45 నిమిషాలకు కార్యాలయానికి చేరుకొన్న ఎసిబి అధికారులు ముందుగా కార్యాలయ అధికారులు, సిబ్బంది, పనుల కోసం వచ్చిన వారి సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొన్నారు. మొత్తం కార్యాలయాన్ని దిగ్బంధనం చేశారు. అనంతరం ప్రతీ సెక్షన్ గదిలో నిశితంగా రికార్డులను పరిశీలించారు. కార్యాలయ మేనేజర్ ఎల్‌వి.సత్యనారాయణను ప్రత్యేకంగా విచారించారు. మధ్యాహ్నం 2.గం.వరకు సోదాలు పూర్తి కాకపోవటంతో సిబ్బందిని భోజనాలకు అనుమతిచ్చారు. అనంతరం విచారణ కొనసాగుతూనే ఉంది. కమిషనర్ కె.సుజాత అందుబాటులోకి రాకపోవటంతో ఆలస్యం అవుతుందని సమాచారం. పూర్తి కాకపోవటంతో ఎసిబి అధికారులకు ఎవరు దొరికారో, ఎంత లంచం పుచ్చుకొన్నారో అని ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. కాగా అధికారిక కార్యక్రమాల్లో ఉన్న కమిషనర్ కె.సుజాత ఐదున్నర గంటలకు పాల్వంచ కార్యాలయానికి చేరుకోవడంతో ఆమెను విచారిస్తున్నారు. గత కొద్ది రోజులుగా కార్యాలయంలో ఓ నవీన అధికారి ప్రతీపనికి ముడుపులు తీసుకొని మాత్రమే పనులు చేస్తున్నారని తీవ్రమైన ఆరోపణలు వచ్చిన నేపద్యంలో అందరి చూపు ఆ అధికారిపైనే పడింది. ఎంతకూ విచారణ పూర్తి కాకపోయేవరకు పట్టణ వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయంపై పలు చర్చ సాగుతోంది.

**ఉన్నతాధికారుల ఆదేశాలతో :** గత కొద్ది రోజులుగా కార్యాలయంలో పనులు నత్త నడకగా సాగుతున్నాయని, అధికారులు తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని, ప్రజల పట్ల చులకన భావంతో చూస్తున్నారని ఎసిబి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చాయని, వారి ఆదేశాలతో కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నామని ఎసిబి డిఎస్‌పి రమేష్ తెలిపారు. రికార్డులను పరిశీలించగా కొన్ని తప్పులను గుర్తించామన్నారు. అనధికారికంగా గుర్తించిన కొంత నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. ఇంకా విచారణ పూర్తి కాలేదని స్పష్టం చేశారు. విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

**సెల్‌ఫోన్‌తో సమాచారం చేరవేత :** ఎసిబి అధికారులు మున్సిపల్ కార్యాలయంలో సోదాలు నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొన్నారు. ఈ సమయంలో కార్యాలయానికి చేరుకొన్న కొందరి వద్ద నుండి కార్యాలయ సిబ్బంది సెల్‌ఫోన్ తీసుకొని జరుగుతున్న వివరాలను ఎసిబి అధికారులకు తెలియకుండా బయటకు, తమకు చెందిన వారికి చెప్పటం గమనార్హం. ఈ విషయం సిసి పుటేజ్ ద్వారా తెలుసుకోవచ్చని పలువురు అంటున్నారు.

## మంత్రి వర్సెస్ మాజీ మంత్రి



### పొంగులేటి కాదు బాంబులేటి అన్న కెటిఆర్

### ప్రజా ధనం లూటీ చేసిన కేసిఆర్ కుటుంబం : పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మం :** మంత్రి, మాజీ మంత్రి మధ్య పరస్పర విమర్శలు రాజకీయ వేడిని రగిలించాయి. మాజీ మంత్రి కెటిఆర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఖమ్మంలో మదన్‌లాల్ కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు తల్లి మరణించడంతో పరామర్శకు వచ్చిన కెటిఆర్ స్థానిక బిఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కెటిఆర్ మాటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు పర్యటనలో పొంగులేటి కౌంటర్లు వేయడంతో పాటు వారిద్దరి మధ్య పదునైనా విమర్శలు సాగాయి. మాజీ మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ ఆయన పొంగులేటి కాదని బాంబులేటి అని గత దీపావళికే పేలతాయన్న బాంబులు మళ్లీ దీపావళి వస్తున్న పేల్చలేదన్నారు. మేము ఉచ్చులో పడ్డామని ఆ మంత్రి విమర్శించారని ఉచ్చు.... లాంటిది ఏది లేదంటూ కెటిఆర్ తెలిపారు. ఆయన ఇంటిపై ఐటి సోదాలు జరిగి సంవత్సరం కావస్తున్నా అసలు ఏమి జరిగిందో వెల్లడించడం లేదని ఇయన బిజెపితో మిలాఖత్ అయ్యారని కెటిఆర్ ఆరోపించారు. కోడంగల్ వద్ద నాలుగు వేల కోట్ల రూపాయల కాంట్రాక్ట్ పొందాడని రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అత్యధికంగా పొంగులేటి లబ్ధి పొందుతున్నాడని కెటిఆర్ ఆరోపించారు. పొంగులేటి ఇంట్లో డబ్బులు దొరికాయని, డబ్బులు లెక్కించడానికి మిషన్లు పోతున్నాయని మీడియా స్క్రోలింగ్ ఇచ్చిందని ఎంత డబ్బు దొరికిందో చెప్పకపోవడానికి గల కారణం బిజెపితో మిలాఖతేనని కెటిఆర్ స్పష్టం చేశారు. కెటిఆర్ విమర్శలను పొంగులేటి అదే రీతిలో తిప్పికొట్టారు. కెటిఆర్ విమర్శలను అదే పదునైనా భాషతో తిప్పికొట్టారు. కేసిఆర్ కుటుంబం ఈ రాష్ట్రాన్ని దోచుకుందని దోచుకున్న డబ్బుతో విదేశాల్లో బతకడం తప్ప తెలంగాణలో మరోసారి అవకాశం లేదన్నారు. గతంలో ఖమ్మంజిల్లా నుంచి ఒక అభ్యర్థిని కూడా అసెంబ్లీ గేటు తాకనివ్వనని సవాల్ విసిరి ఒక్కరిని కూడా గెలవనివ్వ లేదని ఇప్పుడు కూడా స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు గెలవరని పొంగులేటి తెలిపారు. విదేశాల్లో బతకాల్సిందే తప్ప ఇక్కడ తిరిగి రాజకీయ అవకాశం లేదన్నారు. నెలకొకసారి ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చి సొల్లు చెబుతున్నారని గడిచిన పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని ప్రజలు ఆ విషయాన్ని మరిచిపోలేదన్నారు. రాజకీయ పార్టీల మధ్య విధాన పరమైన విమర్శలు ఉండాల్సిన పరిస్థితిలో వీరిరువురి మధ్య వ్యక్తిగత ఆరోపణలు పతాక స్థాయికి చేరాయి. ముమ్ముందు ఎటువంటి విమర్శలను చూడాల్సి ఉంటుందో వేచి చూడాల్సిందే.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## రేషన్‌కార్డులు పంపిణీ



ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : ఎల్బీనగర్ లోని ఏవన్ కన్వెన్షన్ హాల్ నందు శుక్రవారం నిర్వహించిన ఇందిరా మహిళ శక్తి సంబరాలు, రేషన్ కార్డుల పంపిణీలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖా మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో 42 డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ పాల్గొన్నారు. గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ మంత్రి కొండసురేఖ రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభించారన్నారు. 42వ డివిజన్‌కు చెందిన బూర నవ్యకు రేషన్ కార్డు అందించినందుకు మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు.

## ముమ్మరంగా అభివృద్ధి పనులు

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



ప్రజాపక్షం/హసన్‌పర్తి: ప్రజల అవసరాల దృష్ట్యా సమవుజ్జీగా అభివృద్ధి పనులు చేయిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ పరిధిలోని ఎర్రగట్టు గుట్ట, శ్రీనివాస కాలనీల్లో చిన్నపాటి వర్షానికే డ్రైనేజీ నీళ్లు ఇళ్లలోకి వస్తుందని స్థానిక నాయకులు, ప్రజల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం కాలనీలో కలియ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా సమవుజ్జీగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. వర్షకాలం సమీపిస్తున్న క్రమంలో నిర్ణీత సమయంలో నిధులు మంజూరు చేయించి రోడ్లు, డ్రైన్లు నిర్మాణాలు పూర్తి చేయిస్తామన్నారు. స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. హసన్‌పర్తి ప్యాక్స్ ఛైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి, హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి, ఆత్మకూరు వ్యవసాయ కమిటీ వైస్ ఛైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, హసన్‌పర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కాలనీకమిటీ సభ్యులు నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఏటూరునాగారం ఎంపిడిఓగా శ్రీనివాస్

ప్రజాపక్షం/ఏటూరునాగారం: ఏటూరునాగారం ఎంపిడిఓగా చిర్రవేణి శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన హనుమకొండ జిల్లా నడికుడమండలఎంపిడిఓగాపనిచేస్తూ బదిలీపై ఏటూరునాగారం వచ్చారు. ఆయన బాధ్యతలు చేపట్టగా సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇక్కడ ఎంపిఓగా పనిచేసి సేవలందించారు.

## నియామకంపై కృతజ్ఞతలు

ప్రజాపక్షం/ములుగు : జాతీయ మానవ హక్కుల కమిటీ ములుగు జిల్లా చైర్మన్‌గా తాండూరి శ్రీధర్‌ను ఎన్‌హెచ్‌ఆర్‌సి జాతీయ చైర్మన్ డాక్టర్ మహ్మద్ యానిస్ ఆదేశానుసారం రాష్ట్ర చైర్మన్ బద్దిపడగ శ్రీనివాస్ రెడ్డి, ములుగు జిల్లా చైర్మన్‌గా తాండూరి శ్రీధర్‌ను నియమించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సంస్థ విధి విధానాల ప్రకారం సద్వినియోగం చేసుకుంటానని, తన నియామకానికి సహకరించిన జాతీయ చైర్మన్ మహ్మద్ యాసిన్‌కు, రాష్ట్ర చైర్మన్ బద్దిపడగ శ్రీనివాస్‌రెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహిపాల్, చల్లూరి మహేందర్, తన నియామకానికి సహకరించిన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## స్పోర్ట్స్ యూనిఫామ్ అందజేత



ప్రజాపక్షం/మంగపేట: మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమలాపురం పాఠశాల విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ పడుచూరి మోహన్ చౌదరి జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 20 జతలు స్పోర్ట్స్ యూనిఫామ్ లు అందించారు. ఈ కార్యక్రమంలో జ్వాలాచారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మునిగాలా రాకేష్ మాట్లాడుతూ జ్వాలా ట్రస్ట్ ద్వారా ఎన్‌ఆర్‌ఐ మోహన్ చౌదరి స్పోర్ట్స్ యూనిఫామ్ ఇవ్వడం సంతోషం అన్నారు. మా ఫ్రెండ్ చెప్పగానే స్పందించి మా ఊరు విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ అందించడం చాలా గొప్ప విషయం అని, పడుచూరి మోహన్ మరెన్నో సమాజానికి పేద విద్యార్థులకు ఉపయోగ పడే కార్యక్రమాలు చేయాలనీ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, పడుచూరి మోహన్ చౌదరి విదేశాలలో ఉన్నప్పటికీ సొంత రాష్ట్రం కానప్పటికి ఫ్రెండ్ మాట ను బట్టి కమలాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ ఇవ్వడం చాల సంతోషం, ప్రభుత్వ పాఠశాల లు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం మాత్రమే కాకుండా పడుచూరి మోహన్ చౌదరి లాగా దాతలు ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు జ్వాల ట్రస్ట్ వారిచే స్పోర్ట్స్ యూనిఫామ్ అందించారు. విద్యార్థులు జ్వాలా ట్రస్ట్ వారికి పడుచూరి మోహన్ చౌదరి కి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమం లో జ్వాలా ట్రస్ట్ అధ్యక్షులు కోడెల నరేష్ ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్ ఉపాధ్యాయులు ప్రసాద్ నర్సింహా రావు, రాజేశ్వర్ రావు, వేణుమాధవ్ రెడ్డి, రమేష్, బులక్ష్మి మౌలాలి, ట్రస్ట్ సభ్యులు సమ్మారావు, అశోక్ పాల్గొన్నారు.

## అనూష మూడు ఉద్యోగాలు సాధించడం గర్వకారణం



ప్రజాపక్షం/తొర్రూరు : యువత సమయాన్ని వృథా చేయకుండా ప్రభుత్వం వెలువరించే నోటిఫికేషన్‌లను అందిపుచ్చుకొని ఉద్యోగాలు సాధించాలని ఇటీవల అనూష మూడు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని కంఠాయపాలెం గ్రామ పరిధిలోని కస్నా తండాకు చెందిన బానోతు అనూష మూడు ఉద్యోగాలు సాధించగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అనూషను ఝాన్సీరెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ యువత లక్ష్య సాధన దిశగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఉద్యోగ సాధనకు పేదరికం అడ్డుకాదని అనూష నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మోకాటి వెంకన్న, నాయకులు శ్రీనివాస్, ఉపేందర్, కుమార్, శ్రీధర్, సోమన్న, రాజు, ఐలయ్య పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత నగరంగా వరంగల్

### రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/వరంగల్: మానవాళికి ప్రాణవాయు వు అందించే మొక్కలను పెంచే బాధ్యత మనమందరం తీసుకుందామని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్ శంభునిపేట ప్రభు త్వ ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవంలో మంత్రి కొండ సురేఖ, నగర మేయర్ గుండు సంధ్యారాణి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డి ఎఫ్ ఓ అనుజ్ అగర్వాల్, ఏసీపీ శుభం, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ పోశాల పద్మలతో కలిసిమొక్కలు నాటారు. మంత్రి సురేఖ మాట్లాడుతూమాజీప్రధాని నెహ్రూ 1951లో వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారని,అప్పటినుండి ప్రతి సంవత్సరంజూలైలోవనమహోత్సవం నిర్వహిస్తూ గత సంవత్సరం 75వసంతాలు పూర్తిచేసుకున్నామని,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల మొక్కలు నాటడమే వనమహోత్సవం లక్ష్యమన్నారు. మంత్రి, మేయర్, కలెక్టర్ అధికారులు ప్రజలు విద్యార్థులతో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయి ంచారు. అనంత రం పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద, శాఖ అధికారి అనూజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, కార్పొరేటర్ పోశాల పద్మ, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మి రెడ్డి,ప్రధానోపాధ్యాయులుశారదాబాయి, అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు పరశురాములు, ఉపాధ్యాయులున్నారు.

# పదేండ్లలో ఇవ్వని రేషన్ కార్డులు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది

### రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/భీమదేవరపల్లి: గత పదేండ్లలో అందని రేషన్ కార్డులు లబ్ధిదారులకు నేడు ప్రజా పాలన ప్రభుత్వంలో అందుతున్నాయ ని రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఆయన పర్యటించారు. కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం కొత్తకొండ నుండి నారాయణగిరి వరకు రూ.4కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేసారు. ముల్కనూర్ చేరుకున్న మంత్రి మాడల్ స్కూల్ వనమహోత్సవంలో మొక్కలునాటి, పక్కనే ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రారంభించారు. ఎస్‌బిఐ బ్యాంకు నుండి కొత్తపెల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణపనులకు శంకుస్థాపన చేసారు. అనంతరం ముల్కనూర్‌శ్రీగార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతిబాటలోపాల్గొన్నారు. కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మీ , షాదీముబారక్ చెక్కు లు, స్టీల్ కిట్లు, ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇండ్ల మంజూరీ పత్రాలు పంపిణీ చేసారు. మంత్రి మాట్లాడుతూ పొన్నం ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టినస్టీల్‌బ్యాంకుకిట్లు హుస్నాబాద్ నియోజకవర్గంలోని కొహెడ మండలంలో గవర్నర్ చేతుల మీదుగా పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. జడ్‌పి సిఇఒ విద్యాలత, డిఆర్‌డిఒ మేన శ్రీను, ఆర్‌డిఒ రమేష్‌రాథోడ్, హౌసింగ్ డిఇ సిద్ధార్థ నాయక్, తహసీల్దార్ రమేష్, కోమి, ఎంపిడిఒ వీరేశం, పంచాయితీ కార్యదర్శి జంగం పూర్ణచందర్ పాల్గొన్నారు.

# పామాయిల్ రైతులకు ప్రభుత్వం ఆసరా

### మంత్రి సీతక్క




ప్రజాపక్షం/ములుగు:పామాయిల్‌సాగుతో రైతు పెట్టుబడి తక్కువ ఎక్కువ ఆదాయం పొందవచ్చునని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రిధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం గోవిందరావుపేట మండలం చల్వా యిలో పామాయిల్ రైతులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచంద్రలతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ పామాయిల్ సాగు చేయడానికిప్రభుత్వంఅండగా నిలుస్తుందన్నారు. జిల్లా లో పండించిన ఫామాయిల్ గెంజలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా ములుగు మండలంజంగాలపల్లి సమీపంలో ఫామాయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గోవిందరావుపేట మండలంలో 70 ఎకరాలలో పామాయిల్ సాగు చేయడం హర్షించదగ్గ విషయమని, ఐదు ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగుచేసిన రైతు బండమీది కుమారస్వామికి శుభాభినందనలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చునని, బై బ్యాక్, ఏర్పాటు చేయగల పంట ఆయిల్ ఫామ్ అని, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కూడా జిల్లా మంత్రి చొరవ వలన మంజూరుకావడం జరిగిందని తెలిపారు. చల్వా యి పిఎస్ ఆర్ గార్డెన్స్ వద్ద మంత్రి సీతక్క కలెక్టర్‌తో కలిసి మొక్కలను నాటారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్‌మహేందర్ జి, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి డి సంజీవరావు, డిఎండిసిఎస్‌ఓ రాంపతి, జిల్లా వ్యవసాయాధికారి సురేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి జితేందర్‌రెడ్డి, ములుగు డివిజన్ ఉద్యాన అధికారి శ్రీకాంత్, ఏటూరునాగారం డివిజన్ ఉద్యాన అధికారి కోపిరి లావణ్య, తహసీల్దారు సృజన్ కుమార్,ఏఈఓగోపాల్‌రెడ్డి,ఆయిల్‌ఫామ్ కంపెనీ ఏరియా మేనేజర్ హేమంత్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది సురేష్ ఉన్నారు.

## పార్థు ఆసుపత్రి తనిఖీ

ప్రజాపక్షం/నెక్కొండ: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని పార్థు హాస్పిటల్‌ను శుక్రవారం నర్సంపేట ఏసిపి రవీందర్‌రెడ్డి తనిఖీ చేశారు. డోర్నకల్ మండలం వెన్నారం గ్రామానికి చెందిన ఓ మహిళ నెక్కొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో లింగ నిర్ధర పరీక్షలు చేయించుకుని అనంతరంఖమ్మంలో ఒక హాస్పిటల్లో అబార్షన్ చేయించుకోవాలనిప్రయత్నించగాహాస్పిటల్‌యాజమాన్యంఖమ్మండియంహెచ్ఓకుసమాచారం ఇచ్చారు.ఖమ్మం పట్టణంలోని కానాపురం హైవే పోలీస్‌స్టేషన్లోజీరోఎఫ్ఐఆర్‌నమోదుచేసినెక్కొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. నెక్కొండ పోలీసులు,పిహెచ్‌సివైద్య బృందం పట్టణ కేం ద్రంలోని పార్థు హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. శుక్రవారం నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, సిఐ సన్నాయిల శ్రీనివాస్, ఎస్ఐ మహేందర్ కూడా హాస్పిటల్ తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ జరిపే పరికరాలు ఏమి కనిపించలేదు.దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## పాదయాత్ర చేసినా బిఆర్‌ఎస్‌ను నమ్మరు

### టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి

ప్రజాపక్షం/ తొర్రూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చెర్లపాలెంలో ఎంపీటీసీ క్లస్టర్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. గ్రామస్తులు ఝాన్సీరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలందరికి పదవులు వెతుక్కుంటూ వస్తాయని ఎవరు కూడా నిరుత్సాహపడవద్దన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అన్ని సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పాలకుర్తిని కాంగ్రెస్ కంచుకోటగా నిలపాలని అభ్యర్థించారు. ప్రజా వ్యతిరేకతతో ఓడిపోయిన బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నేతలు పాదయాత్రలు చేస్తున్నారని, పాదయాత్రలు చేసినా గెలిచేది, నిలిచేది కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండల కో ఆర్డినేటర్లు ఎర్రబెల్లి రాఘవ రావు, జాటోతు నెహ్రూనాయక్, చెర్లపాలెం ఎంపీటీసీ క్లస్టర్ కో ఆర్డినేటర్ పెరటి యాకూబ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ధరావత్ రాజేశ్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, బ్లాక్ కాంగ్రెస్‌మహిళా అధ్యక్షురాలు పింగిలి ఉష తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/జనగామ/స్టేషన్‌ఘనపూర్: కోటీ మంది మహిళల్ని కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం స్టేషన్‌ఘనపూర్ మండల కేంద్రంలోని సిరిపురం గార్డెన్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ స్థాయి ఇందిర మహిళశక్తి సంబరాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో ప్రతి మహిళ కోటీశ్వరురాలు కావాలని కడియం ఆకాంక్షించారు. ఒక మహిళ తన కుటుంబం కోసం తన అభివృద్ధి కోసంయ 50వేలు సంపాదించడమే కాక తనతో పాటు నలుగురికి ఉపాధి చూపెట్టడం గొప్ప విషయంగా భావించాలన్నారు. మహిళలు తలుచుకుంటే సాధించనిది ఏదీ లేదని తాను మహిళల పక్షపాతినన్నారు. తన నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రతి మండలంలోనూ బస్సు, పెట్రోల్ బంక్ సోలార్ పవర్ ప్లాంట్ వంటివి తప్పనిసరిగా మంజూరు చేయిస్తానన్నారు. మీలో ఉన్న శక్తిని సమాజం గుర్తించదని, మండల సమాఖ్యల భవనాలకు చర్యలు తీసుకుంటామని, సంపాదనతో పాటు పిల్లల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని, చెడు వ్యసనాలకు బానిక కానీయరాదని, క్రమశిక్షణలో పెడుతూ ఉన్నత చదువులు చదివించాలన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ స్టేషన్‌ఘనపూర్ మహిళల శక్తి గొప్పదని ప్రశంసించారు. అ మ్మ ఆదర్శ పాఠశాలల ఛైర్మ న్లు అంటే మాములు విష యం కాదని గ్రామానికే ఆద ర్శ వ్యక్తులన్నారు. నిర్ణీత సమయానికి ముందేస్కూల్ డ్రెస్ లు ఇవ్వడం జరిగిందని, ప్రతి మ ండలంలో ఇందిరా మహిళా క్యాం టిన్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆగస్టు 15 లోపు వనిత టీ స్టాల్స్ 50 వరకు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు వ్యాపారాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జూలుకంట్ల లావణ్య, ఆర్డిఓ డిఎస్ వెంకన్న, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి వసంత, డిపిఎం నళిణి, మున్సిపల్ కమీషనర్ రాధాకృష్ణ పాల్గొన్నారు. అనంతరం వడ్డీలేని రుణాలు, భీమా చెక్కులు పంపిణీ చేశారు.

# మహబూబాబాద్‌లో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

### తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరాం నాయక్

ప్రజాపక్షం/మహబూబాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం మహబూబాబాద్‌లో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ను ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరాంనాయక్ డిమాండ్ చేశారు.మహబూబాబాద్ పట్టణంలోని పెరుమాళ్ళ జగన్నాథం భవన్ లో బానోత్ వెంకన్న అధ్యక్షతన జరిగిన తెలంగాణ గిరిజన సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జిల్లాలో ఎంపి, ఎమ్మెల్యే నుండి సర్పంచ్ దాకా గిరిజనులే ప్రజాప్రతినిధులుగా ఉన్నా గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ట్రైకార్ సంస్థలో రుణాల కోసం వేలాది మన గిరిజనలు అర్హత సాధించి, చెక్కులు సిద్ధమైనా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయడం లేదన్నారు. మంత్రి పదవుల కేటాయింపులో సామాజిక న్యాయాన్ని అమలు చేశామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం 10 శాతం ఉన్న గిరిజనులకు కేవలం ఒక మంత్రి పదవి ఇచ్చి గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి భూక్య హరి నాయక్, మాలోత్ కిషన్ నాయక్, గూగులోత్ పార్వతి, భుక్య పుల్ సింగ్ నాయక్, బానోత్ రెడ్యానాయక్, కళ్యాణ్ నాయక్, వెంకన్న నాయక్, వివిధ మండలాల నుండి సంఘం కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం : చల్లా ధర్మారెడ్డి

ప్రజాపక్షం/పరకాల : కొద్దిరోజుల్లో జరగనున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలలో అధికార కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల పట్టణంలోని పద్మశాలి భవన్ లో నియోజకవర్గంలోని పరకాల,నడికూడ మండలాలకు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన వెంటనే తెలంగాణలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగితే బిఆర్ఎస్ పార్టీకి తీవ్రమైన నష్టం జరిగేదని, ఇప్పుడు అదే నష్టం కాంగ్రెస్ పార్టీకి జరుగుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోవల్లమాలిన హామీలు ఇచ్చిందని, వాటిని తీర్చలేక నానా తంటాలు పడుతుందని తీవ్రంగా విమర్శించారు.

## కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా మార్చండి

### రాష్ట్ర ఉద్యమకారుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ

ప్రజాపక్షం/హనుమకొండటౌన్: వరంగల్ ట్రై సిటీ తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద నగరం అయినప్పటికీ ప్రజల ఆకాంక్షల మేరకు ఎదగడం లేదని, హైదరాబాద్ స్టేట్ లో భాగంగా ఆనాటి కాలంలో స్థాపించబడిన ఆజం జాహీ మిల్లు రెండు దశాబ్దాల క్రితమే మూతబడిందని, ఎగుమతులు చేసే లెదర్ పరిశ్రమ అంతరించిపోయిందని,వేలాదిమంది పేద మహిళలలకు కొద్దో గొప్పో ఉపాధి ఆదాయాలు కల్పించే బీడీ పరిశ్రమ పూర్తిగా అంతరించిందనీ, ఉమ్మడి రాష్ట్రం లో కాని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కూడా ఉపాధి ఉద్యోగాలు కల్పించే నూతన విశ్రమలు స్థాపించలేదని రాష్ట్ర ఉద్యమకారుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ ఒక పత్రికా ప్రకటనలో ఆందోళన చెందారు. కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, రైల్వే శాఖ మంత్రి వైష్ణవ్ దేవ్ నేడు కాజీపేట జంక్షన్, కోచ్ ఫ్యాక్టరీ లను సందర్శిస్తున్న సందర్భంలో వారికి ప్రొఫెసర్ వెంకట్ నారాయణ విజ్ఞప్తి చేస్తూ నైజాం కాలంలో ప్రారంభించబడిన రైల్వే జంక్షన్ కాజీపేట దేశంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాలకు వారధిగా నిలబడి ప్రతిరోజు లక్షలాదిమంది ప్రయాణికులకు, వస్తు రవాణాకు ఉపయోగపడు తున్నదని, నాలుగు దశాబ్దాల నుండి నిర్లక్ష్యానికి గురి అయి న ప్రజల ఆకాంక్ష రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తుతం నిర్మాణంలో ఉందనీ తెలిపారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం రైల్వే స్టేషన్లుడివిజన్లుగా,జోనల్ కేంద్రంగా అభివృద్ధి చేయడం జరిగిందనీ, ఉత్తర తెలంగాణలోని ప్రధాన రైల్వే కేంద్రం కాజీపేట జంక్షన్ ను కూడా డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయడం వలన వరంగల్ మహానగరం మరింత అభివృద్ధి కావడానికి ఉపయోగపడుతుందని వరంగల్ ఉమ్మడిజిల్లాప్రజలపక్షానఇద్దరు కేంద్ర మంత్రు లు జి కిషన్ రెడ్డి, రైల్వే శాఖ మంత్రి వైష్ణవ్ దేవ్ లను ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారన్నారు. అదేవిధంగా ఉదయం ఏడు గంటల నుండి 9 గంటల వరకు కాజీపేట నుండి విజయవాడ వైపు వెళ్లడానికి ఎక్స్ప్రెస్ రైల్ ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అభ్యర్థించారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి

### మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్




ప్రజాపక్షం/మహబూబాబాద్: కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో మహిళలకు ప్రతిరోజు బతుకమ్మ పండుగేనని, మహిళాల అభ్యున్నతికి ప్రభుత్వం అందించే సహకారాలను అందరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని యశోద గార్డెన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు, బ్యాంకు లింకేజ్, రుణాలు లోన్ బీమా పథకం చెక్కుల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో పాల్గొన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే డా భూక్యా మురళీ నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలోని 4 మండలాలకు చెందిన బ్యాంకు లింకేజ్ 3033 గ్రూపులకు 241.58 కోట్ల రూపాయలు , వడ్డీ లేని రుణాలు 10652 గ్రూపులకు 11.58 కోట్ల రూపాయల,లోన్ బీమా, ప్రమాద బీమా చెక్కులు 35 మంది సభ్యులకు రూ. 67.43 లక్షల చెక్కులు పంపిణీ చేశామన్నారు . దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఇందిరమ్మ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అన్నారు, ఆర్డీఓ కృష్ణవేణి , డిఆర్‌డిఓ మధుసూదన్ రాజు, అదనపు డిఆర్‌డిఓ శ్రీనివాస్,జిల్లా సమైక్య అధ్యక్షులు స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

# రీల్







## 21న 'హరి హర వీరమల్లు' ప్రీ రిలీజ్

పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్‌గా జ్యోతి కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా హరి హర వీరమల్లు. ఏ ఏం రత్నం సమర్పణలో నిర్మించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈనెల 21న జరుగనుంది. హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో సాయంత్రం 6గంటలకు ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి పవన్ కళ్యాణ్‌తో పాటు సినిమాలో నటీ నటులు, సాంకేతిక నిపుణులు అందరూ హాజరవుతారు. సెన్సార్ బోర్డు నుంచి యే/ఏ సర్టిఫికెట్ పొందిన ఈ సినిమాను ఈనెల 24న విడుదల చేయనున్నారు. ఎంఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందించారు.

### ప్రీ రిలీజ్‌కు అతిథిగా కర్నాటక మంత్రి

హరి హర వీరమల్లు సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరుగనున్న నేపథ్యంలో అతిథిగా హాజరు కావాలని కర్నటక రాష్ట్ర అటవి, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేను నిర్మాత ఏఎం రత్నం ఆహ్వానించారు. పవన్ కళ్యాణ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.



## 'సైమా' ఈవెంట్ డేట్స్ ఫిక్స్..

దక్షిణాది సినిమాలు, అందులో ప్రతిభ కనబరిచిన వారికి ఇచ్చే అవార్డులు 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ 2025' (సైమా). 12 ఎడిషన్లు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ ఏడాది జరగనున్న 13వ 'సైమా' వేడుక తేదీలు ఖరారయ్యాయి. సెప్టెంబరు 5, 6 తేదీల్లో జరగనున్నాయి. దుబాయ్ వేదిక కానుంది. నామినేషన్స్ జాబితాను త్వరలో విడుదల చేయనున్నారు. గత రెండు సంవత్సరాలుగా దుబాయ్‌లోనే వేడుకలు జరిగాయి. 2012లో ఈ వేడుకలు మొదలయ్యాయి. కొవిడ్ కారణంగా 2020లో ఈవెంట్ నిర్వహించలేదు. అత్యధికంగా ఐదు సార్లు దుబాయ్ వేదికైంది. 9వ ఎడిషన్ హైదరాబాద్‌లో జరిగింది.




## సుమతిశతకం పోస్టర్ విడుదల

నటుడు అమీర్ దీప్ హీరోగా చేయాలి చౌదరి హీరోయిన్‌గా తెరకెక్కుతున్న సుమతి శతకం సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. హీరోయిన్ సయాలి జన్మదినం సందర్భంగా హీరోయిన్ విశేష్ చెప్తూ ఆమె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఆమె అందంగా చీర కట్టుకుని ట్రెడిషనల్ లుక్ లో కనిపిస్తోంది. విజన్ మూవీస్ బ్యానర్‌పై ఈ సినిమాను సుభాష్ ఆనంద్, కొమ్మాల పాటి సాయి నిర్మిస్తున్నారు. ఇతర పాత్రల్లో తేజ, మిర్చి కిరణ్, విట్టా మహేష్, బండారు నాయుడు తదితరులు నటిస్తున్నారు.






## 'సార్ మేడమ్' ట్రైలర్ రిలీజ్

తమిళ హీరో విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ జంటగా నటిస్తున్న రోమ్ కామ్ ఫ్యామిలీ డ్రామా 'సార్ మేడమ్'. 'ఏ రగ్‌డ్ లవ్ స్టోరీ అనేది ట్యాగ్ లైన్. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్ పై సెందిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. 'సార్ మేడమ్'. సినిమాకు సంబంధించిన ట్రైలర్ రిలీజ్ చేశారు. 'నాతో వస్తే లైఫ్ ఎలా ఉంటుందో ఆలోచించకుండా నేనే కావాలని వచ్చేశావు. మా అమ్మానాన్నే నన్ను ఇలా చూసుకోలేదని వాళ్ళే తిట్టుకునే విధంగా నిన్ను చూసుకుంటా' అని విజయ్ సేతుపతి డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. విజయ్ సేతుపతి, నిత్యామీనన్ మధ్య వచ్చే గొడవలు చాలా వినోదాత్మకంగా ఉన్నాయి. పెళ్లి చూపులు, పెళ్లి లాంటి బ్యూటిఫుల్ ఎమోషన్స్‌తో మొదలైన ట్రైలర్ 'మమ్మల్నిద్దర్నీ విడదీసేయండి' అని నిత్యామీనన్ చెప్పిన డైలాగ్‌తో ఊహించని మలుపు తీసుకోవడం ఇంట్రెస్టింగ్గా ఉంది. పరోటా మాస్టర్‌గా విజయ్ సేతుపతి కనిపించిన సీన్స్ నవ్వులు పూయించాయి. ఈ ఫ్యామిలీ ఎంటర్ టైన్ తో పాటు యాక్షన్ కూడా ఉంది. విజయ్ సేతుపతి మరోసారి తన సహజమైన నటనతో ఆకట్టుకున్నారు. విజయ్ సేతుపతి, నిత్యామీనన్ కెమిస్ట్రీ స్పెషల్ హైలట్‌గా నిలిచిందని దర్శకుడు పాండిరాజ్ తెలిపారు. సంతోష్ నారాయణన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ ఫన్, ఎమోషన్ సీన్స్ మరింతగా ఎలివేట్ చేసింది. డిఓపి ఎం సుకుమార్ అందించిన విజువల్స్ బ్యూటీఫుల్‌గా వున్నాయి. ఈ సినిమా జూలై 25న థియేటర్లలో దుదల కానుంది.

## నువ్వుంటే చాలే..

### పాట విడుదల

సాగర్ అనే కుర్రాడు మహాలక్ష్మిని ప్రేమించాడు. ఆమెనే తన ప్రాణం అనుకున్నాడు. కానీ తరువాత ఏం జరిగింది అనేదే ఆంధ్ర కింగ్ తాలుక సినిమా కథ. ఈ సినిమాలోని నువ్వుంటే చెలియ అనే పాటను విడుదల చేశారు. రామ్ సేజ్ రాసిన ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. రామ్ పోతినేని హీరోగా, భాగ్యశ్రీ హీరోయిన్‌గా నటిస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తి కావొచ్చింది.

## నాన్న నీకు ప్రేమతో..

### పాట ఆవిష్కరణ

నివాస్, అమితశ్రీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'తెలియదు గుర్తు లేదు మర్చిపోయా'. ఈ చిత్రంలో ఇతర కీలక పాత్రల్లో 30 ఇయర్స్ పృథ్వీ, వినోద్ కుమార్, రఘు బాబు, భరద్వాజ్, ఖయ్యూం నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని చెన్నా క్రియేషన్స్ బ్యానర్‌పై శరత్ చెన్నా నిర్మిస్తున్నారు. దర్శకుడు వెంకటేష్ వీరవరపు రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలోని నాన్న నీకు ప్రేమతో అనే పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకటేశ్ వీరవరపు మాట్లాడుతూ తెలియదు, గుర్తులేదు, మర్చిపోయా సినిమా ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్ టైనర్. ఈ చిత్రంలో పాటలు అందర్నీ ఆకట్టుకుంటాయి. సంగీత దర్శకులు అజయ్ పట్నాయక్ స్వరపరిచిన 'నాన్న నీకు ప్రేమతో' అనే పాటను రిలీజ్ చేయడం జరిగింది. ప్రస్తుతం పోస్ట్ పోస్టులు పనులన్నీ జరుగుతున్నాయి. త్వరలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడానికి సలహాలు చేస్తున్నాం అని అన్నారు. నిర్మాత శరత్ బాబు మాట్లాడుతూ తెలియదు, గుర్తులేదు, మర్చిపోయా సినిమా పేరులో గుర్తులేదు ఉంది గానీ సినిమా మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది. ఫస్ట్ చిత్రంతోనే ఒక సక్సెస్ ఫుల్ ప్రాజెక్ట్ చేస్తామని నమ్మకంతో ఉన్నాం. అన్నారు. ఈ చిత్రానికి డీవోపీ అభిలాష్ పని చేశారు.




## కింగ్ డామ్ కోసం అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'కింగ్డమ్' యూఎస్ అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్‌లో జోరు చూపిస్తోంది. సినిమా రిలీజ్ కు రెండు వారాల ముందుగానే యూఎస్‌లోని 64 లొకేషన్స్‌లో 135 షోస్‌లకు భారీగా అడ్వాన్స్ బుకింగ్స్ జరుగుతున్నాయి. ఇప్పటిదాకా 'కింగ్డమ్' మూవీకి 15 కె (13.63 లక్షల రూపాయల) టికెట్ సేల్స్ జరిగాయి. సినిమా ట్రైలర్ రిలీజ్ కూడా చేయకముందే, ఏ ప్రమోషన్ జరపకముందే 'కింగ్డమ్' సినిమాకు ఈ స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్ జరగడం ఈ మూవీ మీద ఉన్న క్రేజ్ ను తెలియజేస్తోంది . 'కింగ్డమ్' టీజర్ రిలీజైనప్పటి నుంచే ఈ మూవీ మీద అంచనాలు భారీగా పెరిగాయి.

ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రూపొందిస్తున్నారు. భాగ్యశ్రీ భోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. 'కింగ్డమ్' సినిమా ఈ నెల 31న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.




# నెల్సన్ మండేలా జీవితం, పోరాటం ఆదర్శనీయం

### ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ సరలీకరణ విధానాలతో, ప్రజల బతుకులు అస్థిరత్వానికి, అయోమయానికి భయాందోళనలకు గురవుతున్న ఈ పరిస్థితులలో దక్షిణాఫ్రికా జాతిపిత, చీకటి ఖండం నల్ల సూర్యుడు నెల్సన్ మండేలా జీవితం, పోరాటం, ఆదర్శనీయమైనదని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అన్నారు. నెల్సన్ మండేలా 107వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో మండేలా చిత్రపటానికి కెవిఎల్, ఐప్సో రాష్ట్ర నాయకులు ఎ.రామరాజు, జె.కె.శ్రీనివాస్, సూర్య ప్రకాష్, నరేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిఎల్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం మండేలా చేసిన పోరాటం స్ఫూర్తితో ఈనాటి విద్యార్థి యువత గుండె ధైర్యంతో యుద్ధోన్మాదాన్ని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలన్నారు. దక్షిణ ఆఫ్రికాలో వలస పాలనలో చీకటి బతుకులతో దారిద్రం, నిరక్షరాస్యత, జాతి అహంకారం లాంటి అనేకమైన సమస్యలతో నిత్యం బాధలను అనుభవించిన నెల్సన్ మండేలా విద్యార్థి దశ నుండి వలస పాలనపై, సామ్రాజ్యవాదంపై కసిని పెంచుకున్నారని, యువతను మేలుకొల్పటానికి ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపించటంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. 1962 సంవత్సరం నుండి 90 వరకు జైలు జీవితాన్ని అనుభవించినప్పటికీ చెక్కుచెదరని గుండె నిబ్బరంతో తన దేశ స్వాతంత్రం కోసం, జాతి ప్రజలు అనుభవిస్తున్నటువంటి జీవన పరిస్థితుల మెరుగుపరచడం కోసం, మానవ హక్కుల సాధన కోసం విద్య,వైద్యం, స్వాతంత్రం కోసం పోరాటాలను నిర్వహించారన్నారు. ఐప్సో రాష్ట్ర కార్యదర్శి రామరాజు, జె.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ నెల్సన్ మండేలా జీవితం నిరంతరం చైతన్యాన్ని నింపుతుందని, ఆ చైతన్య స్ఫూర్తితో ఈనాడు సమాజ మార్పుకు కృషి చేయాలన్నారు. దక్షిణాఫ్రికా దేశ ప్రజల ప్రగతి కోసం, అంతర్జాతీయ సంబంధాల మెరుగుదల కోసం, శాంతి, న్యాయం, మానవ హక్కుల సాధన కోసం, అహర్నిశలు పోరాడిన నెల్సన్ మండేలా జీవితం ప్రపంచానికి ఆదర్శమన్నారు.

# సహకార సంఘాల ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి

### వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని చేనేత, మత్స్య తదితర సహకార సంఘాల ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని చేతివృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. హైదరాబాద్ హిమాయత్ నగర్ మఖ్దూం భవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో వృత్తి సంఘాల సమాఖ్య సమావేశం శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా చేనేత మొదలైన సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో సహకార వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఉపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వృత్తిదారులకు కుటుంబానికి రూ.10లక్షల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేసి, చేనేత, గీత, మత్స్య, రజక, గొర్రెల కాపరులు, కమ్మరి, కుమ్మరి తదితర వృత్తిదారుల అభివృద్ధికి సంక్షేమానికి చర్యలు చేపట్టాలన్నారు. చేనేత, కల్లు గీత కార్మికులకు ఇస్తున్న విధంగా మిగతా చేతివృత్తుల వారందరికీ 50 సంవత్సరాలకు పెన్షన్ ఇస్తామన్న వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిదారులందరి సమస్యల పరిష్కారం కోసం సంఘటిత కావాలన్నారు. గ్రామస్థాయి నుండి వృత్తి సంఘాల నిర్మాణాన్ని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పెండెం సర్వేశం, ప్రధానకార్యదర్శి పాసికంటి లక్ష్మి నరసయ్య, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దీటి నరసయ్య, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, జల్ది రాములు, చేపూరి ధనంజయ, కొలిపాక సంపత్ తదితరులు పాల్గొన్నారు.




# నేటి నుంచి కాచిగూడ-జోధ్‌పూర్ రైలు

### జెండా ఊపి ప్రారంభించనున్న కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: కాచిగూడ నుంచి జోధ్‌పూర్‌కు వెళ్లే భగత్ కీ కోఠి ఎక్స్‌ప్రెస్ నూతన రైలును నేడు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, బొగ్గుగనుల మంత్రి కిషన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఇందుకోసం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రారంభోత్సవ ఏర్పాట్లను చేసినట్లు రైల్వే సిపిఆర్ఓ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు ఈ రైలు బయలే దేరుతుందని తెలిపారు. కాచిగూడజోధ్‌పూర్ మధ్య నూతన రోజువారి రైలు సర్వీసు ప్రవేశపెట్టడం వల్ల తెలంగాణలో నివసిస్తున్న రాజస్థానీ ప్రజలకు, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. రోజువారీ రైలు సర్వీసు కోసం చాలా కాలంగా డిమాండ్ ఉంది. ఈ రైలు తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లోని ముఖ్యమైన స్టేషన్ల మధ్య వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన రైలు ప్రయాణాన్ని అందిస్తుంది. ఈ రైలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మరియు రాజస్థాన్ రాష్ట్రాలలోని నాందేడ్ వాషిమ్, ఉజ్జయిని, రత్లం, నీమచ్, చిత్తౌర్‌గఢ్, భిల్వారా, అజ్మీర్, పాలి మార్వార్ వంటి ప్రధాన న గరాలకు చేరుస్తుంది. రైలు వినియోగదారులు తమ ప్రయాణ ప్రణాళికను ప్లాన్ చేసుకునే అవకాశాన్ని అందిస్తుందని తెలిపారు. ఈనూతన రోజువారీ రైలు రిజర్వ్, అన్ రిజర్వ్ విభాగాల ప్రజల అవసరాలను తీరుస్తు హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న దేశంలోని మధ్య వాయువ్య రాష్ట్రాల ప్రజలు తమ స్వస్థలాలకు ప్రయాణించడానికి ఎక్కువగా ప్రయోజనం చేకూరుస్తుంది. వ్యాపారవేత్తలు, విద్యార్థులు, ఉద్యోగులు, సెలవుల్లో విరివిగా ప్రయాణించేవారికి ప్రత్యేక పర్యటనలకు చేసే వారికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. వాణిజ్యం వాణిజ్య మార్గాలను పెంచడంతో పాటు పర్యాటకం, తీర్థయాత్రలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది.

# కలిస్తే తప్పేంటి?

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర వ్యాఖ్యాలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శుక్రవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయించడం నిజం కాదా అని ప్రశ్నించారు. చేయడం లేదంటే లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమా అని ప్రశ్నించారు. తెలంగాణలో నికృష్ట పాలన సాగుతుందని డైవర్షన్ పాలెటిక్స్ చేస్తూ ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. ఒక రోజు ఫోన్ ట్యాపింగ్ మరో రోజు ఫార్ములా ఈకేస్, మరో రోజు డ్రగ్స్, తర్వాత కాళేశ్వరం లేదంటే కేసిఆర్ అంటూ 20 నెలలుగా తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తనపై టన్నుల కొద్ది కేసులు పెట్టించారని గుండుపిన్నంతా ఆధారం కూడా దొరక లేదని కెటిఆర్ తెలిపారు. తప్పు చేస్తే ఆధారం దొరుకుతుందని తాను ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్ష పెట్టమని అడిగిన మొట్టమొదటి రాజకీయ నాయకున్ని తానే అన్నారు. ఓటుకు నోటు కేసులో చర్చించడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి రచ్చ చేయడం తప్ప చర్చ చేయడం తెలియదన్నారు. బనకచర్ల చర్చ గురించి వెళ్లనని వెంటనే మాట మార్చి రేవంత్ రెడ్డి ఢిల్లీ ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు.

ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, మాజీ ఎంఎల్‌ఎలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఆర్‌జెసి కృష్ణ, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి :

జిల్లా అభివృద్ధి కేసిఆర్‌తోనే జరిగిందని ఇప్పుడు ముగ్గురు మంత్రులున్నా ఉపయోగం లేదని కెటిఆర్ తెలిపారు. మమత ఆసుపత్రి ఆవరణలో జరిగిన బిఆర్ఎస్ నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, సంక్షేమం కేవలం బిఆర్ఎస్ హయాంలోనే జరిగిందని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటాలని అత్యధిక స్థానాల్లో గెలిపించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# పూర్తయ్యేనా?

(మొదటి పేజీ తరువాయి)

కాజీపేట అయోధ్యపురంలోని 162 ఎకరాల్లో ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించి రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ఆధ్వ ర్యంలో టెండర్లు పిలిచారు. హైదరాబాద్‌కు చెందిన పవర్ మెక్, జపాన్‌కు చెందిన టైకి షా కంపెనీతో కలిసి పవర్ మెక్ టైకిషా జేవీ పేరుతో రూ.383 కోట్లతో ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కాంట్రాక్ట్ దక్కించుకు న్నారు. ఇదిలా ఉండగానే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరగడంతో పాటు రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం, వామపక్ష పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చాయి. దీంతో ఓవర్ హాలింగ్ వర్క్ షాప్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు 2023 సెప్టెంబర్‌లో నిర్ణయం వెలువడగా... నవంబర్ 28న రైల్వే అధికారులు అఫీషియల్‌గా ప్రకటించారు. ప్రాజెక్ట్ నిర్మాణ బడ్జెట్‌ను రూ.383 కోట్ల నుంచి రూ.680 కోట్లకు పెంచారు. ప్రతి సంవత్సరం 600 కోచ్‌లు తయారు చేసేలా ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కోచ్ లతో పాటు వందే భారత్, జర్మనీ టెక్నా లజీతో కూడిన లింక్ హాఫ్మన్ బుష్ (ఎల్ హెచ్బీ) సబర్మన్ రైళ్లకు ఉపయోగించే ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (ఈఎంయూ) వంటి కోచ్‌లను తయారు చేయనున్నారు. కోచ్ ఫ్యాక్టరీలకు సంబంధించిన ఉన్నతాధికారులు కాజీపేటకు వచ్చి నిర్మాణ పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా ఆరు వేల మందికి, పరోక్షంగా మరో ఆరు వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

### పెండింగులో ఇన్స్టాలేషన్, సివిల్, ఎలక్ట్రికల్ వర్క్స్

కోచ్ల తయారీ ఫ్యాక్టరీలో మెషినరీ ఇన్స్టాలేషన్ తో పాటు సివిల్, ఎలక్ట్రిక్ వర్క్స్ మాత్రమే పెండింగ్లో ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడిన మెషినరీలో 85 శాతం ఇప్పటికే ఫ్యాక్టరీ వద్దకు చేరుకుంది. ఆగస్ట్ నెలలో ఇన్స్టాలేషన్ పనులు మొదలుపెట్టనున్నారు. మరో 20 శాతం సివిల్, ఎలక్ట్రికల్ వర్క్ చేయాల్సి ఉంది. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి కోచ్ ఫ్యాక్టరీ వరకు వేస్తున్న ట్రాక్ పనులు చివరి దశకు వచ్చాయి. ఇంటర్నల్ రైల్వే లైన్లతోపాటు రోడ్లు, సబ్ స్టేషన్లు, వేబ్రిడ్జిలు, టెస్ట్ షాప్, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వంటి ఇతరత్రా నిర్మాణ పనులు మధ్యలో ఉన్నాయి. డిసెంబర్ నాటికి పనులు పూర్తవుతాయని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధు లు చెబుతున్నారు.

### నేడు పనులను పరిశీలించనున్న రైల్వే మంత్రి

ఈ క్రమంలో పనుల పరిశీలనకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం కోచ్ ఫ్యాక్టరీ వద్దకు రానున్నారు. కేంద్ర మంత్రితో పాటు రాష్ట్రానికి చెందిన మరో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కూడా పర్యటించి పనులు పరిశీలించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరి పర్యటన అనంతరం పనులు వేగిరం కాగలవని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతిపక్ష ఐక్యత

(మొదటి పేజీ తరువాయి)

వివక్షాపూరితంగా దోపిడీకి గురైంది. ఉద్యోగాలు లేని వృద్ధి, వ్యవసాయ సంక్షోభం, శ్రామికుల అసంఘటితీకరణ, ప్రజా సేవలను బలహీనపరచడం, సంక్షేమ కార్యక్రమాలపై దాడి ప్రజల జీవితాలను మరింత దిగజార్చాయి. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలను కొనసాగిస్తూనే అసమ్మతిని అణచివేస్తుంది. ప్రతిపక్షాన్ని విచ్ఛిన్నం చేస్తుంది' అని సిపిఐ ముసాయిదా రాజకీయ తీర్మానం పేర్కొంది. సమన్వయం లోపించిన ఇండియా కూటమిః సమన్వయం లేకపోవడం, సైద్ధాంతిక స్పష్టత లేకపోవడం, సమర్ధవంతమైన సీట్ల పంపకం లేకపోవడం ఇండియా కూటమి పనితీరుకు ఆటంకం కలిగించిందని ముసాయిదా రాజకీయ తీర్మానం తెలిపింది. 'ఈ కూటమి దాని ప్రభావాన్ని పరిమితం చేసే అనేక అడ్డంకులను ఎదుర్కొంది. సీట్ల పంపకం చర్చలు అత్యంత స్పష్టమైన, నిరంతర వివాదాంశం. అనేక భాగస్వామ్య పక్షాలు, తమ ప్రాంతీయ క్షేత్రాలను, నాయకత్వ ఆశయాలను రక్షించుకుంటూ, సాగదీస్తూ, కొన్నిసార్లు తీవ్రమైన బేరసారాలు చేశాయి. ఇది తరచుగా అతుకుల బొంత వంటి ఏర్పాట్లకు దారితీసింది. ఇది సజావుగా, సమన్వయంతో కూడిన ప్రచారానికి ఆటంకం కలిగించిందని' సిపిఐ ముసాయిదా రాజకీయ తీర్మానం పేర్కొంది. సీట్ల పంపకానికి మించి, సమర్థవంతమైన ప్రచార వ్యూహాలు, సందేశాలు, వనరుల విస్తరణను సమన్వయం చేయడంలో విఫలమైన సమన్వయ యంత్రాంగాల లోపం కారణంగా ఇండియా కూటమి దెబ్బతిన్నదని తెలిపింది. 'అనేక పార్టీలు కొన్ని ప్రాంతాలలో స్వతంత్రంగా లేదా పరస్పర పోటాపోటీగా పనిచేయడాన్ని కొనసాగించాయి. ఐక్యత అందించగల సమిష్టి బలాన్ని బలహీనపరిచింది' అని పేర్కొంది. సైద్ధాంతిక సమన్వయం లేకపోవడంతో కూటమి ఇబ్బందిపడిందని తెలిపింది. 'మన రాజ్యాంగ దృష్టికి విరుద్ధంగా ఉన్న బిజెపి నిరంకుశత్వం, మతతత్వ ఎజెండాకు వ్యతిరేకతను సభ్యులందరూ పంచుకున్నప్పటికీ, వారి రాజకీయ , సామాజిక,ఆర్థిక దృష్టి విస్తృతంగా వైవిధ్యంగా ఉంది. ఈ సైద్ధాంతిక అస్థిరత బిజెపి వ్యతిరేక భావనకు మించి విస్తృత విశ్వాసాన్ని ప్రేరేపించగల ఏకీకృత విధాన ఎజెండాను ప్రదర్శించడం సవాలుగా మారింది. భవిష్యత్తులో, ఈ అనుభవం నుండి పాఠాలు నేర్చుకోవాలి, కనీస ఉమ్మడి కార్యక్రమం ద్వారా ప్రతిపక్ష ఐక్యతను సాధించేందుక ప్రయత్నం చేయాలని' సూచించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com